సంపుటి : 15 సంచిక : 20

# సంపాదకీయం...

# స్వర్ణదీపిక

గౌరవ సంపాదకులు
శ్రీ సి.యస్. యన్. బోస్, సీనియర్‌జర్నలిస్ట్
ప్రధాన సంపాదకుడు
బ్రదర్ బి. శివాజి రాజు
అసోసియేట్ ఎడిటర్స్
డా|| కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్
బ్రదర్ వంగూరి సురేష్
తెలంగాణ న్యూస్ ఎడిటర్
బ్రదర్ ఫ్రాంక్లిన్ సుధాకర్, సికింద్రాబాద్
జిల్లా కో–ఆర్డినేటర్స్
బ్రదర్ జయప్రకాష్, చిత్తూరు
బ్రదర్ లక్కెపోగు మోజెస్ విజయకుమార్,
నెల్లూరు, సెల్ : 99633 60533
రెవ.డా|| కలిగితి విజయకుమార్, రాజోలు
సెల్ : 94400 08901
బ్రదర్ చుక్కా శామ్యూల్, కాకినాడ
సెల్ : 98493 08193
బ్రదర్ శ్యాం గుమ్మపు, నర్సాపురం
సెల్ : 94404 94284

సంవత్సర చందా : రూ. 200/–
జీవిత సభ్యత్వం : రూ. 2000/–
Central Bank of India A/C. No.1216888517
Swarna Deepika, Benzcircle Branch, Vijayawada -10
State Bank of India A/c. No.30365628812
B.Chitanya Varma, S.N.Puram Brach Vijayawada
Swarna Deepika, 28-16-18/1
Chintavari St., Arundalpet.
Vijayawada - 520 002
Ph:0866 2434277, 9392135100
srisri032003@yahoo.com
svjbellamkonda@g.mail.com
www.swarnadeepika.org



**రాబడంతటందు రాజు భాగమొసగి**
**ఆస్తి అంతటందు అలయకిమ్ము**
**కొట్లయందుకలది కొదువ గాకుండును**
**వినుము యేసుమాట వెలుగుబాట.**

సామె. 3:9

– డా|| శ్రీమతి విజయా సుందరయ్య

# స్వ'తంత్రం'

**కు**ల, మతాలకతీతమైన భారతీయుని పండుగ ఆగష్టు 15, స్వాతంత్ర్య దినోత్సవం. ప్రతి భారతీయుడు పంద్రాగస్టును అత్యంత ఉత్సాహభరితంగా జరపాలి. ప్రధానంగా ఇది క్రైస్తవులకు ప్రార్థనా దినంగా మారాలి. ప్రపంచ ప్రార్థనా దినోత్సవం మాదిరిగా మనదేశ ప్రార్థనా దినోత్సవంగా క్రైస్తవులు ప్రార్థనలు జరపాలి.

లక్షలాది ప్రజలు చేసిన అశేషత్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం లభించింది. కానీ, దేశ పౌరులందరికీ సమానహక్కులు సాధించలేకపోయింది. మెజారిటీ, మైనారిటీ అనే తేడాలేకుండా చూడలేకపోతుంది. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ లభించాలని రాజ్యాంగం నిర్దేశించింది. కాని, **1947** ఆగస్టు **15** తేదీ తర్వాత నుంచి, పరిస్థితులు క్రమంగా మారి పోతాయనకున్నాము. ఐతే, మొదట్లో నల్లదొరలు విజృంభించి, కుట్రలుపన్ని దళితులను, దళిత క్రైస్తవులను, బడుగు బలహీనవర్గాల వారిని ముస్లిం, క్రైస్తవమైనారిటీలను తమ అధికార ప్రయోజనాలకు ఉపయోగపడే ఓటు బ్యాంకులుగా తయారుచేసుకున్నారు. దానితో ఈ వర్గాల ప్రజలు పని ముట్లుగా మారిపోవడమేగాక, నిరంతర దోపిడీకి గురి అయ్యారు. నేటికీ ఇదే దుస్థితికొనసాగు తోంది. వర్గాల పేరుతో రాజకీయ పార్టీలు వచ్చాయి. పేర్లుమారినా వాటి విధానాలు మారలేదు. దేశంలో పేదరికం పెరిగిపోయింది. కొద్దిమంది చేతుల్లో అధికారం, సంపదలు కేంద్రీకృతమయ్యాయి. ఆర్థికంగా అంతరాలు పెరిగిపోతున్నాయి. మైనారిటీలు, ముఖ్యంగా క్రైస్తవులు, దళిత, బడుగువర్గాల ప్రజలు నిరుపేదల స్థాయికి దిగజారిపోతున్నారు. కుటుంబ సభ్యులందరూ పనులు చేసినా, గడవనిస్థితి ఏర్పడింది. పనులులేక ఇతర రాష్ట్రాలకు, గల్ఫ్ దేశాలకు వలస పోవడం అధికమైంది. సంపన్నులు తప్ప మరెవరూ బ్రతకలేని దుర్భరస్థితులు వచ్చాయి. మన స్వాతంత్ర్యం కొందరి స్వార్థపరుల స్వ "తంత్రం"గా తలపిస్తుంది.

ఇదిలావుండగా, క్రైస్తవ్యం మన దేశంలోవుండే దళితలకు, ఇతర నిమ్నకులాలకు చేయూతగా ఉన్నదని, అండగా ఉన్నదని, కావున క్రైస్తవులను అణచివేస్తే దళితులను, నిమ్మకులాల వారిని ఎల్లప్పుడు తమ బానిసలుగా ఉపయోగించుకోవచ్చునన్న కుట్రతో, హిందూమతోన్మాద శక్తులు ఇటీవలి సంవత్సరాలలో విజృంభించి నికృష్ట కార్యకలాపాలు ప్రారంభించాయి. మత స్వేచ్ఛను నిరాకరించడంద్వారాను, హత్యలు చేయడంద్వారాను క్రైస్తవ్యాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తున్నాయి. క్రైస్తవ్యం అంటే 'మాల మాదిగల మతం' అని హిందూ సోదరులను రెచ్చగొడుతున్నారు. ఇది విదేశీ మతమని, ప్రచారం చేస్తున్నాయి. మైనారిటీలను తక్కువ జాతివారిగా చిన్నచూపు చూస్తున్నారు. ఇది దురదృష్టకరం. ఇది ఇలాగే కొనసాగితే మరో స్వాతంత్ర్యానికి పిలుపును ఇవ్వవలసివస్తుందేమో?

దేశంలోని అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించే కార్యక్రమాలను ప్రారంభించినది క్రైస్తవ సంస్థలే. ప్రపంచ దేశాలతో సంబంధాలు కలిగి, అభివృద్ధిదిశలో పయనించాలంటే ఆంగ్లభాష అవసరం ఎంతైనా కలదని గుర్తించి మన భారతీయులు ఆ భాషకు పట్టంకట్టారు. తద్వారా ప్రపంచ దేశాలతోను సత్సంబంధాలు కలిగి, దేశపురోభివృద్ధికి దోహద పడింది. దీనికి క్రైస్తవుల పాత్ర ఎంతో విశేషమైంది. అందుకే కాబోలు ఈ మధ్య ఒక రచయిత నేటి హిందువులంతా క్రిస్టియనైజ్డ్ హిందువులు అని వర్ణించాడు. ఆయన ఇంకా ఇలా అన్నాడు. ఈ దేశంలో వున్నది అంతా సనాతనమే, కాని, అధునాతనం లేదని, ఒక వేళ అధునాతనం ఏదైనా వుంటే అది క్రైస్తవుల కారణంగా జరిగిందేనని, ఒక సనాతన ధర్మవాది నిజాన్ని నిర్భయంగా చెప్పాడు. ఇది వాస్తవం కూడ. కాబట్టి, క్రైస్తవులు బడుగు బలహీనవర్గాల ప్రజలు, ఇతర సామాన్య ప్రజలతో సహవాసం చేసి, దేశసమైక్యతను కాపాడేందుకు కృషి చేయాలి. సంఘ్ పరివార్ దుశ్చర్యలను ఎదుర్కొని అసంఖ్యాక పేద ప్రజలను కాపాడాలి. పంద్రాగస్టు పర్వదినం రోజున క్రైస్తవులు తమ సంస్థలలోను తమ కార్యాలయాలలోను జరిపే వేడుకల సందర్భంలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తూ, దేశసమైక్యత, సంక్షేమానికి పాటుపడతామని ప్రతినబూనాలి. ప్రార్థనలు జరపాలి.

– బి. శివాజిరాజు

# ఉత్తరాలు

ఎడిటర్ గార్కి, "చర్చలో" పాల్గొనడం నాకు చాలా ఇష్టం. స్వర్ణదీపిక నా ఆత్మజ్వాల, నిత్యం ఆత్మను రగిలిస్తూ లోకానికి నిప్పు అంటుకొని వేరు పడాలనేది నా ఆశ. అందుకు ఆజ్యం పోసే శీర్షికలపై చర్చ తప్పక పాల్గొనాలని పించింది. ఇతర సాహిత్యాలు చదువుతాను. వాటి సారాంశంతో బైబిలు సత్యాలు సత్యమని నిరూపిస్తుం టాను. బైబిలు చదివిన ప్రతివారు ఇతర సాహిత్యం చదవాలి. మనతో స్నేహం చేసే వాడు మనల్ని గురించి, మనం స్నేహం చేసే వాడ్ని గురించి మనం తెలిసికోవాలి. దేవుళ్లు కారుకదా లోకస్థులు! పత్రిక కొరకు ప్రార్థిస్తు న్నాను. దీనదానురాలు ప్రభువునందు

**మేడిది రాజమణి, తణుకు.**

'స్వర్ణదీపిక' ఎడిటర్ గారికి, ఇక ప్రతినెల ఈ సం॥ అంతయుపంపుతారని నమ్మ చున్నాను. పత్రిక ఆత్మీయముగాను, ప్రస్తుతము జరుగుచున్న విషయములన్నియు తెలుపుచు క్రైస్తవుల సమ్యసలను ఎత్తిచూపు చున్నందుకు, హెచ్చరించు చున్నందుకు వందనములు. మరియు కనువిప్పులు కలిగించేదిగా నున్నది. ఈ పరిచర్య ముందుకు రాబోవు దినములలో నిరాటంకముగ కొనసాగింపాలని ప్రార్థించు చున్నాను. దేవుడు మీ పరిచర్య నాశీర్వ దించును.

**జి.కమల క్రిస్టపాల్, హైదరబాద్.**

ఎడిటర్ గార్కి నమస్కారములు.
స్వర్ణదీపిక జూన్ సంచిక సువర్ణమంత విలువైనదిగా మాచేతి కందింది. కవితలు, కథలు, వ్యాసాలు అన్ని నచ్చాయి. కానీ! బైబిళ్ల ను ముడిసరుకుగా తరలించడాన్ని తలంచితే ఈ సమాజం ఎటుపయ నిస్తుందో తెలియడం లేదు. సంపాద కీయంలో మీరన్నట్టు వీరికన్నా అలనాటి యూదా ఇస్కరియోా తేమిన్న అనిపిస్తుంది. లివింగ్ స్టన్ గారి కుర్చీ కథలు వాస్తవానికి దగ్గరగావుండి నేటికాల పరిస్థితు లకు అద్దం పడుతున్నాయి. వీరికి అభినందలు, జాతశ్రీ గారి పైరుగాలి కథలోని కరుణమ్మ గారి కఠిన హృదయాన్ని కరిగించిన క్రిష్టియన్ వాడ పిల్లపెద్దలను అభినందిం చకుండా వుండ లేకపోతున్నాను. చిల్లకల్లు నుండి చికాగో వరకు మమ్మల్ని పరుగులు తీయించిన గౌరవనీయులు రెవ.డా.పి. ఎస్.వి. ప్రసాద్‌రావు గార్కి ప్రత్యేక వంద నాలు. అమ్మకు వ్యాసం ఆత్మీయంగా వుండి పదే పదే చదవాలనిపిస్తుంది. ఇలాంటి క్రమ శిక్షణను నేర్పిన ఘనత ఆ మీషనేరీలకే చెందుతుంది. ఇతన్ని మంచి విషయాలను ప్రతిక ద్వారా అందిస్తున్న సంపాదక వర్గాన్నిం తటినీ అభినందిస్తూ.....

**శ్రీమతి. డా॥ మెర్సిరత్నబాయి.**
**నిజమాబాద్**

మీ పాఠకుడు గాబ్రియేల్ వ్రాయునది. మీ మా స్వర్ణదీపిక అద్భుతంగా ఉన్నది. ఇంటి ల్లపాది చదివి ఆశీర్వాదం పొందితిమి. స్వర్ణ దీపిక టి.వి కార్యక్రమములు మమ్ములను ఎంతో బలపరుచుచున్నది. మీరు ఇంకను మంచి విడియో కార్యక్రమములను చేసి క్రైస్తవ లోకానికి, దేవునికి మహిమకరమైన పని ముట్లుగా స్వర్ణదీపిక ఆశ్వీరదింపబడలాని దేవుని ప్రార్థిస్తున్నాము.

**గాబ్రియేల్, అమలాపురం**

గౌ॥ ఎడిటర్.బి.శివాజిరాజు గార్కి, అనేక నమస్కారములతో రాత్రి అనగా 26.07. 10న "ఆరాధన" చానల్‌లో మీతో జరిగిన సంభాషణ విని, చూచి ఆనందించాం. స్వర్ణదీపిక పత్రిక ప్రతి క్రైస్తవుని ఇంటిలో ఉండాలని వారు మిమ్ములను కోరి, అభినం దించారు. మేము చాలా సంతోషంచాం. తప్పక ఆ పని జరగాలని మేము కూడా ప్రగాడంగా ఆశిస్తున్నాము. మీ కృషి, పత్రిక ద్వారా జరుగు, సామాజిక, రాజకీయ, ఆత్మీయ, సాంస్కృతిక చైతన్యం జరగాలని మేమెంతో ఆశిస్తున్నాం అందు కొరకై మీకు మా పూర్తి సహకారం అందించాలని అభిల షిస్తూ మేము మీకు హృదయపూర్వకంగా సహకారాన్ని అందించుటకు కోరుచున్నాము.

**గద్దం ఏలియా, బాపట్ల**




## కనువిప్పు

ఇది నీచం, ఇది దౌర్భాగ్యం, ఇంతకన్నా పాపం మరొకటిలేదు, నరకం తథ్యం, బైబిళ్ళు అమ్ముకొని సొమ్ము చేసుకోవటం వార్త క్రైస్తవ లోకానికి మాయనిమచ్చ. అర్జంట్ ఇ.మెయిల్ కవిత క్రైస్తవులకు కనువిప్పు. ప్రాచీన క్రైస్తవ్యం వ్యాసం చరిత్రకు సాక్ష్యం. రచయిత వంగూరి సురేష్ గారికి నా అభినందనలు. మత్తి నిర్మలానంద్ గారి అమ్మ జ్ఞాపకాలు చదువుతంటే నా చిన్న తనానికి నేను వెళ్ళిపోయాను. విశ్వాసీ భయపడకు, నరునికి ప్రమాదం నరుడే ఆధ్యాత్మిక వ్యాసాలు చాలా బాగున్నాయి. క్రైస్తవలోకానికి దేవుడిచ్చిన ఏకైక సంచలనాత్మక పత్రిక స్వర్ణదీపికకు, సిబ్బందికి నా వందనాలు.

**పాస్టర్ రవి కుమార్, గన్నవరం**

# కలాలకు పదును పెట్టండి

**తాళ్ళూరి ప్రసాద్**

నువ్వు రాయాలి తమ్మీ!
మూడు గోధ్రాలు ఆరు అయోధ్యలుగా
విరిగి పడిపోతున్న దేశంలో
మానవ విలువల శిధిలాలు
కనీసం ఆనవాళ్ళుగానైనా మిగలాలంటే
నువ్వు రాయాలి.

ఏ సత్యమూ లేనిచోట అసత్యమే
గొప్ప సత్యంగా చెలామణి అవుతుంటే
అస్తవ్యస్తమైన జీవితాలు ఆధునిక వర్తమానం!
అనిశ్చితే మన ఉజ్వల భవిష్యత్తు!!
మూర్ఖత్వం ముదిరి పాకాన పడుతున్న నేలలో
సత్యానికి పట్టాభిషేకం జరగాలంటే
నువ్వు కలాన్ని ఝుళిపించాలి.

మనమెలాగోలా ఛస్తాం!
మన తర్వాత వారు బ్రతికేదెలా?
ఇంటర్నెట్ మీద ఆరేసిన అశ్లీలం తప్ప
ముందు తరానికి మనమందించేదేముంది?
వస్తు సంస్కృతిలో కొట్టుకుపోతున్న
జీవన శకలాలు తప్ప
బతుకుల్ని కట్టుకోవడానికి 'బేస్' వారికి కనబడదు.
మానవ సంబంధాల మాధుర్యాన్ని
కనీసం చరిత్రగానైనా వాళ్ళు
చదువుకోవాలంటే నువ్వురాయాలి.

ఇదేం చిత్రమో!
ఈ దేశంలో అరాచకం కూడా
ఒక సంస్కృతిలా విస్తరించగలదు
సహనం సంప్రదాయాల నీడలో
చెడు కూడ ఒక సిద్ధాంతంగా భాసిల్ల గలదు
ఇపుడిక నియంతలు నీ దేశాన్ని ఏలబోతున్నారు
కలంతో దాన్ని కాపాడుకో!

నువ్వెందుకూ పనికిరావనీ
ఏమీ చెయ్యలేవనీ
ఎవరెన్ని చేసినా ఈ దేశం బాగుపడదనీ
చిన్నప్పట్నించీ ఒంటినిండా రాసుకున్న
ముష్టి ఆలోచన్ల మురికి వదిలేదాకా
వాక్యోదక స్నానం చేసి పైకిలే!
దేవుడు లోకంలో పనిచేస్తున్నాడు
నీ కలాన్ని సిద్ధం చేసుకో!!!

# కన్నీళ్లనైనా పంచుకుందాం

**నూకతోటి రవికుమార్**

నిజం చెప్పాలంటే
ఇప్పుడు కాసిన్ని కన్నీళ్లని కూడా పంచుకునేందుకు ఎవరూ లేరు
మొన్న గుజరాత్‌లో ముస్లింలను లక్షలాదిమందిని
సజీవంగా పూడ్చిపెట్టిన వాళ్లే
ఇప్పుడు, ఒరిస్సా, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో
క్రైస్తవులపై దాడులకు ఉపక్రమిస్తున్నారు
మాతృభూమి నుంచి మనల్ని గెంటేసి,
గేలిచేసి, వెలికి గురి చేసినందుకు
మన గుడిసెల్లోకి నడిచి వచ్చిన
సేవా క్రీస్తును కౌగిలించుకున్నాం
క్రైస్తవులుగా మారాం.

వివక్ష వెటకారితనాన్ని ఎడమకాలితో తన్నాం,
భక్తితో, సేవతో వివక్షను ఎదిరించాలనుకున్నాం,
కానీ, ఇప్పుడు మళ్లీ హిందూమత దురహంకారం
ఈ నేల మీద మన కాలి గురుతుల్ని కూడా
చెరిపేయాలని చూస్తున్నది
దేశాన్ని 'కంధమాల్' చేసి
దళిత క్రైస్తవుల్ని తుదముట్టించాలని చూస్తోంది

ప్రభుత్వాలకు ఓటుబ్యాంకులుగా మాత్రమే
మిగిలినందుకు కాస్తంత సిగ్గుపడదాం
ప్రభుత్వాలకి బుద్ధి చెప్పలేనందుకు
కాస్తంత విచారపడదాం
దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులుగా
ఈ దేశంలో ఒకే రకమైన
అమానవీయ హింసాకాండని అనుభవిస్తున్నాం
పుట్టినచోటే పరాభవించబడుతున్నాం, ఆగమాగమౌతున్నాం

ప్రాంతమేదైతేనేం? రాష్ట్రమేదైతేనేం?
అన్నిచోట్లా అవమానం, హింస, అత్యాచారం,
హత్యలకు గురౌతున్నది మనమే
ఇంత హింసా పరాకాష్టకు గురిచేస్తున్నా
మొక్కవోని దేశభక్తిని చాటుకుంటూ
నిజమైన భారతీయులుగా
ఇప్పటికీ విశ్వాసం ప్రకటిస్తున్నాం
అందుకే, కాస్తంత కన్నీళ్లైనా పంచుకుందాం
కన్నీటి అక్షరాలుగానైనా
మన ఉనికిని మనం పదిలం చేసుకుందాం
పాలకుల మౌనం మీద తుఫానై ఎగిసిపడదాం

# పాకిస్తాన్‌లో ఇద్దరు పాస్టర్ల దారుణ హత్య



జూలై 21, ఫైసలాబాద్ : ఫైసలాబాద్‌లోని క్రైస్తవులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మహమ్మద్ ప్రవక్తను దూషించారన్న ఆరోపణపై ఇద్దరు పాస్టర్లను దారుణంగా హత్య చేసిన సంఘటన ఇక్కడ కలవరం సృష్టించింది. జూలై మొదటి వారంలో, ముస్లిం ప్రవక్త మహమ్మద్‌ను కించపరిచే వ్యాఖ్యలతో కరపత్రాలు రాసి, పంచారని రషీద్ ఇమ్మానుయేల్, సాజిద్ ఇమ్మానుయేల్ అనే ఇద్దరు సహోదరులను పోలీసులు అరెస్ట్‌చేసి విచారిస్తున్న నేపథ్యంలో, వారిరువుర్ని సోమవారం (జూలై 19) కోర్టులో హాజరుపర్చారు.

కోర్టు విచారణ అనంతరం బైటకు వస్తుండగా ముసు గులు ధరించిన కొందరు గన్‌మెన్‌లు ఇద్దరు పాస్టర్లను కాల్చి చంపేసారు. పాకిస్తాలో శ్రమలనుభవిస్తున్న క్రైస్తవులకు మద్దతుగా పనిచేస్తున్న "క్లాస్" సంస్థ కో– ఆర్డినేటర్ నసీర్ సయీద్ ఈ హత్యల్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు చూస్తుండగానే ఇలా జరగడం దారుణమనీ, ఇద్దరు పాస్టర్లకు రక్షణ కల్పించడంలో పోలీసులు తమ బాధ్యత నిర్వర్తించలేక పోయారనీ ఆయన విమర్శించారు. పాకిస్తాన్‌లోని క్రైస్తవులకు ఏ మేరకు భద్రత ఉందో ఈ సంఘటనే ఉదాహరణనీ ఆయన వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా, ఇద్దరు పాస్టర్లపై ఉన్న ఆరోపణలు నిజం కావనీ, కావాలని కొందరు అసత్య ఆరోపణలు చేసారని పాకిస్తాన్ మైనారిటీ వ్యవహారాల శాఖమంత్రి షాబాజ్ భట్టి అంగీకరించడం ఇక్కడ గమనార్హం.

# రూ. 50 లక్షల ఆర్థికసాయం

**మంజూరు చేసిన ఒరిస్సా ప్రభుత్వం**

జూలై 21, భువనేశ్వర్ , 2008 కాంధమాల్‌లో క్రైస్తవులపై జరిగిన హింసాత్మక దాడులలో ధ్వంసమై పోయిన చర్చీల మరమ్మత్తు కోసం ఒరిస్సా ప్రభుత్వం యాభై లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని ప్రకటిం చింది.

"సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కాంధమాల్ లోని 229 చర్చీల మరమ్మత్తు కోసం (రూ. 51,90,000) రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే వీటిలో 221 చర్చిలకు రూ. 50,90,000 బట్వాడా చేసిందని" రెవెన్యూశాఖ మంత్రి ఎస్. ఎన్. పాత్రో తెలిపారు.



# ఇదెక్కడి న్యాయం!

పూల్‌బని– ఒరిస్సా 2008లో కాంధమాల్‌లో జరిగిన మతఘర్షణలకు సంబంధించి ఒక కేసులో తొమ్మిది మందిని నిర్దోషులుగా ఇక్కడి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రకటించింది.

సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ –II అడిషనల్ సెషన్స్ జడ్జి చిత్రరంజన్ దాస్ తొమ్మిదిమందిని విడిచిపెట్టారు. 2008 ఆగస్ట్ 28న బేలాదేవి గ్రామంలోని ఒక చర్చిని తగుల బెట్టారన్న ఆరోపణపై పోలీసులు వీరిని అరెస్ట్ చేసినప్పటికీ, బలమైన సాక్ష్యాలు లేనందువల్ల వీరిని విడిచి పెట్టమని కోర్టు అదేశించింది.

కాంధమాల్ మత దాడుల్లో బాధ్యులైన వారిని విడిచిపెట్టేది లేదని కఠినంగా శిక్షిస్తామని, ఒరిస్సా ప్రభుత్వం హామీలిస్తున్నప్పటికి బాధితులకు న్యాయం మాత్రం జరగటం లేదు. కాంధమాల్ దోషులు ఒక్కొక్కరే మెల్లగా కేసుల నుంచి తప్పుకొంటున్నారు. ప్రభుత్వ ఉదాసీనతకు ఇవన్నీ ఉదాహరణలు. సాక్ష్యాలు లేని కారణంగా వారిని విడిచిపెడుతున్నామని కోర్టులు చెబుతున్నప్పటికి, సాక్ష్యాలు బలంగా ఉన్న కేసులు మాత్రం ఏకొలిక్కి రావటంలేదు.

# కాంగ్రెస్‌తో ఖటీఫ్

## దళిత క్రైస్తవుల హెచ్చరిక





న్యూఢిల్లీ - జూలై 21, దళితులకు అందాల్సిన కోటా ప్రయోజనాలు అందకపోతే రాబోయే ఎలక్షన్లలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటుచెయాల్సి వస్తుందని క్రైస్తవ మరియు మైనారిటీ లీడర్లు హెచ్చరించారు. రిజర్వేషన్ల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా జూలై 21న నలు మూలల క్రైస్తవులు పాల్గొన్నారు.

"క్రాంగెస్‌కు మద్దతు ఉపసంహ రించుకునే విషయం తీవ్రంగా ఆలోచిస్తున్నాం" అని ఫాదర్ రోబీ కోలన్‌చెరీ అన్నారు. పంజాబ్ నుండి వచ్చిన తన బృందంతో కలిసి ఆయన ప్రదర్శనలో పాల్గొన్నారు. గత అయిదు దశాబ్దాలుగా క్రైస్తవులు, ముస్లింలు ఆనవాయితీగా కాంగ్రెస్‌కు మద్దతిస్తూనే వచ్చారనీ, అయినా ప్రయోజనం లేదని దళిత క్రైస్తవులు ఆవేదన వ్యక్తం చేసారు. "దళిత క్రైస్తవుల రిజర్వేషన్" డిమాండ్ ఈనాటిది కాదనీ, 60 ఏళ్లుగా దీనిని అమలు చేయలేకపోయినందుకు అన్ని ప్రభుత్వాలు సిగ్గుపడాలనీ ఫాదర్ రోబి అన్నారు. ఒకప్పుడు అంటరానివారిగా ముద్రపడిన తక్కువ కులాలవారికీ, దళితులకీ భారత రాజ్యాంగం ప్రత్యేక రాయితీలు అనుమతించింది. అయితే 1950 ప్రభుత్వ ఆదేశం మేరకు అవి హైందవ దళితులకు మాత్రమే పరిమితం చేయబడ్డాయి. ఆ తర్వాత కొన్ని సవరణల పర్యవసానంగా దళితుల్ని సిక్కులు, బౌద్ధులలో కలవడం జరిగింది. కానీ క్రైస్త వులు, ముస్లింలకు మాత్రం చోటు దొరక లేదు. "ఇప్పటికైనా మించి పోలేదనీ, ప్రభుత్వం కళ్లు తెరిచి దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ వర్తింప చేయాలనీ, లేనట్లయితే దళితులు తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది." కాథలిక్ బిషప్ సమాఖ్యకు చెందిన ఫాదర్ కాస్మన్ ఆరోకిరాజ్ అన్నారు.



పార్లమెంట్ భవనానికి సమీపంలో నిర్వ హించిన ఈ ప్రదర్శనను నేషనల్ కౌన్సిల్ ఫర్ దళిత క్రిస్టియన్స్, కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఇన్ ఇండియా మొదలైన సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ర్యాలీ, ధర్నాలకు రెవ. ఫ్రాంక్లిన్ శేఖర్ నాయకత్వం వహించారు.

రెవ. ఫాదర్. బాస్కో, ఎ.పి. బి.సి. కమిషన్ ఫర్ ఎస్.సి.ఎస్.టి.బి.సి., శ్రీ బి.దానం.ఐ.ఎ.యస్, రిటైర్డ్, ఎ.పి. ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్, బ్రదర్ సాల్మన్‌రాజు, డా॥ శ్యాం పాల్ నేషనల్ సెక్రటరి, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్, రెవ. జట్టి ఆలివర్, ఎన్.సి.సి.ఐ. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్, వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ రెవ.బి. ఫ్రాంక్లిన్. సుధాకర్ ఆధ్వ ర్యంలో 150 మంది ఎ.ఐ. సి.సి. నాయకులు ర్యాలీ, ధర్నాల్లో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమ, నిరసన హెచ్చరిక సంకేతాలు తెలియజేశారు.

# క్రైస్తవ సామూహిక వివాహాలు





రాజమండ్రి, 10-7-2010, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ ఆర్థిక సంస్థ పేద క్రైస్తవులైన యువతీ యువకులకు సామూహిక వివాహాలు జరిపించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో తూ॥గో॥జిల్లా పాసర్స్ ఫెలోషిప్ నాయకత్వంలో ది. 10-7 -2010, శనివారం, ఉ॥9 గంటలకు 49 జంటలకు సామాజిక వివాహాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘనాయకులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొని నూతన వధూ వరులైన జంటలకు తమ శుభాకాంక్షలు అందించారు. ఒక్కొక్క జంటకు క్రిస్టియన్ మైనారిటీ సంస్థ 15 వేల రూపాయిలు వివిధ రూపాలలో పారితోషికం అందించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యంగా రాష్ట్ర క్రైస్తవ సంక్షేమ సంస్థ జనరల్ మెనేజర్ శ్రీ సుధీర్ కుమార్ హాజరై శుభాకాంక్షలు అందించి వారిని ప్రోత్సహించారు. ఏ.పి.పాస్టర్స్ ఫెలో షిప్ అధ్యక్షులు రెవ. డా॥ప్రతాప్ సిన్హా, మరియు మేడిది జాన్సన్, కె.ప్రేమదర్శన్, రెవ. ఆర్థర్ ప్రసాద్, రెవ.ప్రేమ్, రెవ.డా॥ డానియేల్ పాల్, రెవ. గిద్యోను, రెవ. జాన్ ఎలీషా, రెవ. సుధాకర్ శాస్త్రి అత్యంత వైభవంగా బైబిల్ ప్రమాణాలలో, దైవ సందేశాలతో జీవితం పయనం ఎలా సాగాలో దైవజనులు నూతన వధువరులను ఆశీర్వదిస్తూ చక్కని దైవ సందేశం అందించారు.

పలువురు రాజకీయనాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కావటం ఎంతో సంతోషం కలిగించందని వధూవరులు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ సామూహిక వివాహ కార్యక్రమానికి రాజమండ్రి ఎం.ఎల్.ఏ.రేతు సూర్య ప్రకాష్, ఎం.పి.ఉండవల్లి అరుణ కుమార్, రాజా నగరం ఎం.ఎల్.ఏ. పెందుర్తి వెంకటేశ్, ఎం. ఎల్.సి.కబ్బా జార్జి విక్టరీ, బలశాలి ఇందిర, రాజమండ్రి మేయర్ ఆదిరెడ్డి, రాఘవమ్మ గార్లు వధూవరులకు శుభాకాంక్షలు అందించారని మా స్వర్ణదీపిక ప్రతినిధి రెవ. డా॥ కలిగితి విజయకుమార్ తెలియజేశారు.

# ఇంగ్లాండ్ సంఘాల్లో భారత క్రైస్తవులపై వివక్ష

భారత క్రైస్తవులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకోవాలని ఇంగ్లాండ్ మెయిన్‌స్ట్రీమ్ చర్చిలన్నీ, ఇటీవల జరిగిన ఒక సమావేశంలో నిర్ణయించాయి. ఆసియా క్రైస్తవులను చిన్నచూపు చూస్తున్నారన్న వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ యు.కె.చర్చీలు ఈ నిర్ణయానికి వచ్చాయి. యు.కె.లోని మెయిన్ స్ట్రీమ్ చర్చీలు వివక్ష చూపడం వలన, ఆసియా క్రైస్తవులు స్వంతంగా చిన్నచిన్న గుంపులుగా సమావేశమవు తున్నారు. తమ స్వంత భాషల్లో పాటలు పాడుతూ, ప్రార్థనలు చేస్తున్నారు. మెయిన్‌స్ట్రీమ్ చర్చీలలో చేరాలని ఆసియా క్రైస్తవులు ఆశపడుతున్నప్పటికీ, ఇంగ్లాండ్ చర్చీలు ఆ అవకావం ఇవ్వడం లేదనీ, అటు వంటి పరిస్థితుల్లో స్వంత చర్చీలు ఏర్పాటు చేసుకోవడం తప్పడం లేదనీ దక్షిణ ఆసియా ఫోరం తెలిపింది. ఒక బ్రిటన్ పరిసరప్రాంతాల్లోనే ఇటువంటి చర్చీలు 200 దాకా ఉన్నాయని దక్షిణ ఆసియా ఫోరం ఛైర్మన్ రామ్ గిదూమాల్ తెలిపారు. ఒకే విశ్వాసం కలిగిన వారు సమైక్యంగా ఉండాల్సిందిపోయి, ఇలా వేరైపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. మెయిన్ స్ట్రీమ్ చర్చీలలో చిన్నచూపు గురైన భారత క్రైస్తవులు ఇంగ్లాండ్‌లో 75,000 మంది దాకా ఉన్నా రని దక్షిణ ఆసియాఫోరం తెలిపింది.

# ఆరాధన టి.వి. కార్యక్రమాలు

## Aradana Exclusive Programs

| | | |
|---|---|---|
| Ushodayam | Daily (3 minutes only) | 5:30, 6:00, 6:30 am |
| Subhakankshalu | Daily | 9:00 am |
| Amrutha Bandam | Daily | 5:30, 9.30 am |
| Tele-shop | Mon, Friday | 5:30 pm |
| Manner's show | Sunday | 12:00 pm |
| Health Show | Sunday | 12:30pm |
| Chinni Chinni Aradana | Sunday | 1:00 pm |
| Parichayalu | Sunday | 1:30 pm |
| Animuthyalu | Sunday | 2:30 pm |
| New Album | Sunday | 3:00 pm |
| Mana Sahiti Sampada | Sunday | 4:00 pm |
| Probe | Sunday | 4:30 pm |
| Amrutha Dharalu | Sunday | 5:00 pm |
| Zindagi Forever, Mumbai | Tue, Thu,Saturday | 11:00 pm |
| Live Show with Bro.Praveen | First Sunday only | 3:00 pm |
| Franklin Tele-Bible Classes | Monday to Friday | 1:30, 11:30 pm |

## Speakers / Programs

| | | |
|---|---|---|
| Rev.R.R.K.Murthy | Sunday | 6:00 am |
| Bro. Shyam Kishore | Daily (except Sat & Sunday) | 6:00 pm |
| Rev. P. George | Saturday | 6:00 am |
| Bishop G.John | Sunday | 6:30 am |
| Dr. Pramod | Monday | 6:30 am |
| Bishop Santha Vardan | Tuesday | 6:30 am |
| Rev.Joseph Yelchuri | Wednesday | 6:30 am |
| Rev.Paul Thangaiah | Thursday | 6:30 am |
| Dr.Stephen Charles | Friday | 6:30 am |
| Bro. Kameshwar Rao | Saturday | 6:30 am |
| Sis.Amshumathi Mary | Monday | 7:00 am |
| Dr.Stephen Charles | Tuesday | 7:00 am |
| Dr. Luke | Wednesday | 7:00 am |
| Sis. Esther Rani | Thursday | 7:00 am |
| Berecah Dwani | Friday | 7:00 am |
| Rev. Dr. Joseph K | Sunday | 7:30 am |
| Rev.Joshua Appikatla | Monday | 7:30 am |
| Prof. Sam | Tuesday | 7:30 am |
| Rev.Bret Mccasland (USA) | Wednesday | 7:30 am |
| Rev.Deewan Kumar | Friday | 7:30 am |
| Time for Change (USA) | Sunday & Friday | 8:00 am |
| Bishop Daniel Kalyanapu | Monday | 8:00 am |
| Sis. Rajashree | Alternate Tuesday | 8:00 am |
| Rev.Solomon Sampath | Alternate Tuesday | 8:00 am |
| Rev. Timothy | Wednesday | 8:00 am |
| Rev.A.D.V Prasad | Thursday | 8:00 am |
| Rev.Joshua Gootam | Saturday | 8:00 am |
| Rev. Steve Ericsson (USA) | Sunday | 8:30 am |
| Rev.Samuel Patta | Monday | 8:30 am |
| Sis.Alice | Tuesday | 8.30 am |
| Rev. Diwakar | Wednesday | 8:30 am |
| Rev.John Victor | Thursday | 8:30 am |
| Rev.David Maclauren (CANADA) | Friday | 8:30 am |
| Dr. Stephen Paul | Saturday | 8:30 am |
| SwarnaDeepika | Daily (except Sunday) | 10:00 am |
| Rev Isaac | Monday | 10:30 am |
| Dr.Vikranth K. | Saturday | 10:30 am |
| Radio Santec (JERMANY) | Sunday | 11:00 am |
| Rev. Asheervadam | Monday | 11:00 am |
| Rev.P.Vijay Kumar | Wednesday | 11:00 am |
| Sis.Merlyn Patta | Wed | 12:00 noon |
| Rev. David Bollam | Monday | 1:00 pm |
| Bro. Shyam Kishore | Daily (except Sun & Mon) | 1:00 pm |
| Rev. V.S Prasad | Saturday | 1:30 pm |
| Sis. Joy Cherian | Daily | 2:00 pm |
| Sis. Jacintha Rani | Saturday | 2:30 pm |
| Sis. Lakuma | Monday | 3:00 pm |
| Rev.John Carter | Saturday | 3:00 pm |
| Sis. Sarada Devi | Monday | 3:30 pm |
| Sis. Uma Devi | Tuesday | 3:30 pm |
| Sis.Suvarna Devadanam | Wednesday | 3:30 pm |
| Sis Salomi | Friday | 3:30 pm |
| Vishwavani-Bible Class | Saturday | 4:00 pm |
| Bro. Sudheer | Monday | 4:30 pm |
| Bro.Satyavedasagar | Tuesday | 4:30 pm |
| Rev.M.Elisha | Thursday | 4:30 pm |
| Rev.Bonthu Dhanraj | Friday | 4:30 pm |
| Rev.Johnson Mett | Saturday | 4:30 pm |
| Symphony | Wednesday | 5:30 pm |
| Save a Child | Saturday | 5:30 pm |
| Rev. Charles Stanley (USA) | Sunday & Friday | 6:00 pm |
| Rev. Barnabas Sajja | Monday | 6:00 pm |
| Bro. Immanuel | Tuesday | 6:00 pm |
| Bro. Isaac Johnson | Wednesday | 6:00 pm |
| Dr. L. Immanuel | Thursday | 6:00 pm |
| Rev. Jaipaul Alli | Saturday | 6:00 pm |
| Rev. Samuel Kiran J | Sunday | 6:30 pm |
| Rev.Gopaul | Monday | 6:30 pm |
| Rev. Jada John | Tuesday | 6:30 pm |
| Dr. Thomas | Wednesday | 6:30 pm |
| Dr. Samuel Karmoji | Thursday | 6:30 pm |
| Rev. Kurian | Friday | 6:30 pm |
| Rev. P. Vijay Kumar | Saturday | 6:30 pm |
| Bro. Shyam Kishore | Daily (except Thursday) | 7:00 pm |
| Rev.Samuel Patta | Thursday | 7:00 pm |
| Bro. P. Joshi | Daily | 7:30 pm |
| Dr. N. Jayapaul | Daily | 8:00 pm |
| Dr. John Wesley | Sunday | 8:30 pm |
| Dr. Isaiah | Monday | 8:30 pm |
| Rev. T. D Prasanna Kumar | Tuesday | 8:30 pm |
| Bishop E.Komanapalli | Wednesday | 8:30 pm |
| Vishwavani | Thursday | 8:30 pm |
| Bishop John Lazarus | Friday | 8:30 pm |
| Bro.Peter Samuel | Saturday | 8:30 pm |
| Dr. Satish Kumar | Daily | 9:00 pm |
| Jesus Calls | Daily | 9:30 pm |
| Bro. G. Vincent | Sunday | 10:00 pm |
| Bro. Upender | Monday | 10:00 pm |
| Bro. Praveen | Tuesday | 10:00 pm |
| Bro. Samuel David | Wednesday | 10:00 pm |
| Rev. G Samuel | Thursday | 10:00 pm |
| Bro.Judson Abraham | Friday | 10:00 pm |
| Rev. Devasahayam | Saturday | 10:00 pm |
| Sis. Leela Chandy | Sunday | 10:30 pm |
| Rev.Brian Houston (HILLSONG) | Wednesday | 10:30 pm |
| Dr.David Paul Gopal (J&K) | Thursday | 10:30 pm |
| Bro. Rambabu (Bellary) | Friday | 10:30 pm |
| Dr. Stephen Paul | Saturday | 10:30 pm |



వంగూరి సురేష్

# బానిసత్వం నుండి విడుదల

పరిశుద్ధగ్రంథం బైబిల్‌లో అంతర్లీనంగా కనిపించే పలు ప్రాముఖ్యమైన అంశాల్లో క్రైస్తవ స్వాతంత్ర్యం ఒకటి.

క్రీస్తు తన సిలువ యాగం ద్వారా మనకు అనుగ్రహించిన “రక్షణ”ను మన చిన్ని మస్తిష్కాలతో ఆకళింపు చేసుకోవడం అసాధ్యం. క్రీస్తు మనకు సమకూర్చిన ఆ మహా గొప్ప రక్షణ ఔన్నత్యాన్ని మనం అర్థం చేసుకున్నది ఇసుక రేణువు కన్నా తక్కువే అని చెప్పాలి. ప్రముఖ సువార్తికుడు బిల్లీ గ్రేహం ఒక సందర్భంలో ఇలా అన్నాడట – “నేను పరలోకం చేరుకోగానే యేసు ప్రభువు వారిని అడిగే ప్రశ్న... ప్రభు, సిలువలో అసలు ఏమి జరిగిందో నాకు వివరించండి”!

నిజమే “రక్షణ” భావం ఒక పట్టాన అర్థం కాదు. ఎవరో దాకా ఎందుకు? అపొస్తలుడు పౌలు స్వయంగా ఏమన్నాడో చూడండి... “నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తుని గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొను చున్నాను”. (ఫిలిప్పీ 3:8). ఏమిటా అతి శ్రేష్ఠమైన జ్ఞానం? తరువాతి వచనంలో చెప్పాడు – “క్రీస్తును సంపా దించుకొని... క్రీస్తు నందలి విశ్వాసము వల నైన నీతి అనగా విశ్వాసమును బట్టి దేవుడు అనుగ్రహించు నీతి గలవాడనై ఆయన యందు అగపడు నిమిత్తము... ఆయన మరణ విషయము... ఆయన పునరుత్థాన బలము ఎరుగు నిమిత్తము... సమస్తమును... పెంటతో సమానముగా ఎంచుకొను చున్నాను”! (ఫిలిప్పీ 3:9–11)

ఒక మాటలో చెప్పాలంటే క్రీస్తు అనుగ్రహించు రక్షణ జ్ఞానం కోసం పౌలు సర్వాన్ని విడిచిపెడతానంటున్నాడు.!

“రక్షణ” అంటే ఏమిటో అలంకారికంగా వివిధ ఉదాహరణలతో పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తోంది. వాటిలో ప్రాముఖ్యమైనది... స్వాతంత్ర్యం. బానిసత్వం నుండి విముక్తి. ఈ భావం చాలా గంభీరమైనది.

క్రొత్త నిబంధనలో ఈ భావం చాలా ప్రస్ఫుటంగా, పలుసార్లు కనిపిస్తుంటుంది.

రక్షణ అంటే ఒక బానిసకు స్వేచ్ఛ లభించటం. “నీవు ఇక మీద బానిసవు కావు, నీవు స్వతంత్రుడివి'' అని చట్టబద్ధంగా ప్రకటించి విడుదల చేయటం.

ఈ సందర్భంగా బానిసత్వానికి సంబంధించిన కొన్ని విషయాలు మనం తెలుసుకోవటం చాలా అవసరం. తద్వారా కొత్త నిబంధన రచయితల మనోభావాలకు దగ్గరగా చేరుకోవచ్చు. మన రక్షణ ఔన్నత్యాన్ని మరింత విశదంగా తెలుసుకోవచ్చు.

మొదటి శతాబ్దంలో, మరి ముఖ్యంగా రోమనుల పాలనలో “బానిసత్వం” అనేది సర్వసాధారణం. ఆనాటి జీవన సంస్కృతిలో అదొక భాగం. ప్రత్యక్షంగా, పరోక్షంగా బానిసత్వపు సంస్కృతిని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ, వచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో బానిస బతుకులు ఎంత దుర్భరమైనవో తెలిస్తే ఆశ్చర్యపోతాం. ఒక వ్యక్తి బానిసగా ఎలా మారతాడు అనే దానికి చాలా కారణా లున్నాయి.

అప్పు తీర్చలేక ఒక వ్యక్తి బలవంతంగా బానిస స్థానంలోకి దిగజారిపోవచ్చు. యుద్ధంలో ఓడిపోయి పట్టుబడిన సైనికులు శత్రు రాజ్యంలో బానిసలుగా బతకాల్సి రావచ్చు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక తండ్రి తన పిల్లల్ని బానిసలుగా అమ్మివేయవచ్చు. ఒక్కోసారి తనను తానే అమ్మివేసుకోవచ్చు. కారణాలు ఏవైనా, ఒకసారి బానిసగా ముద్ర పడిన వాడు ఇక ఎప్పటికీ బానిసే.

బానిసల్ని నాటి సంతల్లో వస్తువుల్లా అమ్మేవారు. చేతులకు, కాళ్లకు, మెడకు సంకెళ్లు బిగించి మార్కెట్‌లో నిలబెట్టి అమ్మేవారు. వయస్సును బట్టి, శారీరక ధారుఢ్యాన్ని బట్టి అనుభవాన్ని బట్టి ధర చెల్లించి ఆ బానిసను ఇంటికి తెచ్చు కుంటారు. “ఇక నుంచి అతడు నాకు బానిస. అతడ్ని నేను సొమ్ము పెట్టి కొన్నాను. అతడు నా సొత్తు. అతడు నాకు



మాత్రమే చెందుతాడు.'' అనే భావం యజమానిలో అణువణువునా ఉంటుంది. అందుకనే తమకు నచ్చిన ఒక గుర్తునీ/ చిహ్నాన్ని బానిస ఒంటిపై వాతగా పెట్టేవారు.

కొందరు తమ పేరులో మొదటి అక్షరాన్ని బానిస శరీరంపై ముద్రించేవారు. సాధారణంగా వీపుపైనో, చేతి జబ్బపైనో, నుదటి పైనో, చెంప పైనో ఈ వాతను పెట్టేవారు. తమ పేరు పెట్టడం ఇష్టం లేని కొందరు "బానిస" అనే పదంలోని మొదటి అక్షరాన్ని వాతగా పెట్టేవారు. అంతేకాదు బానిస పారిపోకుండా చేతులు, కాళ్లకు, సంకెళ్లు, బొండలు బిగించేవారు. మెడ చుట్టూ లోహంతో చేసిన ఒక చిన్న పలకలాంటి దాన్ని బిగించేవారు. దీనినే కాలర్ ప్లేట్ అనేవారు. దీని మీద "నేను ఫలానా వారికి కట్టు బానిసను. నన్ను ఆయన వెలబెట్టి కొన్నాడు. నేను పారిపోయినా, మరెక్కడైనా మీరు నన్ను చూసినా నా యజమానికి నన్ను అప్పగించండి. ఆయన మీకు బహుమానం ఇస్తాడు. నా యజమాని పేరు ఫలానా, ఫలానా ఆయన చిరునామా ఫలానా, ఫలానా... అని రాసి ఉండేదట. అంటే ఒక బానిస పారి పోవడం అనేది కల్ల, ఒకవేళ పారిపోయినా, అతను



సులభంగా దొరికిపోతాడు.

అతని ఒంటి మీద గుర్తు, మెడలోని లోహపు పలకా, చేతులు కాళ్లకు సంకెళ్లు... చూడగానే అతను ఎవరో, అతను ఎవరికి బానిసో ఇట్టే చెప్పేయవచ్చు. ఇన్నీ తెలిసీ, ఒకవేళ, ఆ బానిస పారిపోయే ప్రయత్నం చేసి, దురదృష్టవశాత్తు దొరికిపోతే అతడిని యజమాని ఏమైనా చేయవచ్చు. చంపినా అడిగేవారు లేరు. ఆనాటి చట్టం, ఈ విషయంలో యజమానులకే అను కూలంగా ఉండేది. అంటే బానిస పారి పోవడం చట్టరీత్యా నేరం. బానిసను యజ మాని రాసి రంపాన పెట్టడం, చంపడం చట్ట రీత్యా న్యాయం. ఎందుకంటే ఆ బానిస యజమానికి సొత్తు తన సొత్తును యజ మాని ఏమైనా చేయవచ్చు!

పరిస్థితులను బట్టి ఒకవేళ ఆ యజమాని తన బానిసను వదిలించుకోవాలను కుంటే, అతడ్ని మళ్లీ సంతలో అమ్మేస్తాడు! ఇక బానిస కథ మళ్లీ మొదలు... మళ్లీ సంతలో ప్రదర్శనగా నిలబడటం... ఎవరెవరో చూసి వెళ్లడం... మళ్లీ ఎవరో కొనడం... తగిన ధర చెల్లించి ఇంటికి తీసుకెళ్లడం షరా మామూలే, ఒకటే చిన్న తేడా... ఇప్పుడు అతను నా బానిస అని లోకానికి తెలియడం కోసం, మునుపు అతని ఒంటిపై వున్న పాత యజ మాని వేసిన ముద్రను 'X'గా కొట్టివేసి, కొత్త ముద్రను వేయడం!!

ఒక బానిస ఒంటిపై ఎన్ని వాత ముద్ర లుంటాయో, అన్ని సార్లు అతను అమ్ముడ య్యాడన్నమాట!!

ఇంతటి దుర్భరమైన జీవితం నుండి ఒక బానిస విడుదల పొందడం ఎలా?

1. యజమాని అడిగినంత వెలను చెల్లించి బానిస స్వతంత్రుడవ్వటం. వెట్టి చాకిరీ చేస్తూ, జీతం అంటే ఏమిటో తెలియని ఒక బానిస, తన యజమాని అడిగిన మూల్యాన్ని ఎక్కడ నుంచి తెచ్చి చెల్లిస్తాడు?

2. యజమాని ఏ ధనాన్నీ ఆశించకుండా, తనకు తానుగా విశాల హృదయంతో తన బానిసకు స్వేచ్ఛను ప్రసాదించడం. ఏ యజమాని తన బానిసకు ఊరికినే విడుదల ప్రసాదిస్తాడు?

3. అటు బానిసకూ, ఇటు యజమానికీ అంగీకారమైన పరిష్కారం ఒకటుంది. వేరే ఎవరైనా ఒక మూడవ వ్యక్తి యజమాని అడిగినంత ధరను చెల్లించి, బానిసను విడిచిపెట్టేయడం. అంటే ఇక్కడ మూడవ వ్యక్తి చేస్తున్న పనేమిటంటే, తను బానిసను కొని, తన వెంట తీసు కెళ్లకుండా విడిచిపెట్టేస్తున్నాడన్న మాట. మరో మాటలో చెప్పాలంటే తన ధనాన్ని నష్టపోతున్నానని తెలిసీ, బానిసకు స్వేచ్ఛ ప్రసాదించాలన్న మాట. అంత మంచి మనసులు కలిగిన వ్యక్తులు ఎక్కడ దొరుకుతారు?

బానిసత్వం ఒక ఉచ్చులాంటిది. ఒకసారి బానిసగా అయ్యినవాడు, స్వతంత్రుడిగా మారటం చాలా అరుదు. ఏదో అద్భుతం జరిగితే తప్ప అది సాధ్యపడదు.

3. విచిత్రమూ, విషాదమూ ఏమిటంటే మన ఆత్మీయ పరిస్థితి కూడా అక్షరాలా ఇలానే ఉండటం. "పాపము చేయు ప్రతి వాడు పాపమునకు దాసుడు" అని యేసు ప్రభువు వారు స్వయంగా చెప్పడం గమనార్హం.

మనం స్వభావరీత్యా పాపులం. పాపానికి దాసులం. మనల్ని మనమే సాతానుకు అమ్మేసుకున్నాం. పాపి అనే వికృతమైన ముద్ర మనపై పడిపోయింది. మనకు తెలీకుండానే మనం సాతాను దాస్యంలోకి వెళ్లి పోయాం. మనం సాతాను సొత్తు. పదే పదే పాపానికి అమ్ముడుపోతూ మనమీద ఎన్నెన్నో గాయాలు, మచ్చలు, వాతల్ని ముద్రగా వేసుకున్నాం.

ఈ దారుణమైన పాపపు స్థితి నుండి, "ఇట్టి మరణకరమైన శరీరం నుండి నన్నెవరు విడిపిస్తారు?" అని ఆక్రందించాం.

దేవుడు అనంతకృపామయుడు. మన స్థితిని చూసాడు. కరుణించాడు. పరిష్కా రంగా తన ప్రియ కుమారుడైన యేసుక్రీస్తు వారిని పంపించాడు. ఆయన కలువరి సిలువలో తన పవిత్ర రక్తాన్ని చిందించి, మన పాపాలకు పరిహారం చెల్లించాడు.

"పాపం" ఎంత మూల్యాన్ని డిమాండ్ చేసిందంటే, సాక్షాత్తు దేవుడే తన పరలోక మహిమ నంతటినీ విడిచి, దాసునిగా తగ్గించుకుని, రిక్తునిగా జీవించి దుర్భరమైన మరణాన్ని పొందాడు.

దేవునికి స్తోత్రం! తన సిలువ మరణం



ద్వారా యేసుక్రీస్తు పాప రుణాన్ని తీర్చి వేసాడు. పాపపు రుణపత్రాన్ని చింపివేసాడు. ఇప్పుడు మనల్ని క్రీస్తు కొన్నాడు. ఇక మీదట మనం క్రీస్తుకు చెందుతాం. సాతానుకు మన మీద ఏ అధికారమూ లేదు. యేసే ఇప్పుడు మన కొత్త యజమాని. పాత యజమాని ముద్రను కొట్టివేసి ఒక కొత్త ముద్రను యేసు మనపై వేసాడు.

ఇక మీదట మనం యేసు మనుషులం అని అందరికీ తెలిసేలా క్రీస్తు మనల్ని తన పరిశుద్ధాత్మతో ముద్రించాడు. పాత ముద్రలు మాయమైపోయాయి. పాత గాయాలు మానిపోయాయి. పాత వాతలు నయమైపోయాయి. పాతవి గతించాయి. సమస్తం కొత్తగా అయిపోయింది. ఇక మీదట మనం దాసులం కానేకాదు. స్వతంత్రులం. అవును ముమ్మాటికీ... అక్షరాలా... స్వతంత్రులం.

యేసుక్రీస్తు ఎంతటి కృపగలవాడో చూడండి. మనంతట మనం పాపపు దాస్యం నుండి బైట పడలేనప్పుడు, సాతాను అడిగిన మూల్యం చెల్లించగలవారు లేక నరకమే మనకు గత్యంతరం అని భావించినప్పుడు యేసు వెల చెల్లించి మనల్ని విడిపించాడు. ఎంతటి వెల చెల్లించాడంటే ఇక విశ్వచరిత్రలో ఎవరూ, ఎన్నడూ అంతటి మూల్యాన్ని చెల్లిం చలేరు. సాతాను ఎన్నటికీ మనల్ని మళ్లీ కొనే సాహసం చెయ్యడు. చెయ్యలేడు. అసలు ఆ ఊహే అతన్ని వణికిస్తుంది. క్రీస్తు చెల్లిం చిన మూల్యం ఎంతో అర్థం చేసుకోవడం ఎవరి వల్లా కాదు. ఆ గణాంకాలు మన మట్టిబుర్రలకు అంతు చిక్కవు.

దేవుడు తన దైవత్వాన్ని వదులుకుని, మానవునిగా ఈ నేలపై జీవించటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఎన్ని కోట్ల వివరణలూ, భాష్యాలతో మనకు ఆ సంగతులు అర్థమవుతాయి?

“ఆహా దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము... ఆయన మార్గములెంతో అగమ్యములు. ప్రభువు మనస్సును ఎరిగిన వాడెవడు?... ఆయన మూలము నను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తమును కలిగియున్నవి'' అంటూ అపొస్తలుడైన పౌలుతో కలిసి మనమూ ఆశ్చర్యపోవడం తప్ప మనమేమి చేయగలం! (రోమా 11:33-36).

క్రీస్తు మనల్ని కొన్నాడు. న్యాయబద్ధంగా మనమిప్పుడు ఆయనకు బానిసలం. కానీ క్రీస్తు మనల్ని తన బానిసలుగా ఉంచుకోవడానికి కొనలేదు. మనల్ని స్వతంత్రుల్ని చేయడానికే కొన్నాడు. “ఇక మిమ్మును దాసులని పిలవక స్నేహితులని పిలుచుచున్నాను” అని యేసు ప్రకటించాడు (యోహాను 15:15).

ఈ దృశ్యాన్ని ఊహించుకోండి. ఒక వైపు క్రీస్తు ఉన్నాడు. మరొక వైపు సాతాను ఉన్నాడు. మధ్యలో బానిసత్వం నుండి విడుదల పొందిన మనం ఉన్నాం. క్రీస్తు మనల్ని కొన్నప్పటికీ మనల్ని దాసులుగా చేసుకోవడానికి ఆయన కిష్టం లేదు.

సాతాను ఇక ఎన్నటికీ మనల్ని కొనలేడు. మనం వాడి వశం నుండి తప్పించుకున్నామని నిస్సహాయంగా చుస్తున్నాడు.

ఇకపోతే మధ్యలో మనం! స్వతంత్రులం ఇప్పుడిక ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చు. ఏ పనైనా చేయవచ్చు. కావాలంటే క్రీస్తును వెంబడించవచ్చు. లేదా, కావాలంటే మళ్లీ సాతాను వైపు చేరిపోవచ్చు. సరైన విచక్షణ లేనప్పుడు, ఒక్కోసారి, స్వేచ్ఛ బానిసత్వం కన్నా ప్రమాదకరమైనదిగా పరిణమిస్తుంది. మీరైతే ఏమి చేస్తారు? అపొస్తలుడైన పౌలు మనమేమి చేయాలో చెబుతున్నాడు... “మీరు పాపమునకు దాసులై ఉంటిరి గానీ... (ఇప్పుడు) పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రం!... పరిశుద్ధత కలుగుటకై ఇప్పుడు అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి... దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము” (రోమా 6:17-22).

“ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసి యున్నాడు. కాబట్టి, మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడి క్రింద చిక్కుకొనకుడి” (గలతీ 5:1).

మీకు మీరే స్వచ్ఛందంగా దేవునికి దాసులుగా అంకితమవ్వండి, మరలా దాస్యంలోకి జారిపోకండి అని పౌలు హెచ్చరిస్తున్నాడు. క్రీస్తు ద్వారా విడుదల పొందిన వ్యక్తి, క్రీస్తు పాదాల చెంతకే చేరటం న్యాయమే కదా!







### నాడే కాదు....

రోమనుల కాలంలోనే కాదు, నిన్న మొన్నటి వరకు బానిసత్వం అనేది మన కళ్ళెదుట కదలాడే వాస్తవం. బానిసల్ని కొనడానికి అమ్మడానికి, తప్పించుకుపోయిన బానిస వివరాలు తెలిపిన వారికి నజరానా ప్రకటించే పేపర్ ప్రకటనలు తరచూ కనిపిస్తాయి. నేటికి ప్రపంచంలో కొన్నిచోట్ల బానిస సంస్కృతి కొనసాగుతూనే ఉండటం బహు విచారకరం. వారికోసం ప్రార్థించడం మన బాధ్యత.

# ఆగష్టు 10 బ్లాక్ డే గా పాటించాలి!

జూలై 30 : దళిత క్రైస్తవులు, దళిత ముస్లీంలు ఆగష్టు 10వ తేదీను బ్లాక్ డేగా పాటించాలని దళిత క్రైస్తవుల జాతీయ సమాఖ్య పిలుపునిచ్చింది.

1950 ఆగష్టు 10న అప్పటి భారత రాష్ట్రపతి 1950ను జారీ చేస్తూ, అందులో షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించతగిన వారి గురించి ప్రస్తావించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 341 (1) ప్రకారం తనకున్న అధికారం చొప్పున ఆయన ఆ ఉత్తర్వు జారీ చేశారు. ఆ ఆర్డర్‌లోని మూడవ పేరాలో హిందూ మతానికి చెందిన వారు తప్ప మరెవరిని షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించరాదని పేర్కొనడం జరిగింది. దానిని సవరించాలని, రిజర్వేషన్ సౌకర్యాలు హైందవేతరులకు వర్తింప చేయాలని, అప్పటి నుండి ఎన్నో రకాలుగా దళితులు మొత్తుకొంటున్నప్పటికీ ఫలితం శూన్యం.

1956 మరియు 1990లో సవరణ ఫలితంగా షెడ్యూల్డ్ కులాల జాబితాలోకి సిక్కులు, బౌద్ధులు చేరినప్పటికీ క్రైస్తవులు, ముస్లీంలకు మాత్రం చోటు దక్కలేదు.

గత 60 సంవత్సరాలుగా దళిత క్రైస్తవులు, దళిత ముస్లీంలు ఈ ఉత్తర్వును సవాలు చేస్తూనే ఉన్నారు. తమను షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించకుండా తమ రాజ్యాంగపు హక్కుల్ని కాలరాయడం రాజ్యాంగ విరుద్ధమని వాది స్తున్నారు. ఆర్టికల్ 14, 15, 25లను ఉటంకిస్తూ తమకు సమాన న్యాయం కావాలని, మత ప్రాతిపదికన తమపై వివక్ష జరగరాదని, తమకిష్టమైన మతాన్ని, విశ్వాసాన్ని అవలంభించే స్వేచ్ఛ తమకుందని పోరాడుతున్నారు.




జస్టిస్ రంగనాథన్ మిశ్రా కమీషన్ తన రిపోర్ట్‌లో 1950 ఆర్డర్‌ను పూర్తిగా తొలగించడం చాలా ఆవశ్యకమని, మత ప్రాతిపదికన షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించడం భావ్యం కాదని, షెడ్యూల్డ్ తెగల మాదిరిగా షెడ్యూల్డ్ కులాలను కూడా మతాలకు అతీతంగా నిర్ణయించడం న్యాయమని సిఫార్సు చేసింది.

దళితులకు రిజర్వేషన్ కల్పించాలని 2000లో బీహార్ అసెంబ్లీ, 2006లో ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ, 2009లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టాయి. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఇందుకు సుముఖంగానే ఉన్నాయి. ప్రస్తుత ప్రధాన మంత్రి, ఇతర ప్రముఖ మంత్రులు దీనికి సంబంధించి ఎన్నో హామీలు ఇచ్చారు. అయితే అవన్నీ వట్టి మాటలుగానే మిగిలిపోయాయి.

ఈ నేపథ్యంలో నిరసనగా బ్లాక్‌డేను పాటించాలని ఆగష్టు 10న జిల్లా కలెక్టర్లకు, తహసిల్దారులకు మెమోరాండం సమర్పిం చాలని, బహిరంగ సభలు, ప్రెస్‌మీట్‌లు నిర్వహించాలని సమాఖ్య పిలుపునిచ్చింది.






**పేపర్ మిల్లుకు ముడి సరకుగా బైబిళ్ల తరలింపు పై తీవ్రంగా స్పందించి భీమవరం ప్రకాశం చౌక్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రెవ. గంటా సుమంత్ కుమార్, మరియు పలు క్రైస్తవ సంఘాల నాయకులు భీమవరం, డిప్యూటి తహసిల్దార్ గారికి దోషులను కఠినంగా శిక్షించాలని వినతి పత్రం సమర్పిస్తున్న రెవ. సుమంత్ కుమార్ మరియు క్రైస్తవ సంఘ నాయకులు**

## కుర్చీ చెప్పిన చర్చి కథలు

# తప్పిపోయిన తండ్రి



డా॥ కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్

**ఆ**రోజు ఆదివారం. ఉదయాన్నే "ఇది విన్నారా?" అంటూ మా యింటికి పరుగున వచ్చారు మా పక్కింట్లో వుంటున్న హిందీ మాస్టారు ఖాదర్.

అపుడే తీరుబడిగా పేపర్ చూస్తూ వున్న నేను తలెత్తి చూసి ఖాదర్ మాస్టారుని లోపలికి ఆహ్వానించాను. ఆందోళన, వేదన, కోపం మిళితమైన స్వరంలో ఆయన చెప్పిన విషయం విన్నాక నా తల కొట్టేసినట్టైంది.

స్థూలంగా విషయం ఏమిటంటే ఆ వూర్లోని ఒకానొక ప్రార్థనామందిరం పెద్ద గారు కొత్తగా మందిరానికి వస్తున్న ఓ ముస్లిం అమ్మాయిని లేవదీసుకుని ఎటో వెళ్ళిపోయాడు. ఆయన గారు గతంలో సహోదరీలతో అభ్యంతరకరంగా వ్యవహారిస్తుండడంతోనే బదిలీపై ఇక్కడికి రావడం జరిగింది. ఇపుడిక్కడ జరిగిన ఈ వ్యవహారం ఏ రంగు పులుముకుంటుందో, ఎన్ని గొడవలకు దారితీస్తుందో అనుకుంటూ వచ్చిన మిత్రుణ్ణి అనునయించి టీ యిచ్చి సాగనంపేసరికి సరిగ్గా చర్చీకి వెళ్ళే సమయమైంది.

నాకు తెలిసి ఆ మధ్య ఓ సంఘటన జరిగింది. మందిరంలోనే వుండి ఆ పనీ, ఈ పనీ చేసే ఓ అనాథ బాలికపై మందిరం పెద్ద అత్యాచారం జరుపబోగా ఆ అమ్మాయి కేకలు విని పరుగెత్తుకొచ్చిన సంఘస్థులు ఆ పెద్దగారి ఘనకార్యాన్ని నిలదీస్తే సిగ్గుతో బిక్కచచ్చిపోయి "క్షమించండి! ఆ క్షణం నన్ను లూసిఫర్ ఆవహించాడు. నేనేం చేయబోయానో నాకే తెలీదు" అన్నాడట.

బుగ్గలు, కాళ్ళు, చేతులు రక్కబడిన ఆ అమ్మాయిని హాస్పిటల్లో చేర్పించారు.

ఛీ........ఛీ ఇంలాటి వాళ్లవల్ల దేవుని నామానికెంత అవమానం! మనసు పరిపరి విధాలుగా కొట్టుకొనిపోతూ వుండగా శ్రీమతిని, పిలల్ని వెంటబెట్టుకుని చర్చీ ప్రాంగణం చేరుకున్నాను.గతవారమే చక్కగా రిపేర్ చేయబడిన నా చెక్క కుర్చీ నాకోసం ఎదురుచూస్తూ వుంది. వెళ్ళి కూచున్నాను.

"హలో మిత్రమా! ఏమిటి అలా వున్నావు?" కుశల ప్రశ్నతో పాటు నా ధోరణిని ప్రశ్నించింది కుర్చీ.

ఆ రోజు ఉదయం మా పక్కింటి ఖాదర్ మాస్టారు తెచ్చిన కబురు సవిస్తరంగా కుర్చీతో ప్రస్తావించేను.






"నిజమే మిత్రమా! ఇలాంటి ప్రబుద్ధులు కూడా ఉన్నారు. అసలు కాపరిత్వాన్ని ఏదో బ్రతుకుదెరువు ఉద్యోగంగా భావించి వ్యవహరించే వ్యక్తులూ ఉన్నారు. ఈ రోజు నీకు ఓ తప్పిపోయిన తండ్రి కథ చెబుతా విను" అంది కుర్చీ.

అంత దాకా అదోలా వున్న నేను కుతూహలంతో "తప్పిపోయిన తండ్రా!" అన్నాను. "అవును! తప్పిపోయిన తండ్రే!" అంటూ మొదలు పెట్టింది కుర్చీ.

"ఆ వూర్లో అదొక చర్చి. చర్చీ కాంపౌండ్ లోనే ఒక కాన్వెంటు. ఆ కాన్వెంటు వెనుక ఓ చిన్న హాస్టలు.

ఆ చర్చికి ఒక గురువు వుండేవాడు. ఆ గురువునే వాళ్ళు పాదిరి అంటూ ఉంటారు. ఆ పాదిరి ఓ నడి వయస్కుడు, అగ్రకులస్థుడు. చర్చి కాంపౌండ్‌లో వున్న కాన్వెంటు స్కూలుకు ఆయనే కరెస్పాండెంటూ,అధికారి కూడా.

ఇలా వుండగా ఆ కాన్వెంటులో పని చేస్తున్న ఓ ఉద్యోగినితో పాదిరి సంబంధం పెట్టుకున్నాడు. ఆవిడ ఎపుడుబడితే అపుడు పాదిరి యింటికి పరుగుపెట్టడం, ఈయనగారు అర్ధరాత్రీ, అపరాత్రీ అనకుండా కాంపౌండ్‌లోనే ఉపాధ్యాయినిలకిచ్చిన మకాంలోనికి చేరిపోవడం నిరాఘాటంగా జరిగిపోతూ ఉండేది.

అయితే ఒకరోజు అర్ధరాత్రి తప్పత్రాగి వచ్చిన పాదిరిగారు ఒక గదిలోనికి చొరబడబోయి మరోగది తలుపు తట్టడంతో పరిస్థితి తారుమారైంది.



భయపడిపోయిన ఉద్యోగినులు బజా ర్లోకి పరుగెత్తారు. ఎంతోకాలంగా సాగు తున్న వ్యవహారం వూళ్ళో తెలిసిపోయింది. అంతే! రోడ్డునే చాకిరేవు చేసి ఆ పాదిరిని ఉతికి ఆరేశారు వూళ్లో జనం. కొన్నాళ్ళు కాన్వెంటు మూతపడింది. ఆ పాదిరిని తొలగించి మరో పాదిరిని నియమిస్తారేమో అనుకున్నారంతా! కాని అలా జరగలేదు.

ఈ దుష్టపాదిరి వెళ్ళి అధిష్టానికి మొర పెట్టు కున్నాడు. కాళ్ళా వేళ్ళా పడ్డాడు. అక్క దున్న బిషప్ ఈ మహానుభావుడి కులస్థుడే గనుక ఆ కులాభిమానం పనిచేసి దుష్ట పాదిరికి పదవి పదిలమైంది. అదే వూరూఖా యమైంది. నిస్సిగ్గుగా అక్కడే కొలవైన ఆ ప్రబుద్ధుణ్ణి చూసి నోటిమీద వేలుంచు కోవడం మాత్రం జనం వంతు అయ్యింది. వూళ్ళో వాళ్ళ బెదిరింపులకు జడిసి కాన్వెంటు ఉద్యోగిని మాత్రం ఎటో ఉడాయిం చింది. అదొక్కటే ఊరడింపుగా మిగిలింది. ఇక ఈ పాదిరి వున్నాడు చూశావూ! ఒక్క పేరుకు మాత్రమే సర్వపరి త్యాగి. వాళ్ళ చుట్ట పక్కాలకు ఆ చర్చి, కాన్వెంటు వాటి ఆవరణ ఓ వేసవి విడిది, ఇష్టారాజ్యం.

సంసారి తన ఒక్క కుటుంబాన్ని పోషిం చుకోడానికి సతమతమౌతున్న ఈ రోజుల్లో ఈ పాదిరి ఖర్చు పది కుటుంబాల పెట్టు.

వంది మాగధులకు, బంధు మిత్రులకు చర్చి, కాన్వెంట్ల రాబడిని ధారాదత్తం చేస్తుం టాడు. కాంపౌండ్‌లో వుండే హాస్టలు పిల్లలతో మందుసీసాలు, సిగరెట్లు, బిరియానీ పొట్లాలు తెప్పించుకోవడం మస్తు ఖుషి చేయడం ఏళ్ళు నిండిన పాదిరికి నిత్యకృత్యాలు.

తన సంఘపు పరిధిలోని పేదసాదలకు పంపిణీ కోసం పై నుండి వచ్చే వంట నూనెలు తదితరాలు చేరవలసిన ఇళ్ళకు చేరిపోతూ ఉంటాయి. అడిగేనాథుడు లేడు. అడిగినా పట్టించుకునే దిక్కులేదు.

అదేమో గాని మిత్రమా! కొందరు పాదిర్లు యధేచ్ఛగా సిగరెట్లు కాలు స్తుంటారు. గుట్కాలు నమిలే స్తుంటారు. పేకా టల్లో వినోదిస్తుం టారు. మందు సీసాలు ఖాళీ చేస్తుంటారు.

ఇదేమిటని ప్రశ్నిస్తే "భలే వారండీ! ఇందులో ఏముంది? ఇవి జస్ట్ హాబిట్స్!" (అలవాట్లు) అంటూ తేలగొట్టే స్తుంటారు.

ఛీ! వీళ్ళకు ప్రభువు సంస్కా రపు ద్రాక్ష రసానికి బజారు మద్యానికి తేడా తెలీదు.

వీళ్ళా! పాది ర్లు!! వీళ్ళ పాదిరి త్వాల్లో సంఘాలు మట్టిగొట్టుకు పోతున్నాయి. పాదిర్లు! కొందరు క్షమా, కనికరం లేని రాతిగుండెలు! మంచి మానవత్వం ఆదర్శంలేని తప్పిపోయిన తండ్రులు.

గొర్రెతోలు కప్పుకున్న ఇలాంటి తోడే ళ్ళను మంద నుండి తోలివేయాలి.అలనాడు యెరుషలేం దేవాలయంలో క్రయ విక్ర యాలు చేసే అక్రమకారుల్ని కొరడా ఝుళి పిస్తూ యేసుప్రభువు పారద్రోలినట్టు, దేవాల యాల్ని వ్యాపార కేంద్రాలుగా వ్యభిచారుల, దొంగల గుహలుగా మార్చే ఈ వెలుగు దూతల వేషగాళ్ళను, దొంగజపం కొంగ లను తక్షణం తరిమెయ్యాలి. సంఘాల్ని దేవుని బిడ్డలే రక్షించుకోవాలి" అంది కుర్చీ.

"సరే గాని ఆ పాదిరి అక్కడే కొనసాగ తున్నాడా ఏం" ప్రశ్నించేను. "నిక్షేపంగా! తన పదవీ విరమణ వయస్సు దాటిపోయినా అధిష్టానాన్ని పొడిగింపు కోరుతూ అక్కడే తిష్టవేశాడు" "ఎందుకట!" అడిగాను."కారణమేమిటంటే అతగాడికో అన్న కొడుకు ఉన్నాడట. ఆ కుర్రాడు పాస్టరు తర్ఫీదు పూర్తి చేసుకోబోతున్నాడు, ఆ కుర్రాణ్ణి అదే విచారణ సంఘానికి పాదిరిగా నియమింపజేసుకుని అక్కడే మరణ పర్యంతం ఖుషీగా బతకాలని ఈయన తాపత్రయం" అంది కుర్చీ.

"దేవుడే అలాంటి సంఘాల్ని విచారించు గాక. రక్షించుగాక" అన్నాను విచారిస్తూ.

అంతలో చర్చీలో ప్రారంభకీర్తన మొదలైంది. కుర్చీతో నా సంభాషణ ముగించి కీర్తనతో శృతి కలిపేను. ●

# యాత్ర కీర్తనలు -1



"వేదశ్రీ" రెవ. డా॥ డి.వి. డానియెల్

## 120వ సునాదం

బైబిల్లోని కీర్తనలగ్రంథంలో–120 నుండి 134 వరకు "యాత్రకీర్తన" అనే శీర్షికతో 15 కీర్తనలున్నాయి. వీటిని కొందరు పండితులు "ఆరోహణ" (ఎక్కుడు) కీర్తనలు" (Songs of Ascent / songs of Degrees) అన్నారు. మరి కొందరు "యాత్రకీర్తనలు" (Songs of Pilgrimage) అన్నారు. ఈ శీర్షికనే అధిక సంఖ్యాకులు ఆమోదిస్తున్నారు. యెరూషలేంలో జరిగే యూదుల ఆయా వార్షిక ఉత్సవాల్లో పాల్గొనడానికి ఆయాప్రాంతాల నుండి యూదులు బృందాలుగా పయనించేప్పుడు మార్గాయాస నివృత్తి కొరకు వీటిని పాడుకొనేవారు పయనంలో మకాం వేసే చోట వాయిద్యాలతో వారు శ్రావ్యగీతాలు పాడుతుంటే స్థానికులు (యూదేతరులు) గుంపులుగ వచ్చి పాడమని అడిగేవారు (కీర్తన 37:3,4)

యెహోవా తమకు, తమ పితరులకు చేసిన మేళ్లను స్మరిస్తు, ఆయన కృప నిమిత్తం స్తుతిస్తు, శత్రుబారి నుండి రక్షించుమని పాటల ద్వారా వేడుకొనేవారు. ఆనాడు అవి యూదుల కొరకు చేసిన రచనలైనా, నేడు క్రైస్తవ విశ్వాసులకు కూడ జీవితయాత్రలో –ఎంతో ధైర్యాన్ని, మన శ్శాంతిని, ఆదరణను, నిరీక్షణను, విశ్వాసాన్ని బైబిల్లోని కీర్తనలన్ని అందిస్తున్నాయనడం వాస్తవం. ఈ 15 కీర్తనల్లో నాలుగు (122, 124,131, 133) దావీదు రచనలు, ఒకటి (127) సొలొమోను రచన. మరోకోణంలో చూస్తే –బైబిల్లోని కీర్తనలన్ని రచయితల వ్యక్తిగత అనుభవాలకు, అభిప్రాయాలకు, భావోద్వేగాలకు అద్దంపట్టినా, యావత్తు యూదా ప్రజల ఆధ్యాత్మిక, మానసిక ధోరణికి, సామాజిక పరిస్థితులకును, వారి చరిత్రకును, శత్రువులు వారి పట్ల ప్రదర్శించిన కౄరత్వాన్ని, నిర్దయను వ్యక్తం చేస్తాయి.

120వ కీర్తనను విశ్లేషిద్దాం : చెరకాలంలో –విదేశీయుల అహంకారం క్రింద యూదులు అనుభవించిన శ్రమల్లో యెహోవా – ప్రతిస్పందనను మొదటి వచనం వెల్లడిస్తుంది. 2,3 వచనాల్లో –శత్రువుల "అబద్ధమాడు పెదవులను", "మోసకరమైన నాలుక"ను ప్రస్తావిస్తు, – వారి మీద యెహోవా "తంగేడు (హీబ్రూలో–రోథెమ్") నిప్పుల" బాణాలను సంధిస్తాడంటాడు రచయిత "నాలుక" (ఇంగ్లీష్ : tongue; హీబ్రూ : Lsahon; గ్రీల్ : glossa) ప్రసక్తి – ఏకవచన, బహువచన రూపాల్లో సుమారు 134 మార్లు బైబిల్లో కన్పిస్తుంది. కొన్నిచోట్ల "మాట" ను "భాష" ను కూడ tongue అని ఇంగ్లీష్‌లో అనువదించారు. (యెహోషువ 10:21, మొ॥) యాకోబు పత్రికలో (3:2–12) ఇహ–"పెదవి" (ఇంగ్లీష్ :Lip; గ్రీల్ :Cheilos) ప్రసక్తి –ఏకవచన, బహువచన రూపాల్లో సుమారు 121 మార్లు కన్పిస్తుంది. ఈ పదాన్ని కూడ ఇంగ్లీష్ బైబిల్స్‌లో కొన్నిచోట్ల "మాట", "నోటిమాట"గా తర్జుమా చేసారు. మానవ దేహంలో ఈ రెండు (పెదవులు, నాలుక) ఒకదానితో ఒకటి పరస్పరం సహకరిస్తుంటాయి. తినడానికి, మాట్లాడ్డానికి ఈ రెండు సహకరిస్తు మనవ్యక్తిత్వాన్ని కూడ తెలుపుతుంటాయి. ఏమి తింటున్నాము? ఏమి మాట్లాడుతాము? ఆనాడే కాదు –ఈనాడు కూడ– "మోసకరమైన నాలుకలు", అబద్ధమాడు పెదవులు మనమధ్య, మనచుట్టు ఉన్నాయి. ఇంతకూ, మన నాలుకలు, పెదవులు ఎలా ఉన్నాయో మనకే బాగా తెల్సు. డాక్టర్స్ – పెదవులను నాలుకను పరీక్షించి రోగనిర్ధారణ చేస్తారు కాని మన అబద్ధాలను, మోసాలను చెప్పలేరు; దేవుడు చెప్పగలడు సుమా!

ఐదోవచనం : "అయ్యో నేను మెషెకులో పరవాసినైయున్నాను" అని క్షోభించాడు రచయిత, మెషెకు ఎవరు? నోవహు కుమారుల్లో –యాపెతు ఒకడు (ఆది 10:1) యాపెతు కుమారుల్లో ఒకడు మెషెకు (ఆది 10:2) అతని వారసుల్లో "మష్కి" అనే జనాంగం –నల్ల సముద్రానికి, కాస్పియన్ సముద్రానికి మధ్య నున్న ప్రాంతంలో నివసించే అనాగరికులు, మొరటు ప్రజ.

"కేదారు" ఎవరు? మనమెరిగినట్టు –ఇష్మాయేలు తండ్రి అబ్రహాము (యూదుడు), తల్లి హాగరు (ఐగుప్తీయురాలు) ఇష్మాయేలు రెండవ కుమారుడు కేదారు. అతని వారసులు కూడ అనాగరికులు; వారు ఉత్తర అరేబియా ఎడారి ప్రాంతంలో ఉండేవారు. ఇష్మాయేలును గూర్చి బైబిల్లో ఏముందో చూడండి (ఆది 16:12). కేదారు ప్రజలు, మెషెకు ప్రజలు –అడవి జాతి ప్రజలుగ, నిర్ధయకు సూచికలుగ, యుద్ధ ప్రియులుగ చరిత్రలో పేరుపొందారు. అలాంటి కౄరుల మధ్య రచయిత పొందిన శ్రమలను 5,6 వచనాలు వర్ణిస్తాయి.

చివరిగా –7వ వచనంలో రచయిత తన ఆకాంక్షను వెల్లడించాడు: "నేను కోరునది సమాధానమే, అయినను మాట నా నోట వచ్చిన తోడనే వారు యుద్ధమునకు సిద్ధమగుదురు" అలాంటి వారు కూడ నేడు మన మధ్య మన చుట్టును ఉన్నారు కదా? మనమెలా ఉంటున్నాము? మనం సౌమ్యంగ మృదువుగా మాట్లాడినా, సమాధానంగా మసలుకోవాలని యత్నించినా, సూటిపోటు మాటలతో, నిందలతో, ఆపనిందలతో బాధించేవారు, విసికించే వారు మన జీవితయాత్రలో కన్పిస్తునే వున్నారు. మన కర్తవ్యం? వారిని క్షమించి, క్షమించుమని ప్రభువును వేడుకొంటూ, వారి వాక్బాణాలను సహించి, తీర్పును దేవునికే వదలాలి. "యెహోవా యీరే!"

*ప్రార్థన : నీతికి, శాంతికి, సమాధానానికి కర్తవైన మా పరమ తండ్రీ, మా పొరుగు వారిని మేము క్షమించినట్టు మమ్మును క్షమించుమని "సమాధాన కర్తయగు అధిపతి" పరిశుద్ధ నామంలో వేడుకొంటున్నాము. ఆమేన్!* ●

# దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు వుండాలి

## "గీటురాయి"

**డా॥ సత్యనారాయణ్ జైతియా** (మాజీ కేంద్రమంత్రి)

***భారతదేశంలోని దళితులలో ఎక్కువ శాతం మంది క్రైస్తవులే. ఈ వాస్తవం అందరికీ తెలుసు, దళితుల జీవన పరిస్థితులకు, క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు తేడా ఏమీలేదు. అయితే, దళితులకు రాజ్యాంగపరంగా, ఇవ్వబడిన హక్కులు, రాయితీలు, రిజర్వేషను సదు పాయాలను క్రైస్తవులైన దళితులకు లభించడంలేదు. దళితులతోపాటుగానే, దళిత క్రైస్తవులు కూడా అన్ని రంగాలలోను వెనుకబడే వున్నారు. పైగా, సామాజికంగా కూడా అంటరాని తనానికి గురి అవుతున్నారు. వీరు సమాజంలో అభివృద్ధి చెందడానికి వీలుగా దళితులుగల ఎస్సీ, జాబితాలో చేర్చాలని చాలా సంవత్సరాలుగా పోరాటం జరుగుతోంది. కాని ఎవరూ పట్టించుకొనడం లేదు. 2003 డిశంబరు 18వ తేదిన లోక్‌సభలో కేంద్ర సాంఘిక న్యాయము మరియు సాదికారత శాఖ మంత్రి డాక్టర్ సత్యనారాయణ్ జైతియా చేసి ప్రకటనను ఈ దిగువ ఇస్తున్నాము. ఇది చాలా ఆసక్తి దాయకమైన ప్రకటన (సం)***

లోక్ సభలో 2003 డిసెంబరు 18వ తేదీన రాజేష్ రంజన్, మరి కొంతమంది సభ్యులు కలసి ఒక సావధాన తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి సమాధానమిస్తూ, ఎన్.డి.ఎ ప్రభుత్వం లోని కేంద్ర సాంఘిక న్యాయం మరియు సాధికారశాఖ మంత్రి డాక్టర్ సత్యనారాయణ్ జైతియా ఒక ప్రకటన చేశారు. దళిత ముస్లిములను, దళిత క్రైస్తవులను, ఇతర వెనుకబడిన తరగతుల కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాలలో చేర్చి, వారికి రిజర్వేషన్ సౌకర్యాలు కలుగజేయవలసిన అవసరం కలదన్న డిమాండ్ ఆసావధాన తీర్మానంలోవుంది. దీనిపై మంత్రి చేసిన ప్రకటన క్రింది విధంగా వుంది. రాజ్యాంగంలోని 366 (24) అధికరణం ప్రకారం షెడ్యూల్డు కులాలు అనగా 341వ అధికరణంలో పేర్కొనబడిన కులాలు,జాతులు, తెగలు అని భావించాలి. 341 అధికరణంలోని ఒకటవ క్లాజు, ప్రత్యేక రాష్ట్రంలోని, ప్రత్యేక కులాలను, తెగలను, ఆ రాష్ట్ర గవర్నర్‌తో సంప్రదించి, పబ్లిక్ నోటిఫికేషన్ ద్వారా షెడ్యూల్డు కులాల జాబితాలోకి, ఎస్టీ జాబితాలోకి రాష్ట్రపతి చేర్చడానికి వీలు కలిగిస్తున్నది. అంతేగాక, 341 అధికరణంలోని రెండవక్లాజు ఒకటవ క్లాజు ప్రకారం నోటిఫికేషన్‌లో పేర్కొన్న కులాలను, తెగలను, లేదా వాటిలో కొన్నింటిని తిరిగి ఎస్సీ. ఎస్టీ జాబితా నుంచి తొలగించడానికి లేదా అదనంగా కొన్ని చేర్చడానికి పార్లమెంటు శాసనం చేసే అవకాశం ఇవ్వబడింది. ఇందుకోసం మరో నోటిఫికేషన్‌ను రాష్ట్రపతి జారీ చేయనవసంరంలేదు. 1950లో జారీ అయిన రాజ్యాంగ ఉత్తర్వు (ఎస్సీలు)లోని మూడవ పేరాలో హిందు, సిక్కు, బౌద్ధమతాలు మాత్రమే చేర్చబడినవి.

దీని ఫలితంగా పైన తెలిపిన మూడు మతాలవారు ఎస్సీ జాబితాలో చేరడానికి అర్హులు అయితే, 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వు మూడవ పేరాలోని ఆంశాలకు అనుగుణంగా వుండాలి. హిందూ సమాజంలోని కులవ్యవస్థలో అట్టడుగున వుంటూ, అంటరానితనాన్ని అనుభవిస్తున్న నిమ్నకులాల వారి అభ్యున్నతికి చర్యలు అవసరమని, సుప్రీంకోర్టు కూడా అభిప్రాయపడింది. ఆర్థిక, విద్య, సాంఘిక సాంస్కృతిక అంశాలలో ఇటువంటి వారికి ప్రత్యేక అవకాశాలు కలిగించాలని కూడా అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. రాష్ట్రపతి 1950 రాజ్యాంగ ఉత్తర్వు (ఎస్సీ) లోని మూడవ పేరాను చట్టబద్ధం చేయడం సమంజసమేనని 1983లో సుప్రీంకోర్టు తీర్పుయిచ్చింది.

ఇక దళిత ముస్లిముల విషయానికివస్తే, 1935 నుంచి 50 వరకు, ఎస్సీల ప్రయోజనాలను దళిత ముస్లిములు పొందినట్లు ప్రభుత్వ రికార్డులలో లేవని కేంద్రమంత్రి వివ రించారు.

1935 నాటి భారతప్రభుత్వ చట్టంలో గల షెడ్యూల్డు కులాల జాబితాను 1950 నాటి ఉత్తర్వులో సవరించారు.

అంతేగాక 1935-50 మధ్య కాలంలో గల అణగారిన (దళిత) వర్గాల జాబితాలో దళిత ముస్లిములుగాని, దళిత క్రైస్తవులుగాని లేరు.

హిందూ సమాజంలో వంశపారంపర్యం గా దేవలయం ప్రవేశం నిరాకరించబడిన ప్రత్యేక బావులలో మాత్రమే నీళ్లు తీసుకోవా లని, పాఠశాలలోపల కూర్చోడానికి నిరాకరించబడిన కులాలవారినే అణగారిన లేదా దళిత తరగతులుగా పేర్కొనబడింది. దీన్నిబట్టి దళిత ముస్లిములు, దళిత క్రైస్తవులు ఈ పరిధిలోకి రారు. ఈ మధ్యకాలంలో దళిత క్రైస్తవుల సమస్య ముందుకు వచ్చింది. వీరిని ఎస్సీ జాబితాలో చేర్చాలన్న ప్రతిపాదన వచ్చింది. దీనిపై భారత ప్రభుత్వం వివిధ కమిటీల అభిప్రాయాలు తెలుసుకున్నది. క్రైస్తవులను కులప్రాతిపదికపై పరిశీలించాలన్న ప్రతిపాదన అంతర్జాతీయ స్థాయిలో వివాదాంశమై కూర్చుంది. క్రైస్తవులలో కులవ్యవస్థను భారతదేశంలో బలవంతంగా రుద్దుతున్నదన్న దురభిప్రాయం ప్రపంచదేశాలకు కలిగివుంటే, అది తప్పని క్రైస్తవులలో ఎవరికి గాని రిజర్వేషన్ సదుపాయాలు కలిగించడం సమంజసమైన పద్ధతి కాదని భారత రిజిస్ట్రార్ జనరల్ అభిప్రాయపడ్డారు.ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ క్రింది విధంగా అభ్రిపాయపడింది. రిజర్వేషన్ల ప్రయోజనాలు కలిగించేందుకు, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చడం, న్యాయ సమ్మతంకాదని, అభిలషనీయం కాదని ఈ కమిషన్ అభ్రిపాయపడింది. ఇదే గాక, ముస్లిములను కూడా ఎస్సీ జాబితాలో చేర్చడం సమంజసం, న్యాయసమ్మతంకాదని ఈకమిషన్ భావించింది. మత ప్రాతి పదికపై మాత్రం ముస్లిములను ఎస్టీల జాబితాలో చేర్చవచ్చునని ఎస్సీ, ఎస్టీ జాతీయ కమీషన్ సూచించింది. ●

# రెండంచుల ఖడ్గం

గేరా దినకర్ ప్రభు



“కాబట్టి మీ మనసు నడుము కట్టుకొని నిబ్బరమైన బుద్ధి గలవారై యేసుక్రీస్తు ప్రత్యక్షమైనపుడు... సంపూర్ణ నిరీక్షణ కలిగి యుండుడి.” 1పేతురు 1:13.

గ్రేస్‌టుయు-మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు జాన్ మెకార్థర్ ఇటీవల ఫ్లొరిడాలో నిరీక్షణ, శోధనలగురించి ప్రసంగించాడు. అది ముగిసిన తర్వాత ఒక స్త్రీ ఆయనను ఎదుర్కొన్నది. “మీరు చెప్పిందంతా తప్పు. ఒకసారి మనల్ని మనం ప్రభువుకు సమర్పించుకుంటే, ఆయన మనలో నిండిపోతాడు. ఇక మన క్రియలు మనవి కావుగనుక మనకు శోధనలే రావు. మంచి గొర్రెలకాపరి మనలను అనుక్షణం కాపాడుతునే వుంటాడు కదా” అన్నది.

నిజమే, వాక్యం రెండంచుల ఖడ్గం. బైబిల్లో పరస్పర విరుద్ధ వాక్యాలు, అక్కడక్కడా కనిపిస్తాయి. వాటిని అర్థం చేసికొనడం చదువరులకు కష్టమే. అందుకు సువార్తికులు గాక, బైబిల్ పండితుల అవసరం చాలా వున్నది. ఎన్ని అంచుల ఖడ్గమైనా, అదిచేసే పనిఒకటే.

యేసు నరుడా, దేవుడా? నూటికి నూరు పాళ్లు మానవుడు,నూటికి నూరు పాళ్లు దేవుడు నరుడు గనుగనే మృతి చెందాడు దేవుడు గనుక మళ్ళీ లేచాడు. ఈ భూమిపై మనుష్య కుమారుడు, పరలోకంలో తండ్రి చెంత సింహాసనాసీనుడు ఆయనే. ఇది కొంత వివరణ కోరే పదాలు. క్రీస్తును నమ్మిన వారికి సుపరి చితమైన విషయాలు. సత్యం, జీవం ఆయనే గనుక మనం ఆయన్ను సంపూర్ణంగా తెలిసి కొనలేము. మన వంటి దేవుడు మనలను శాసించ లేడు. సర్వజ్ఞాని దేవుడే. మనకు ఉపకారి, సమర్థుడు.

ఫిలిప్పీయులకు పత్రిక రాసిందెవరు పౌలా? దేవుడా? పౌలు పరిశుద్ధాత్మ నిండిన వాడై ఇవన్నీ రాయగలిగాడు. పాత నిబంధన కూడా దేవునిసాయంతో ప్రవక్తలు రాసినవే.

మనలను మనం కుమ్మరి చేతిలోని మట్టిగా కాపరి రక్షణలోని గొర్రెపిల్లగా పోల్చుకుంటున్నాము, ఇందులో మన కార్యమేమి లేదు. సర్వం ఆయనవశం. ఆయన నన్ను పట్టుకున్నాడు. నేను ఆయన చేతిలోనున్నాను. ఇది యేసుపై ఆనుకున్న వారి విశ్వాసం.

రెండవ కోవ, ధైర్యంగా శోధనలను ప్రతిఘటించే వారు. ఇది దేవుని శుద్ధీ కరణకు ఆటంకం. శోధనలను తామే ఎదుర్కొంటునపుడు వారిలో కించిత్ గర్వం తలెత్తే ప్రమాదమున్నది. గర్వం నాశన కారి గదా.

ఇపుడు ఫీలిప్పీయులకు పౌలు రాసిన పత్రిక 2:12-13 అర్థవంతంగా చదువుదాం. “కాగా, నా ప్రియులారా, మీరెల్లప్పుడు ను విధేయులైయున్న ప్రకారము. మీసొంత రక్ష ణను కొనసాగించుకొనుడి.... తన దయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే” ఇదేమిటి? మన సొంత రక్షణను మనం కొనసాగించుకుంటుండగా, అందులో కార్యసిద్ధి దేవుడు కలిగిస్తాడా? ఇక్కడ నేను క్లుప్తంగా చెప్పినా, దానికి రెండర్థాలున్నాయి. మీ రక్షణ కార్యం మీరే కొనసాగించాలి. రెండవది అందుకు కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే. ఇది అతిప్రాముఖ్యం మరొక ఉదాహరణ కావాలా? 1 రాజులు 8:55-61 పరిశీలిద్దాం.

సొలొమోను మహారాజు దేవుని ఆలయం నిర్మించాడు. అది పూర్తయిన వెంటనే, గొప్ప శబ్దంతో ఇశ్రాయేలీయుల సమాజమంతటినీ దీవించాడు. “మన పితరులకు తోడుగానున్నట్లు. మనకును తోడుగా నుండి.... మన హృదయములను తన తట్టుత్రిప్పు కొనును గాక..... మీ హృదయము మీ దేవుడైన యెహోవా విషయమై సర్వసిద్ధముగా నుండును గాక”.

ఇక్కడకూడా రెండు పరస్పర విరుద్ధ కార్యాలు కన్పిస్తున్నాయి. మన హృదయాలను దేవుడు తనవైపు త్రిప్పుకొంటున్నాడు. మరియు, మన హృదయాలను సర్వ సిద్ధంగా వుంచాలి. రెండు వాక్యాల ఫలిత మొక్కటే. రెండు చుల గల ఖడ్గం ఉపయోగమొక్కటే.

“మీరు విశ్వ సించిన వారై కృపచేత రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగి నదికాదు. దేవుని వరమే అది క్రియల వలన జరిగినది కాదు గనుక ఎవడును అతిశయ పడవీలు లేదు. ఎఫెసీ 2:8-9

ఇనుము, రాగి, వెండి, బంగారం మొదలైనవి గనులనుండి వెలికితీస్తేనే లభిస్తాయి. అలాగే దేవుడు ఎన్నో కానుకలు మనకొరకు సిద్ధంగా వుంచాడు, కొంతైనా శ్రమించి వాటిని పొందాలి. అవి చేయిచాపితే దొరికే వస్తువులు కావు. “అపవిత్రతకును అక్రమమునకును మీ అవయవములను దాసులుగా ఏలాగు అప్పగించితిరో అలాగే పరిశుద్ధత కలుగుటకై యిప్పుడు మీ అవయువములను నీతికి దాసులుగా అప్పగించుడి.” రోమా 6:19 కనీసం మన మీ ప్రయత్నం చేయాలి. “అటువలె మీరు బహుమానం పొందునట్లుగా పరుగెత్తుడి.” 1 కొరింధి 9:24

క్రీస్తులో విశ్వాసం, బాప్తిస్మం తీసుకున్నంత సులభంకాదు. అది భూత, వర్తమాన భవిష్యత్ కాలాల అనుభవం. 1. చీకటి నుండి వెలుగులోనికి, మరణం నుండి జీవంలోనికి, పాపం నుండి పరిశుద్ధతలోనికి దాటి వచ్చాము. 2. మన విశ్వాసాన్ని కాపాడుకుంటున్నాము. 3. శరీరాన్ని విడిచి, పునరుత్థానం కొరకు నిరీక్షిస్తున్నాము.

“అంతము వరకు సహించిన వాడెవడో వాడే రక్షింపబడును.” మత్తయి. 24:13.

*తోమా సందేహన్ని పటాపంచలు జేసిన ప్రభువా! మీలో ఈ ప్రశ్నలను కలుగజేసినందుకు మీకే వందనములు.*

*మా పశ్చాత్తాపము, మా విశ్వాసము మీ క్రియలేనని నమ్ముతున్నాము. మిమ్మును ముఖాముఖి చూచినపుడు సత్యాన్ని తెలిసికోనాలని ఇప్పటినుండి అనుదినము భక్తితో ఆసక్తితో నిరీక్షిస్తున్నాము. మీ శక్తితో మేము శ్రమిస్తాం. యేసు నామంలో ఆమేన్.....*

●

(గత సంచిక తరువాయి)

# వన్యా

మెర్నా గ్రాంట్

## "దేవుడు లేని గుమ్మమే లేదు"

రాత్రి రెండు గంటలైంది. నిద్రమత్తులో మునిగిపోయాడు వన్యా. మాల్దేవియాలో కంటే ఒడెస్సాలో చలి ఎక్కువగా ఉంది. మంచు ఇంకా దట్టంగా పడకపోయినా దాని పైపొర మాత్రం గడ్డకట్టి జారేలా ఉంది. మిలిటరీలో చేరాలని ప్రభుత్వం ఆదేశించిన వాళ్ళంతా రైలుస్టేషన్ నుండి వాళ్ళని తీసుకొని వచ్చిన మిలిటరీ ట్రక్కు యొక్క వెచ్చదనంలోంచి బయటకు దూకారు. వారికి ముందు కాస్త దూరంగా కనిపిస్తున్న భవనాల వైపు వారికి దారి చూపిస్తున్న కారును వెంబడిస్తూ జారు కుంటూ పరుగెడుతున్నారు వాళ్ళంతా. చీక టిలో వేరువేరు వైపుల నుండి గలిబిలిగా విన వస్తున్న మాటల్ని గ్రహించడానికి ప్రయత్నిస్తు న్నాడు వన్యా.

"అటు, ఇటు, త్వరగా!" "రావడం ఓ గంట ఆలస్యమైంది. గంటసేపు ఇక్కడ మీ కోసం కనిపెట్టుకుని ఉన్నాం." "అటెన్షన్‌లో నిల బడండి. బద్ధకస్తులారా, ఏం జరిగింది మీకు? త్వరగా రండి!"

"ఈ రాత్రి సమయంలో వాళ్ళని పడక లకు పంపడం ఎలా? నాకేమీ తెలియడంలేదు. అసలు క్రొత్తగా వచ్చేవాళ్ళు పది గంటలకు ముందుగానే ఇక్కడికి చేరాలని ఒక నియమం ఉంది."

"ఏం చేస్తావ్ మరి? రాత్రంతా ఈ చలిలో నిలబెట్టి ఉంచుతావా?"

"వీళ్ళని ఆహ్వానించవలసిన వాళ్ళెవరు?" "కారెట్కో ఎక్కడున్నాడు? వీళ్ళొచ్చేశారు. ఎవ రన్నా కారెట్కో కోసం పరిగెత్తండి!"

చలిలో గడ్డగట్టిపోతూ వాళ్ళు పోగైన స్థలా నికి ఎదురుగానున్న మెట్లమీద టోపి కూడా కనబడకుండా ఆపాదమస్తకం ముసుగు వేసు కున్న ఓ ఆకారం మసకగా కదిలింది. కొన్ని మెట్లెక్కి గంభీరమైన స్వరంతో మాట్లాడడం ప్రారంభించాడు. గంట ఆలస్యంగా వచ్చినం దుకు గర్జించాడు. క్లుప్తంగా పలకరించి రాత్రికి వాళ్ల వాళ్ళ గదులకు పంపేయాలి. వాళ్ళు నిలబడ్డ స్థలానికి నలువైపులా ఉన్న పెద్ద పెద్ద భవనాలే సైనిక స్థావరాలు. దీప కాంతిని బట్టి అవి ఐదంతస్తుల భవనాలని తెలుస్తుంది. ఒక్కొక్క అంతస్తులోను ఆరేసి విభాగాలు, ఒక్కొక్క విభాగంలో ముప్ఫై ఇద్దరు సైనికులకు తగిన ఏర్పాట్లున్నాయి. అంటే ఒక్క అంతస్తులో నూట తొంభై ఇద్దరు సైనికులుండవచ్చు. రైలులో ఉండగా వారికి వారి అంతస్తు, పడక నంబర్లు సూచించే కాగితాలు ఇవ్వబడ్డాయి. క్రొత్త సైనికుల్ని వారి పడకలవైపు నడిపేందుకు ఆఫీసర్లున్నారు.

ఆఫీసర్ కాస్సేపాగి, గొంతు సవరించుకుని ముఖంమీద పడుతున్న తలగుడ్డను తొలగించు కొని మంచులోకి బలంగా ఉమ్మివేశాడు. ఉదయం ఆరుగంటలకు బూర శబ్దంతోలేవాలి. బట్టలు వేసుకొని పడకలు సర్దుకోడానికి ఐదే నిమిషాలు. ఆ తరువాత తక్కిన విషయాలు తెలియజేస్తారు. ఇక వెళ్ళవచ్చు. ముసుగులోని ఆకారం వెనుకగా ఉన్న ద్వారంలోకి అదృశ్యమై పోయింది.



ఆ వెంటనే చిత్ర రూపదర్శినిలా పలు రంగుల్లో సంచలనం ప్రారంభమైంది. ఆఫీస ర్లంతా ఒకేసారి జీవాన్ని పుంజుకున్నారు. తోసు కుంటూ, అరుస్తూ నలుదిశల్లోకి మనుష్యుల్ని చిన్న చిన్న గుంపుల్లోకి వెదజల్లడం ప్రారంభిం చారు. గదుల్లో ప్రవేశించిన వాళ్ళంతా సీలింగ్ నుండి వెలుగుతున్న దీపకాంతిలో పడకల పరుసల మధ్య పడి మొదటి రంగం ముగిశాక థియేటర్‌కు వెళ్ళినవాడు సీటుకోసం వెతుక్కుం టున్నట్టు వెదుక్కుంటున్నారు. ఆఫీసర్ల కేకలకు అదిరిపడుతూ అందరూ వాళ్ళ చేతిలో నలిగి ఉన్న నీలి కాగితం మీది నంబరు గల పడక కోసం త్వరత్వరగా వెరుక్కుంటున్నారు.

వన్యాకు అపరిచితమైన భాషా విధానం ఆ గదుల్లో వినవస్తుంది, లిథూనియన్లు నత్తి నత్తిగా మాట్లాడే రష్యా భాషలో తమ భావాల్ని వ్యక్తం చేస్తున్నారు. సుప్రసిద్ధమైన మాస్కో ఉచ్చారణతో ఉత్తర ప్రాంతంలో మృదువుగా మాట్లాడే పద్ధతితో మాట్లాడుతున్నారు. అలసట మాయమైపోయి ఒక్క క్షణంలో ఆ పడకలు చేతులు, కాళ్ళు, నవ్వులు, శాపాలు అన్నీ కలిసి చిందరవందరగా మాయగా మారిపోయింది.

తెల్లవారుతుంది. సన్నగా మంచు కురు స్తుంది. సైనికుల్ని మేలుకొలపడానికిగాను బోరిస్ యాకోవ్‌లివిచ్ తన బూరను పైకెత్తే సరికి అతని కనురెప్పల మీద, బూర అంచుల మీద చిన్న చిన్న మంచు పలుకులు పడ్డాయి. గతరాత్రి క్రొత్తగా వచ్చిన సైనికులున్న మూడవ అంతస్తు కిటికీల వైపు గురిపెట్టాడు. సైన్యంలో జీవితం అంటే ఎలా ఉంటుందో తెలిసికోనే క్షణాలు రానే వచ్చాయి. చల్లని గాలి గుండె నిండా పీల్చుకొని బూర ఊదడం మొదలెట్టాడు.

ఆ గదులల్లోని సంచలనం అతనికి సుప రిచితమైనదే. బట్టలు వేసుకోవాలని విపరీత మైన తొందర, ఒంటరిగా వెనుక నిలబడరా దనీ, మందకొడి, బుద్ధిహీనుడు అని వేలెత్తి చూపించుకోరాదన్న ఆతురత. యూనిఫారం తతంగం కూడా ఇప్పుడు ప్రారంభమవుతుంది. సరిపడే దుస్తులు ఒకరి దగ్గర ఒకరు మార్చు కోవడం, ఆ తరువాత చలిలో ఉదయకాల అల్పాహారంగా చేపలు, టీ పుచ్చుకోవడానికి



భోజనశాలకు నడవడం, వ్యాయమం నుండి క్లాసుకి, అక్కడి నుండి బోధనాశాలకు, భోజనా

నికి, కసరత్తుకు పరుగెత్తాల్సిన మొదటి రోజది. తిరిగి వ్యతిరేక దిశలో బూర శబ్దం చేశాడు. తనకైతే ఇక పదకొండు నెలలు మాత్రమే మిగి లాయి. ఆ విషయంలో సంతోషించాల్సిందే. అప్పటికే అతని యూనిట్ వాళ్ళందరూ నడుం మట్టుకు వస్త్రహీనులుగా పరుగెత్తడానికి స్థావరా ల్లోంచి బయటికొస్తున్నారు. అల్పాహారానికి ముందున్న గంటలో వారంతా పదిహేను కిలో మీటర్లు దూరం పరుగెత్తి వస్తారు.

బోరిస్ యాకోవ్ లివిచ్ తన బూరను క్రిందికి దించి స్థావరంవైపు నడక ప్రారంభిం చాడు. బహుశా ఈ వేళైనా గురిని కొట్టే విష యంలో కనీసం ఏ ఒక్క గుండునైనా దక్కించు కోగలుగుతానా? అన్న ఆలోచన అతణ్ణి వెంటాడుతుంది.

భోజనశాల వైపు వెళ్తూ ప్రార్థన చేసుకోవ డానికి స్థలం కనుక్కోవాలని ఆలోచిస్తున్నాడు వన్యా. మూక మూకలుగా ఉన్న సైన్యాన్ని, స్థావరాల్లో ఉండే శబ్దాన్ని చూశాక ఒంటరిగా ఉండ గలిగేది అసాధ్యమని తోచింది. ఆ స్థలం లో ఉండే చెట్లు కూడా ఒంటరిగా ఉండడం అనుమానాస్పదం అన్నట్లు గుంపులు గుంపు లుగా ఉన్నాయి.

స్టర్జిన్ అనే ఎండు చేపల వాసన ఆ పెద్ద హాలు నిండా ఉంది. ఆ చలిలో వెచ్చగా ఆహ్వానించే టీ కప్పులను అందుకోవడం కోసం వరుసలో నిలబడ్డాడు వన్యా. ఇంటి దగ్గర ఈ సమయంలో ప్రార్థన చేసుకొనేవాడు. డ్రైవరుగా ట్రైనింగు తీసుకునే సమయంలో కూడా ఎంత పని ఉన్నా ఇంటి దగ్గరైతే ప్రార్థన సమయాలు ఏర్పాటు చేసు కోవడం ఎంతో సులభం. తాను ప్రయాణం చేయాల్సిన బండి పట్టణంవైపు బయలుదేరే ముందు ప్రార్థన చేసుకోవడానికి బోలెడంత సమయం ఉండేది. ఇలాంటి శీతాకాలంలో చిన్న పిల్లలిద్దరు వెచ్చదనం కోసం వంటింట్లో పొయ్యి పైభాగంలో పండు కుంటారు. వాళ్ళ ప్రక్కకు చేరి తన ప్రార్థన వారి నిద్రకు అంత రాయం కలిగించకుండా ఉండి అక్కడ ప్రార్థిం చడం ఎంతో బావుండేది.

బహుశా ఆహారం పుచ్చుకున్నాక స్థలం కోసం వెదకాలి. వారికందిన పళ్ళాల్లోని చేపలు అయిపోయినా గాని టేబుల్ దగ్గర కూర్చున్న ముప్పై మంది సైనికులు ఇంకా ఆకలిగా ఉన్నరు. నల్లని రొట్టె ముక్కలున్న ప్లేట్లు ఒకరి నుండి ఒకరికి అందించు కుంటూ అవి కూడా ఖాళీ చేసేశారు. ఒక పెద్ద టీ పాత్రను చేత పుచ్చుకుని వరుసగా నున్న టేబుల్స్ మధ్యలో నడుస్తూ కావలసిన వారికి టీ పోస్తున్నాడొక వ్యక్తి.

ఒంటరితనంలాంటి భావం ఏదో వన్యా మనసులో మెదిలింది. తాను తలంచినట్టే ఉండక్కడ. కాని తన ముందున్న వాటిని కొంచెం తక్కువగా అంచనా వేసాడను కోవచ్చు. ప్రతి ఒక్కరికీ వారి విషయమే ఓ ప్రపంచంగా ఉంది. కప్పులో మిగిలి ఉన్న టీని గొంతులో పోసుకోవడం, ప్లేట్లో మిగిలి పోయిన రొట్టె ముక్కను నోట్లో పెట్టుకోవడం, ప్లేటు, కప్పు చేతిలో జాగ్రత్తగా పట్టుకొని బెంచిపై నుంచి దూకడం, ద్వారం వైపు పరుగెత్తడం, ప్రయాణం లో స్నేహించిన ఒక వ్యక్తిని పలకరించేందుకు కాస్సేపు ఆగడం.... ఇదీ వరస. ద్వారం గుండా వరుసగా త్రోసుకుంటూ లోపలకు వస్తున్న సైనికుల్ని నెట్టుకుంటూ నవంబరు మంచుతో నిండిన ఉదయకాలంలోకి బయటికి వస్తు న్నారు మరికొందరు. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువానిని దేవుని దూతల యెదుట నేనును ఒప్పుకొందును." ఆ స్వరం అనేకమార్లు తన ఆత్మలో పలకడం నిస్సందే హంగా విన్నాడు వన్యా. ముళ్ళగరిటె, స్పూను కప్పులో పెట్టి పైకిలేచి ఇతరులతో పాటు ద్వారంవైపు నడిచాడు వన్యా. ఇప్పుడు ముందు గా చేయాల్సింది ప్రార్థన కోసం స్థలం వెదకాలి.

స్టాఫ్ సార్జెంట్ స్ట్రెల్కోవ్ గారిది సన్నని పొడ వైన ముఖం. కోపం వచ్చినప్పుడు అసలే లోతుగా ఉన్న బుగ్గలు మరీ లోతుకు పోతాయి. ఇప్పటికి రెండు వారాలుగా ఈ క్రొత్త యూని ట్‌ను దారిలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. రెండు వారాలపాటు మొండి ప్రశ్నలను, అక్ర మాలను, ఆటంకాలను సహించి విసిగి పోయాడు. బూటుకు అంటిన మంచు గడ్డను అసహనంగా విదిలించాడు. క్రొత్తగా వచ్చినవాళ్ళు తగినంత త్వరగా నేర్చుకొనే రకం కాదు. చలికి కళ్ళు చిట్లించి, వరుసల్లో వణకుతూ నిలబడ్డవాళ్ళలో ఉన్న ఖాళీ స్థలాన్ని గమనించాడు. ఒక వ్యక్తి అక్కడ లేడు. ఈ గ్రౌండు అంచుల దగ్గర ఏదో చలనం. దుర్భరమైన పరుగులో ఆ వ్యక్తి వస్తుంటే విసుగ్గా కని పెట్టాడు సార్జెంట్. ఆ వచ్చే వ్యక్తి మోషియేవ్ వన్యా.

రొప్పుకుంటూ తన స్థలంలోకి చేరాడు వన్యా. ఒక్కడు కూడా

కనీసం కళ్ళు కదిపి ప్రక్కకు చూడలేదు. సార్జెంట్ కాస్తసంతోషిం చాడు. బహుశా దీనివల్ల ఓ పాఠం నేర్పించ వచ్చు.

"ఆలస్యంగా రావడానికి కారణం చెబు తావా కామ్రేడ్ ప్రైవేట్ వన్యా?" స్ట్రెల్కోవ్ నేర్పిస్తున్న క్రమశిక్షణ అతడు కనీసం ఒక్కసారి కూడా ఆలస్యం కాలేదన్న సత్యాన్ని ఋజువు చేస్తుంది.

గ్రౌండుకడ్డంగా పరుగుతీసినందువల్ల వన్యా యొక్క ఛాతి భారంగా ఎగిరి పడుతోంది. శ్వాస ను కుదుర్చుకుంటూ కఠినంగా కనిపించే సార్జెంట్ వైపు అసౌకర్యంగా చూశాడు. సార్జెంట్ యొక్క ప్రశ్న, జవాబు కోసం ఎదురు చూస్తుం డగా అందరూ నిశ్చేష్టులై నిలబడ్డారు.

"క్షమించండి, నేను ప్రార్ధన చేసుకుటున్నా ను." ఉరిమి చూశాడు సార్జెంట్. వన్యా ముఖం లోని స్థిరత్వంలో ఏ మాత్రం హాస్యం లేదు. ఆ వరుసలో ఉన్నవాడెవడో ఆకస్మికంగా దగ్గాడు. నిశ్చలంగా ఉన్న వారందరి వైపు ఒకసారి చూశాడు స్ట్రెల్కోవ్. వాళ్ళు లోపల నవ్వుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న విషయం తనకు తెలియ దనుకుంటున్నారా?

చాలాకాలంగా సైన్యంలో పనిచేయడం వల్ల అక్రమాలను ఎలా చక్కబెట్టాలో స్ట్రెల్కోవ్‌కి బాగా తెలుసు, "యూనిట్‌తో కలిసి డ్రిల్లు చేయాలి వన్యా. డ్రిల్లు పూర్తయ్యాక నీవు నన్ను కలవాలి." సముదాయాన్ని సంబోధించడానికి ఒక అడుగు వెనక్కి వేశాడు. అతని ఆనతి ప్రకారం అందరూ వేరువేరు దిక్కులకు విడిపోయి డ్రిల్లు మొదలు పెట్టారు. క్షణంలో ఎగరడం, దూకడం, కసరత్తు లతో చేతులు ఆడించడం ఇలాంటి వాటితో జీవం పోసుకుంది డ్రిల్ గ్రౌండ్. ఆలస్యంగా రావడం వల్ల కలిగిన అవమానాన్ని దేవుడిచ్చిన ఒక గొప్ప వరాన్ని నిందపాలు చేశా నన్న దోషా న్నుండి విడుదల కోసం కసరత్తు చేయడంలో లీనమైపోవాలనుకున్నాడు వన్యా. ప్రార్ధనా గదిగా ఉపయోగింపబడని ఆఫీసు గది దొరికిం దని సంతోషించడం ఎంత సులభం! ఆ గది ఊడ్చే ఆమె కూడా చెప్పింది. ఆ గది ఉదయం పది గంటల వరకు ఉపయోగింపబడదని. శుభ్రం చేయడానికి రాగానే ఐదింటికే ఆమె తలుపు తాళం తీస్తుంది. అప్పటినుంచి ప్రతి ఉదయం ఆ స్థలంలోని ప్రశాంతత అతని ఆత్మలో స్థిరపడగా హృదయం స్తుతితో పొంగిపోయింది. ఆ గదిలో ఒక తోలు కుర్చీ ఉంది. నేలపై మోకరించి కుర్చీలో మోచేతులు ఆనుకోవడానికి అనుకూలంగా ఉంది. అంతేకాక కుర్చీ వీపుభాగం పగిలిన కిటికీనుండి చాటు కలిగిస్తుంది.

కాని ఆ ఉదయం సమయాన్ని మరిచి

పోవడం! డ్రిల్లుకి ఆలస్యంగా రావడం! అదిరిపాటుగా స్ట్రెల్కోవ్ తన పేరును పిలవడం విన్నాడు.

సార్జెంట్ యొక్క నాస్తికత్వం అతనికి మూడు తరాలుగా వచ్చింది. అతని తాత ఆదిలో బాల్షెవిక్‌గా ఉండి విప్లవ సమయంలో లెనిన్ గ్రాడ్ నగరపు వీధుల్లో అరోరా నౌకలో మిడ్ షిప్‌మన్‌గా ఉండి నేవీలో పోరాడాడు. ఆ గొప్ప దేశభక్తుల యుద్ధంలో లెనిన్ గ్రాడ్ పట్టణపు ముట్టడి సందర్భంలో అతని తండ్రి ఒక ఆఫీస రుగా ఉండి ముట్టడి చివరి దినాల్లో ఆకలితోను, గాయాలతోన మరణించాడు. అతడు మరణించినపుడు అతని కమ్యూనిస్టు పార్టీ కార్డు అతని జేబులోనే ఉందట. స్ట్రెల్కోవ్ తన పర్సులో తన పార్టీ కార్డు క్రింద తండ్రి యొక్క కార్డు కూడా పట్టుకు తిరుగుతాడు.

సైన్యంలో ఇంకా ఇలాంటి అనాగరికులు మిగిలి ఉన్నారంటే అతనికి ఆ విషయం నచ్చలేదు. గ్లౌవ్స్ తొడిగిన చేతులను నలిపి, రమ్మన్నట్టు తలూపి నడక ప్రారంభించాడు.

"ఈ ప్రార్ధన విషయం ఏమిటి వన్యా? నీవు సరదాగా అనలేదుగా"
"లేదండి, నేను బాప్టిస్టు సంఘానికి చెందినవాణ్ణి."

అయితే మరీ కష్టం. బాప్టిస్టులు మొండిఘటాలు. కంసోమాల్‌లో ఉన్నప్పుడు పల్లె ప్రాంతాల్లో స్ట్రెల్కోవ్ మత విరుద్ధమైన సమాఖ్యలు జరిపే వాడు. బాప్టిస్టులు హాజరయ్యే వారు. వాళ్ళంతా సామాన్యంగా మత సంబం ధమైన ప్రశ్నలకు పెద్ద పెద్ద సమాధానాలివ్వడం వలన వారిని మెరుగుపరచడం అసాధ్యమై పోయింది.

"అవి ఇక్కడ పనికిరావు వన్యా. ప్రార్ధన, మతం ఎర్రసైన్యంలో పనికిరావు. రష్యా దేశంలో ఇంకా దైవభక్తి గలవాళ్ళు అంటూ ఉండడం, దానిలోను రష్యాదేశపు సైన్యంలో తర్ఫీదు పొందే ఒక యువకుడు అలాంటి వాడు కావడం దురదృష్టకరం. నీవు తప్పకుండ నీ ఉద్దేశాలు మార్చుకో వలసి ఉంటుంది."

జవాబు చెప్పాలో, అవసరం లేదో తెలియ కుండానే వన్యా మౌనంగా ఆఫీసరు ప్రక్కనే నడుస్తున్నాడు.

"కొంతమందితో స్నేహం చేశాక, సైన్యంలో జీవితాన్ని ఇంకాస్త అధికంగా అనుభవించాక నీ భక్తికి సంబంధించిన ఉద్దేశాలు ఎంత అర్ధ రహితమైనవో, నీచమైనవో నీవు తప్పక గ్రహి స్తావు. జార్ (Czar) (రష్యాలో విప్లవానికి ముందున్న పాలకులు) చర్చి అనే సంకెళ్ళ నుండి విడుదల పొందిన తరువాతనే రాష్యా దేశం బలపడడం జరిగింది. వ్యక్తుల విషయం కూడా అంతే." ఎంత పెద్ద కోటు వేసుకున్నా స్ట్రెల్కోవ్ వణుకు తున్నాడు. ఈ సమయంలో ఆఫీసులో కుర్చీలో ఉండవలసింది. ఒక్క క్షణం వన్యా వైపు చూశాడు. చలికి అతని చర్మం ప్రకాశంగా ఉంది.

రష్యాలో బాప్టిస్టులు అనే పదం ప్రొటెస్టెం ట్లను సూచిస్తుంది. రష్యన్ అర్థొడాక్స్ చర్చికి సంబంధించిన వారిని సంఘస్తులు (చర్చిమేన్) అని పిలుస్తారు. ప్రొటెస్టెంట్లలలో రెండు గుంపులు. ఒకటి గవర్నమెంటు వారిచే నమోదు చేయబడినది. రెండవది నమోదు చేయబడనిది. వన్యా ఈ రెండవ తరగతికి చెందినవాడు. వన్యా తన యూనిట్‌ను చేరుకోవడానికి పరుగెత్తు తుండగా చూస్తూ తన బూటుకాలుతో మంచు లో నేలను తన్నుతూ నిలబడ్డాడు స్ట్రెల్కోవ్. మోకాళ్ళ వరకు ఉండే బూట్లు వేసుకున్నా గానీ స్ట్రెల్కోవ్ పాదాలు చల్ల బడి పోతున్నాయి. దానికి తోడు ఉదయం టీ కూడా పోగొట్టుకున్నాడు. ఇప్పుడు వన్యాతో జరిగిన సంభాషణ తృప్తికర రంగ లేదు. వన్యా ప్రార్ధన చేస్తున్నానని చెప్పడం ఇతరులు కూడా విన్నారు. బహుశా, ఈ సంగతి పోలిట్ ఆఫీసరుకు తెలియజేయాలి.



"పొలిట్ రుక్" ఆఫీసులో ఎక్కువ వెలుతురు లేదు. శీతాకాలపు మసక వెలుతురు గాజు కిటికీ గుండా లోపలికి రావాలని ప్రయత్నిస్తుంది, కిటికీల దగ్గర వ్రేలాడుతున్న పచ్చని తెరల వల్ల అడ్డగించబడుతుంది. పొలిట్ ఆఫీసర్ కెప్టెన్ బోరిస్ జాలివాకో సుత్తెలాంటి మనిషి, పొట్టిగా బలంగా నిర్మించబడి గూఢమైన, బొద్దైన కను బొమలు కలిగి ఉంటాడు. అక్రమ విషయాలు పట్టించుకోవడంలో అతనికి శ్రద్ధ లేదు. కాని వన్యా క్రైస్తవ ప్రార్ధనలు చేస్తున్నాడంటే, అది ఉపేక్ష చేయరాదు. తప్పక కనిపెట్టి చూడాల్సి ందే. ఎందుచేతనంటే స్ట్రెల్కోవే అతనిని గూర్చి చెప్పే విషయాలు ఆసక్తిదాయకంగా ఉన్నాయి.

వన్యా కోసం కనిపెడుతుండగా స్ట్రెల్కోవ్‌కు ఏవో ఆలోచనలు వచ్చాయి బహుశా విషయం పట్టించుకోకుండా ఉండాల్సింది. అతనితో సంభాషించకుండా ఉంటే బావుండేది. అతడు సరియైన రీతిగా ముందుకు పోవడానికి కొంచెం సలహా ఇవ్వాలనుకున్నాడు. కాని ఒకవేళ వన్యా అతణ్ణి బుద్ధిహీనుడుగా లెక్కగట్టే ప్రమాదం ఉంది. యూనిట్‌లోని వాళ్ళు అతడు ప్రార్ధన చేస్తున్నాడని చెప్పడం విన్నారు. కాబట్టి అన లేదని చెప్పలేదు. ఎంతమంది అతని మాటలు విని ఉంటారు? వినగలిగినంత సమీపంగా ఎవరు నిలబడ్డారో గుర్తు చేసుకోవాలని ప్రయ త్నించాడు స్ట్రెల్కోవ్. టేబుల్ ఎదురుగా అటెన్షన్ లో నిలబడ్డ వన్యా వైపు బద్ధకంగా చూశాడు కెప్టెన్ జాలివాకో. అతని తలపైనున్న టోపీ సరియైన తీరులో ఉంది. గౌరవంతో సరియైన రీతిగా శెల్యూట్ చేశాడు. అతని చూపులతో వన్యా చలించకుండా ఉండడం జాలివాకోలో ఆసక్తిని రేపింది. ఈ యువకుడికి ఆత్మ విశ్వాస ముంది. అయినా తన భావంలో ఎక్కడా అహంకారం కనిపించడం లేదు.

కూర్చోమని సైగ చేశాడు జాలివాకో. "డ్రిల్లుకు లేటుగా వచ్చేవానిలా కనిపించడం లేదుగా నీవు? నీ యూనిట్‌లో మిగిలిన వాళ్ళతో సమయానికి హాజరు కాలేకపోవడానికి నీకొచ్చిన సమస్య ఏమిటి?"

"కామ్రేడ్ కెప్టెన్, నా మందబుద్ధిని క్షమిం చండి సార్. ఇకమీదట అలా జరగదు".

"నా ప్రశ్నకు జవాబు చెప్పలేదుగా, ఆలస్యం గా వచ్చినదానికి కారణం ఏమిటి?" జాలివాకో స్వరం కాస్త కాఠిన్యాన్ని పుంజుకుంది. తప్పించు కొనే పద్ధతి అతనికి గిట్టదు.

"నేను ప్రార్ధన చేసుకుంటున్నాను సార్." ఆ జవాబు వింతగా గాలిలో తేలియాడింది.

కొంచెం స్థిమితంగా ఊపిరి పీల్చుకున్నాడు స్ట్రెల్కోవ్. వన్యా విషయం రిపోర్ట్ చేయవలసిం దే. ఎంత మంచిగా కనిపించినా గాని భక్తి అనేది సోవియట్ జీవితానికి చికాకు కలిగించే విషయం అని అందరికీ తెలుసు. శ్రమజీవులను 'మతం అనే ఉద్దేశం నుండి తొలగించడమే కమ్యూనిస్టు పార్టీ యొక్క లక్ష్యం' అని లెనిన్ చెప్పనే చెప్పాడు. స్ట్రెల్కోవ్ నిటారుగా కూర్చున్నాడు.

"ఎవరికి ప్రార్ధన చేశావ్?" వేళ్ళతో బల్లపై కొట్టాడు జాలివాకో.

"దేవునికండీ, ఈ విశ్వాన్నంతటినీ సృష్టిం చిన దేవునికి. ఆయన అందరినీ ప్రేమిస్తాడు."

''దేవునికా!'' పెద్దగా మూలిగి, కళ్ళు మూసుకున్నాడు. "దేవుడనేవాడు లేదని విజ్ఞాన శాస్త్రం నిరూపించింది. మన సోవియట్ సైంటి స్టులు ఈ విషయంలో అనేక పరిశోధనలు జరిపి సైంటిఫిక్ కమ్యూనిజం యొక్క సిద్ధాంతా న్ని, అంటే దేవుడు లేడన్న విషయాన్ని అంగీకరి ంచారు. పురాతన కాలాల్లో ఆర్థిక స్తోమతులును అవగాహన చేసుకోవడానికి సామాన్య మానవు డు 'దేవుడు' అనే పదాన్ని కనిపెట్టి దానితో అన్నీ సరిపెట్టు కోవడానికి ప్రయత్నించాడు."

"అని నాస్తికుడు వాదిస్తాడండి."

"అదే సరియైన దృక్పథం. సోవియట్ జీవితంలోని అకాడమీ ఆఫ్ సైన్సెస్, కమ్యూనిస్టు ప్రభుత్వం మొదలైన గొప్ప సంస్థల అభి ప్రాయం కూడా అదే.సోవియట్ సైన్యం యొక్క ప్రాతిపదిక కూడా అదే. సోవియట్ ప్రజల ఉద్దేశం కూడా అదే."

"పొలిట్ ఆఫీసరుగారూ, మన ప్రభుత్వ ఉద్దే శం నాస్తికత్వం అని నాకు తెలుసు. కాని బైబిలు దేవుడు విశ్వాన్నంతటినీ సృష్టించిన తరువాత మానవుణ్ణి చేశాడని నేర్పిస్తున్నది. ఇది క్రైస్తవుల విశ్వాసం."

జాలివాకో తన ముందరున్న రిపోర్టు షీటు మీద వ్రాస్తున్నాడు. వ్రాయడం ఆపి అడిగాడు, "నీ దగ్గర బైబిలుందా?"

"లేదు సార్"

"సోవియట్ యూనియన్‌లో బైబిలు అంగీకరించబడదు. దాంట్లో సైన్సుతో అంగీ కరించని ఎన్నో రకాల తప్పులున్నాయి. అది

మందత్వాన్ని బానిసత్వాన్ని పెంచుతుంది. సైన్యంలో అది ఎవరి దగ్గరా ఉండరాదు. అసలు అలాంటి పుస్తకాన్ని ఎందుకు చదువుతారో అర్థం కాదు నాకు."

"అది జీవితాన్ని మార్చగలదు సార్"

"హు, వన్యా విను. మిలిటరీ వ్యక్తుల జీవితా న్ని మార్చడం మాత్రమే కాక, ఆశయాలు, జీవితాశయాల్నీ కూడా మార్చివేస్తుంది. బహుశా ఈ విషయాన్ని గ్రహించడానికి నీకు ఇంకా సహాయం కావాల్సి ఉంటుంది. నీ బైబిలు చెప్పే వాటికంటే ఇదే గొప్ప సత్యం."

"నాకు సాధ్యమైనంత మేరకు సోవియట్ సైన్యంలో సేవ చేయాలనే ఆశిస్తున్నాను సార్!"

జాలివాకోకు కోపం రాసాగింది. మత సంబంధులైనవారితో పని చేయడం చాలా కష్టం. ఈ విశ్వాసులనేవాళ్ళు చాలా మోసగాళ్ళు. పైకి చాలా మంచి పౌరులుగా, నెమ్మదిగాను, శాంతి ప్రేమించేవారుగాను, హాని చేయనివారు గాను కనిపిస్తారు. కాని ఆ సుగుణం అనే ముసుగులోనే వారి తప్పుడు బోధలను ప్రచురిస్తారు.

"నీవా మాట అనడం నాకు చాలా సంతోష ంగా ఉంది వన్యా. అంటే నీవు దేవుని గూర్చిన తప్పుడు ఉద్దేశాలు విడిచిపెట్టి సోవియట్ సైన్యంలో నిన్ను దేశం పట్ల సంపూర్ణమైన అభి మానం గల సైనికునిగా పూర్తిగా తీర్చిదిద్దడానికి ఉద్దేశించబడిన కార్యక్రమాల్లోకి పూర్తిగా ప్రవేశి స్తావని అర్థమవుతుంది. నీకునా అభివందనా లు."

స్ట్రెల్కోవ్ లోలోపల కెప్టెన్ జాలివాకోను పొగుడుకుంటూ చూశాడు. ఇలాంటి వ్యక్తులతో ఎలా మాట్లాడాలో పోలిట్ రుక్ వారికి బాగా తెలుసు. వన్యా ముఖంలో కనిపించే ఆందోళనను పట్టించుకోకుండా జాలివాకో ఇంకా మాట్లాడుతున్నాడు.

"నీవు పాల్గొనవలసిన సైనిక సంబంధమైన కార్యక్రమాల పట్లను, రాజకీయ సంబంధమైన విషయాల పట్లను, రాజకీయ పరంగా నీ ఎదుగుదల విషయంలోను నేను ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటాను."

ఏం చేస్తాడా అని అత్యాసక్తితో వన్యా ముఖంలోకి చూస్తూ జాలివాకో కుర్చీలోంచి లేచాడు. సెలవు ఇచ్చేసినా దాన్ని ఉపయోగించు కోకపోతే వాడు బుద్ధిహీనుడనుకో వాలి. కాని విశ్వాసులు మొదలు బుద్ధిహీనులు గానే కనిపిస్తారు. వన్యా యొక్క రష్యా భాష ఇంకాస్త బావుండాల్సింది. నక్కుతూ మాట్లాడు తుంటే వినడం విసుగ్గా ఉంది.

"ఒక సోవియట్ పౌరుడుగా సైన్యంలో సేవ చేయడం, చేతనైనంత మట్టుకు సోషలిజం నిర్మా ణంలో సహాయపడడం నాకు చాలా ఇష్టం. కాని నేను 'దేవుని రాజ్యము' అనే వేరొక సామ్రా జ్యానికి కూడా పౌరుణ్ణి. ఆ సామ్రాజ్యం విశ్వాసుల హృదయాల్లో ఉంది. ఆ సామ్రాజ్య చట్టాలు ప్రేమపూరితమైనవి. కాబట్టి దానివల్ల సోవియట్ సామ్రాజ్యానికి ఏ మాత్రం హాని జరగదు. ఈ సామ్రాజ్య వారసత్వాన్ని గాని, దాని రాజైన దేవుణ్ణి గాని నేను వదులుకోలేను. ఆయన క్షమ, ప్రేమలు గలతన రాజ్యాన్ని అన్ని చోట్లా, చివరికి సోవియట్ సామ్రాజ్యంలో కూడా కడుతున్నాడు."

"సోవియట్ రష్యాలో 'రాజ్యాలు, రాజులు' అనే పదాన్ని తుడిచిపెట్టేశాం వన్యా. నీ మతాసక్తిలో నీవా విషయాన్ని ఎలాగో విస్మరించి యుంటావు. సోవియట్ దేశం పట్ల భక్తి గలవారికే ఇక్కడ స్థానముంది. మరి దేనికీ స్థానం లేదు" జాలివాకో స్వరం వణకడం ప్రార ంభించింది.

స్ట్రెల్కోవ్ నిస్త్రాణుడయ్యాడు. ఇలాటి విషయాలు ఎంత తేలి కగా పరిష్కరించబడతా యో చూడాలనుకున్నాడు. ఒక సోవియట్ యు వకుడు మతం అనేదాని వల్ల ఇంత సంపూర్ణం గా పాడుచేయబడి ఉంటాడు అనేది అతనికి అద్భుతంగా తోచింది.

జాలివాకో ఇంకా మాట్లాడుతున్నాడు. "వన్యా, నీవు మంచి మాటలను అధికారుల సలహాలను నిర్లక్ష్యపెడతావని ఋజువైంది. ఆ విషయాన్ని నేను వదలలేను. నీకో పాఠం నేర్పిం చాలి. నీకు మోకాళ్ళమీద ఉండి ప్రార్థించడం ఇష్టం. కాబట్టి అదే రీతిలో నీవు చేయగల నిర్మాణాత్మకమైన పనిని నీకు శిక్షగా ఇస్తున్నాను. ఒక బకెట్, బ్రష్ తీసుకుని స్థావరంలోని డ్రిల్లు హాలును, అన్ని వరండాలను మోకాళ్ళమీద కడగాలి. రాత్రంతా పని చేయాలి. ఇలాంటి పని వల్ల, అది కూడా నీతోటివారి మధ్య చేయడం మంచి సలహాలు అంగీకరించే వాడి గా నిన్ను తయారుచేస్తుందేమో. అదే సమయంలో సోవియట్ వ్యతిరేక ఉద్దేశాలకు అంటిపెట్టుకుని ఉండాలా, వద్దా అని నీవాలోచించుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. ఇక వెళ్ళొచ్చు."

స్ట్రెల్కోవ్ చురుగ్గా కుర్చీలోంచి లేచి కెప్టెన్ జాలివాకోకు సెల్యూట్ చేసి అటెన్షన్‌లో నిల బడ్డాడు. చివరికి సంగతి తృప్తికరంగా తేలింది. వన్యా సెల్యూట్ చేసి గదిని విడిచిపోతుండగా ఇద్దరి మధ్య ఏదో సద్భావం క్షణంపాటు గోచ రించింది. ఇలాంటి నీచమైన పని చేశాక మోకాళ్ళనేవి దేనికోసమో నేర్చుకుంటాడు వన్యా.

మంచుమయమైన ఆకాశంలో డిశెంబరు సూర్యుడు సగం దూరమైనా ఎక్కకముందే యూనిట్‌లో ఓ విశ్వాసి ఉన్నాడన్న వార్త అందరికీ వ్యాపించింది. ఒకరి నుండి ఒకరికి ఆ కథ వ్యాపిస్తుంటే చిరునవ్వులు నవ్వుతున్నారు. మొదటి కథ ముగియకముందే విశాలమైన స్థావరపు హాలును చిన్న చేతి బ్రష్, బకెట్‌తో పొలిట్ రుక్‌వారు కడగమన్నారన్న రెండవ వార్త వ్యాపించింది. వింతైన సంగతి ఏమిటంటే పదే పదే రకరకాలుగా ప్రశ్నించడానికి ఆఫీసర్లు తమ ఆఫీసులలోనికి పిలుస్తూ తన పనిని ఆటంక పరచినా గాని పనిచేస్తున్నప్పుడు అతడు చిరు నవ్వుతో పా టలు పాడుకుంటూ, ఆనందంగా కనిపించాడు. మధ్యాహ్న భోజన సమయానికి భోజనాల గదికి పోతూ ఆ హాల్లోంచి వెళ్తున్న సైనికులంతా బాహ్యమైన ఆనందంతో అతడు పాడే మెల్లని పాటలు వింటూ అతని పనిని గమనించారు. అతని సంగతి ఒక వింతగా ఉండిపోయింది. ●

**ఇంకావుంది**

# ఆయన యొద్ద క్షమాపణ దొరుకును

డా॥ మత్తి నిర్మలానంద్



కీర్తన 130, యాత్రకీర్తనలలో ఒకటి. 120 వ కీర్తన నుండి 134వ కీర్తన వరకు యాత్ర కీర్తనలే. ఇశ్రాయేలీయులు ప్రతి సంవత్సరము వర్ణశాలల పండుగ ఆచరించడానికి వెళ్ళాలి గనుక దారిలో ఇవి పాడుకుంటూ వెళ్ళేవారని బైబిలు పండితులు చెబుతున్నారు. అందువలన వీటికి యాత్రకీర్తనలు అని అంటారు.

ధ్యానము : 130వ కీర్తనను మనము పరిశీ లిస్తే మూడు పదాలు చూడవచ్చును.

130:4 నీ యొద్ద క్షమాపణ దొరుకును

130:7 ఆయన యొద్ద సంపూర్ణ విమోచన దొరుకును

130:7 యెహోవా యొద్ద కృప దొరుకును

మత్తయి 7:7 తో అడుగుడి ఇవ్వబడును వెదకుడి దొరుకును తట్టుడి తీయబడును అని ఉంది.

అనగా వెదకువానికి దొరుకుతుంది – క్షమాపణ, సంపూర్ణ, విమోచన మరియు కృప ఈ పదాలు క్రైస్తవులకు సుపరిచితమే ఉదాహరణకు :

1. మనము విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడితిమి మన ప్రభువైన యేసు క్రీస్తు కృప ఎరుగుదురు కదా (ఎఫెసి 2:8,2 కొరింథీ 8:9)

2. పాపములను చెప్పుకొనిన యెడల ఆయన క్షమించును (యోహాను 1:9)

3. ప్రకటన 1:6 మనలను ప్రేమించుచుతన రక్తము వలన మన పాపముల నుండి మనలను విడిపించిన వానికి పాప క్షమాపణ, కృప, విమోచన అనే పదాలు క్రైస్తవ సాహిత్యములో తరచుగా చదివే పదాలు.

ఈ పదాలను కొద్దిగా ధ్యానం చేద్దాం. 1. క్షమాపణ : క్షమాపణ అనగా మనకు ఎవరైన కీడు చేసిన, మనలను విసిగించినా, మనస్సు కష్టపెట్టినా వారి మీద కొపమును ఆపుకోవడమే అని డిక్షనరీలో అర్థం ఉంది, రెండోది తప్పు క్షమించడం అని ఉంది. ఈ అర్థాలు వాక్యపు వెలుగులో చూస్తే సరియైనవే అనిపిస్తుంది.

లూకా 15వ అధ్యాయములో తప్పిపోయిన కుమారుణ్ణి తండ్రి క్షమించడం చూస్తాం. మన లను కూడా తప్పిపోయిన గొఱ్ఱెలవలె ఉన్న వారిని యేసుప్రభువే క్షమించాడు అని మనము గ్రహించగలం.

లూకా 7:36–50 పాపాత్ము రాలైన స్త్రీ ప్రభువును ఎక్కువగా ప్రేమించింది గనుక ఆమె విస్తార పాపములు క్షమించబడినని. అలాగే అప్పు తీసి కొనిన ఋణస్థులలో ఎక్కువ అప్పు క్షమించబడిన వాడే ఎక్కువ ప్రేమించును అని చూస్తాం.

అపొ.కార్య 26:18 నాయందలి విశ్వాసము చేత పాప క్షమాపణ... పొందునట్లు వారి కన్నులు తెరచుటకై సంఘమును హింసిం చిన పౌలును దయస్సులో సంధించి క్షమించి దేవుడు వాడు కొనుటకు ఇష్టపడ్డాడని మనము ఇక్కడ చూస్తాం. మనము దేవున్ని ఎన్నిసార్లు విసిగించాం! ఎన్నిసార్లు ఆయనను ఎరగమన్నట్లు ప్రవ ర్తించాం. ఆయన మనలను సృష్టించి, పోషించి, సంరక్షించి, రక్షించి నందుకు ఆయనకు ఎంత ఋణపడిఉంటాం? ఈ 130వ కీర్తనలోనే 3వ వచనములు "నీవు దోషములను కనిపెట్టి చూచిన యెడల ప్రభువా! ఎవడు నిలువగలడు" అని ఉంది గదా! నిజమే ఎవరూ నిలువలేరు. అందుకనే ఆయన యొద్ద క్షమాపణ దొరుకుతుంది. అప్పుడు ఆయన యందు మనము భయభక్తులు నిలుపుదుము. (130:4)

అసలు క్షమాపణ ఎందుకు కావాలి? ఎంత పాపినైనా యేసుక్రీస్తు క్షమిస్తాడా అంటే అవుననే జవాబు. దావీదు జీవితంలో కీర్తన 51 పరిశీ లిస్తే ఈలాగు ఉంటుంది.

51:3 నా పాపమెల్లపుడు నా యెదుట ఉన్నది.

51:8 నీవు విరచిన యెముకలు

51:10,12 స్థిరమైన మనస్సు, సమ్మతి గల మనస్సు

51:14 రక్తా పరాధము నుండి తప్పించుము

51:12 రక్షణానందము మరల పుట్టించుము.

దీనిని బట్టి చూస్తే బెత్సెబాతో పాపము చేసి నపుడు అతడు వ్యభిచరించాడు, నరహత్య చేయించాడు. అందువలన ఇంతకు ముందు దేవుని ఔన్నత్యాన్ని పచ్చిక బయళ్ళు, శాంతికర మైన జలములు, జీవము గల దేవునిని గూర్చిన పౌరుషము (గొల్యాతును చంపినపుడు) దేవుని యెదుట తగ్గింపు (నా కుటుంబము ఏ పాటిది అని అన్నపుడు) తన కన్నులకు ముందు ఉండేవి కాని ఇపుడు పాపము తన యెదుట ఉంది. యెముకలలో స్వస్థత లేదు. స్థిరమైన, నమ్మతగల మనసు లేదు. ఉరియాను చంపించ మని లేఖ వ్రాసిన చేతులు రక్తా పరాధముతో నిండినది. రక్షణా నందము పోగొట్టుకున్నాడు. పాపి రక్షింపబడుట ఒక యెత్తు, రక్షణానందం పోగొట్టు కొనుట మరియొక యెత్తు.

పాపం చేసినపుడు నెమ్మది ఉండదు. రక్షణ నందం ఉండదు. శరీరములో కూడ స్వస్థత ఉండదు. అందుకనే దావీదు వేరొక చోట ఈలాగు ప్రార్థన చేస్తాడు. కీర్తన 25:7 నా బాల్య పాపములను, అతి క్రమములను జ్ఞాపకము చేసికొనకుము

25:11 నా పాపము బహు ఘోరమైనది... క్షమించుము.

25:17 నా హృదయవేదనలు ఇక్కట్లను ... విడిపింపుము

25:18 నా పాపములన్నియు క్షమంచుము

25:20 నా ప్రాణమును కాపాడుము, నన్ను రక్షించుము. దావీదు ఈలాగు క్షమాపణ కనికరము పొందినవాడై యెహోవాకు ఇష్టుడైనాడు.

యేసుక్రీస్తే ఎందుకు క్షమించాలి?

హెబ్రీ 9:22 రక్తము చిందించకుండ క్షమాపణ లేదు. హెబ్రీ 2:14–15 ఆయన మన కోసం రక్త మాంసములు కలవాడాయెను. హెబ్రీ 10:4 ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము. ఏ మనుష్యుడు పాపములను క్షమించలేదు. అందరూ పాపము చేసినవారే. అందుకనే యోబు ఈలాగంటాడు.

యోబు 14:4 పాప సహితునిలో నుండి పాపరహితుడు పుట్టిన యెంతమేలు. ఆలాగు న్వెకడు పుట్టడు. అందుకనే హెబ్రీ 7:26 యేసుక్రీస్తు పవిత్రుడును నిర్దోషియు నిష్కల్మషుడును పాపులతో చేరని వాడు

హెబ్రీ 9:2 అందుచేత తన స్వరక్తతో ఒక్క సారే పాపనివారణ చేయుటకు ప్రత్యక్ష పరచ బడెను ఈయనకు తప్ప పాపములను క్షమించు టకు అధికారము లేదు (లూకా 2:11,21)

ముగింపు : 1 కొరింథీ 15:3–4 ఆయన లేఖనముల ప్రకారము చనిపోయి, సమాధి చేయ బడి తిరిగి లేచుట ద్వారా పాపమును సిలువకు మేకులతో కొట్టి మన పాప ఋణ మును తీర్చేయోగ్యుడైనడు. రోమా 10:10 ప్రకారం నోటితో ఒప్పుకొని హృదయములో విశ్వసిస్తే 1:7–9 ప్రకరము మనకు పాప క్షమా పణ కలుగుతుంది. ఆయన క్షమించుటకు సిద్ధ మైన మనసు కలవాడు (కీర్తన అపుడు మనకు శరీర స్వస్థత (యెష 53:5) ఆత్మ శుద్ధి హెబ్రి 9:14 కలుగుతుంది.

అట్లు చేయుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక! విమోచన, కృప, వచ్చే సంచికలో చూద్దాం. ●

# దేవునిని స్తుతించుట

**రెవ. వాల్టర్ ఫీలి**



ప్రియమైన దేవుని బిడ్డలారా ప్రభువును ఎరిగిన ప్రతి ఒక్కరూ కూడా దేవుడిచ్చిన రక్షణను బట్టి స్తుతించటమే కాకుండా దేవుడు మనపట్ల అద్భుతాలు, ఆశ్చర్యకార్యాలు చేయువాడుగనుక ఆయనను మనము స్తుతించవలసిన వారమైయున్నాం. 136వ కీర్తన 4వ వచనంలో "ఆయన ఒక్కడే మహాశ్చర్యకార్యములు చేయువాడు". కనుక మన దేవుడు ఆయన నమ్మినటువంటి మనము, ఆయన యందు విశ్వాసముంచినటువంటి మనము దేవుని కార్యాలు పొందుకుని ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించటమేకాక ఎలుగెత్తి ఆయన నామమును ఘనపరచవల సిన వారమైయున్నాము. కీర్తన107:8 "ఆయన కృపను బట్టియు నరు లకు ఆయన చేయు ఆశ్చర్యకార్యములను బట్టియు వారు యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురుగాక." దేవుని బిడ్డలారా దేవుని కృప ప్రతి ఒక్కరి మీద ఉంటుందని మనవి చేస్తున్నాను. దేవుడు మా కుటుంబాన్ని జ్ఞాపకము చేసికొనుటలేదు ఇటువంటి ఆలోచనలు ఒకవేళ ఏమైనావుంటే ఈ దినమున ఆ ఆలోచననుండి బయటకు రావలసిందిగా ప్రభువు పేరట మనవి చేస్తున్నాను. ఆయన చేయు ఆశ్చర్యకార్యములన్నియు కూడా ఆయన కృప మీద ఆదారపడివుంటాయి. అందుకే 107వ కీర్తన 8వ వచనము, 15వ వచనము, 21వ వచనము, 31వ వచనములో ఒకేమాట మాటిమాటికి వ్రాయబడియున్నది. " ఆయన కృపనుబట్టి యు నరులకు ఆయనచేయు ఆశ్చర్యకార్యము లను బట్టియు వారు యెహోవాకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుదురు గాక" ఈ కృతాజ్ఞతాస్తుతులు చెల్లిం చేవారు ఎవరైతే దేవుని కృపను పొందుకున్నా రో, ఎవరైతే దేవునివలన మేలుపొందుకున్నారో, ఎవరి జీవితాలలో ఆశ్చర్యకార్యములు, అద్భుత కార్యములు జరిగించాడో వారు ఏమని చెప్తారంటే 107వ కీర్తన మొదటి వచనము ''యెహోవా దయాళుడు ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి ఆయన కృప నిత్యముండు ను". ఈ దినాలలో అనేకమంది దేవుడు మాకు మేలు చేయటంలేదు మేము ఎంత ప్రార్థన చేసినా, ఎంత భక్తిగా ఉన్న, గుడికి వెళ్తున్న, చందాలిస్తున్న, దేవుని కొరకు నమ్మకమైన పాత్రలుగా సంఘములో మేము వాడబడు తున్న అనేకమందికి మేలులు జరుగుతు న్నాయి. సంఘములో నిలబడి సాక్ష్యమిస్తు న్నారు దేవుడు మా బిడ్డల వివాహం చేసాడు అని సాక్ష్య మిస్తున్నారు, దేవుడు మా కుమారు డికి ఉద్యోగమిచ్చాడని సాక్ష్యం చెప్తున్నారు. మేము ఇల్లు కట్టుకున్నామని స్థలం కొనుక్కున్నా మని సాక్ష్య మిస్తున్నారు. ఇన్ని సంవత్సరాలుగా నేను దేవుని నమ్ముకున్నానే దేవుడు నాకు ఏమీ చేయలేదు నాకూ చేస్తే నేను కూడా దేవుని స్తుతిస్తాను, నాకూ చేస్తే నేను కూడా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తాను అనే భావము అనేకమందిలో ఉన్నట్టుగా గమనిస్తున్నాం. ప్రియమైన దేవుని బిడ్డలారా ఇక్కడ చెప్పబడిన మాట యెహోవా దయాళుడు ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన కృప నిత్యముండును అని చెప్పబడిన వారు ఒకప్పుడు మనలాగా కష్టాల్లో ఉన్నవారే, శ్రమల్లో ఉన్నవారే, బాధల్లో ఉన్నవారే, దుఃఖములో ఉన్నవారే అయితే వారు నిరాశ చెందలేదు. సంఘములో నమ్మకమైన పాత్రగ ఉం టున్న నీవే దిగులు పడుతూ, బాధపడుతూ దేవుడు నాకు ఏమీ చేయలేదు అనే నిరాశతో నీవు జీవిస్తున్నావంటే సాతాను యొక్క బాణాలకు నీవు లోనవుతున్నావని మనవి చేస్తున్నాను. ఎందుకంటే సాతాను దగ్గర రెండు బాణాలు ఉన్నాయి. మొదటి బాణం పేరు దురాశ. అది దేవుని ఎరిగిన బిడ్డలైనా, దేవుని ఎరగని బిడ్డలైనా దురాశ ద్వారా వానిని పడవేయటానికి అవకాశవుంది. అయితే విశ్వాసులైన వారిని ప్రార్థనలో ఎదుగుతున్న వారిని దురాశతో పడవేయలేడుగనుక నిరాశ అనే బాణం వేస్తాడు. అందుకే నా జీవితం ఇలా అయిపోయింది. ఇంక దేవుడు నాకు మేలు చేయడు, నా జీవితమింతే, నా బ్రతుకింతే, ఇలాగే నా బ్రతుకు అంతము కావలసింది నిరాశ లోనే పుట్టాను నిరాశలోనే పెరిగాను చివరకు నిరాశతోనే చనిపోతాను అనే దిగులు మనలను వెంటాడుతున్నది. అందుకే ప్రభువు పేరట మీకు మనవి చేస్తున్నాను భక్తులు ఏరీతిగ శ్రమలలో ప్రయాణమైనప్పుడు, శ్రమల ద్వారా వారు ముందుకు సాగగలిగినప్పుడు నిలబడగలిగారు. ఉదాహరణ దైవగ్రంథములో నుండి యోబును మీకు పరిచయం చేయాలని ఆశ పడుతున్నాను. యోబు ఎటువంటి వాడంటే యథార్థవర్తనుడును న్యాయవంతుడునై దేవుని యందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు, భూమిమీద అతనివంటి వాడెవడును లేడు అని సాక్ష్యము పొందిన వాడు. అటువంటి పాపము లేనివాడు, నోటిమాటతో కూడ పాపము చేయనివాడు, భయభక్తులు కలిగినవాడు తమపిల్లలు ఎక్కడ పాపము చేసారేమో అనుకుని అరుణోదయ మనే లేచి బలులు అర్పించేవాడు ఇంత భక్తి కలిగినటువంటి వాడికి శ్రమవచ్చింది. మరి యోబు మనవలె ఆయాసపడలేదు,దుఃఖపడలేదు, దేవునియందు విశ్వాసముంచినవాడు ఏ మాత్రము కూడా దిగులు పడకుండా దేవుని వైపు చూస్తున్నాడు.బిడ్డలను పోగొట్టుకున్నప్పుడు, సమస్తాన్ని పోగొట్టుకున్నప్పుడు, ఆస్తిని పోగొట్టుకున్న ప్పుడు ఒక చక్కనిమాట పలికినట్లుగా దైవ గ్రంథంలో చూస్తున్నాం. యోబు గ్రంథము 1వ అధ్యాయము 21వ వచనములో "నేను నా తల్లి గర్భములో నుండి దిగంబరినై అక్కడికి తిరిగి వెళ్లెదను, యెహోవా ఇచ్చెను యెహోవా తీసుకొనిపోయెను, యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక" ఈ దినాన ఒక కష్టమును బట్టి, ఒక వ్యాధినిబట్టి, ఒక బాధను బట్టి దేవుడు నాకే చేయాలా, నా కుటుంబానికే చేయాలా, నా కుంటుబమే దొరికిందా అని దేవుని మీద ఆయాసపడుతున్ననీవు దేవుని స్తుతించలేక పోతున్నావు. దేవుని స్తుతించుడి అన్న పాట పాడుతున్నావు. కానీ నీ జీవితంలో కలిగిన సమస్యలు, శోధనలుబట్టి స్తుతించలేకపోతున్నావు. ఆస్తిని పోగొట్టుకున్న యోబు భక్తుడు, బిడ్డలను పోగొట్టుకున్న యోబు భక్తుడు దేవునికి స్తుతి చెల్లించాడు తప్ప ఏమాత్రం దేవునిమీద ఆయాసపడలేదు. ఒకవేళ నీకొచ్చే శ్రమ దేవుడు నిన్ను పరీక్షలు పెడుతున్నాడేమో,

సాతాను దగ్గర నీ గొప్పతనమును గూర్చి ఆయన హెచ్చుగా చెప్పాలని ఉద్దేశము కలిగి ఉన్నాడు నువ్వు అర్థం చేసుకోలేక పోతున్నావు. తనను నమ్మిన బిడ్డలను ఎన్నడు చెయ్యి విడిచి పెట్టేవాడుకాడు. నీ బిడ్డల భవిష్యత్తును నువ్వెలా కోరుకొని వారిని సన్మార్గంలో పెట్టాలని, ప్రయోజకులు కావాలని ఏ రీతిగా తిడుతుంటావో, కొడుతుంటావో ప్రభువు కూడా చిన్న చిన్న పరీక్షలు పెట్టి, శోధనలు పెట్టి నిన్ను బలపరచి తనయొక్క సాక్షిగా నిలబెట్టుకునే దేవుడు. ఎందుకంటే యోబును ఆయన పరిశీలించాడు, పరిశోధించాడే తప్ప నాశనానికి అప్పగించ లేదు. ఆరోగ్యముపోయింది, మరి భార్య దూషించి చనిపోమని సలహాయిచ్చింది, బిడ్డలు పోయారు, బంధువులందరూ దూర మైపోయారు, వచ్చిన స్నేహితులందరూ నింద లువేస్తున్నారు. అయినప్పటికీ కూడా దేవుణ్ని ఘనపరుస్తున్నాడు, దేవుణ్ని స్తుతిస్తున్నాడు ఈ దినాన నీకొచ్చిన కష్టములో దేవునియందు ఆనందించగలిగే విశ్వాస అనుభవము కలిగి వున్నావా లేదా వారికి మేలులు చేస్తున్నాడు. దేవుడు మాకు మేలులు చేయటం లేదు మేము చేసుకున్న పాపమేమిటో, మా జీవితాలతో దేవుడు ఎందుకు ఆడుకుంటున్నాడో మా ఇంటికే మరణం రావాలా, మా ఇంటికే కష్టం రావాలా, నా బిడ్డల జీవితమే నాశనం అవ్వాలా, నా కొడుకే ఎందుకు పనికిరాని వాడై నిష్ప్రయోజకుడు అవ్వాలా దేవుడికి ఎక్కడవుంది న్యాయం అని దేవుడిమీద ఆయాసపడుతున్నావేమో. దేవునిమీద మనము మనస్సు పెట్టిన వారమైవుండాలి. ఏది చేసినా అది మన మంచికే చేస్తాడు. కనుక ఇశ్రాయేలీయులందరు కూడా దేవునిమీద ఆధారపడినంత కాలము దీవెన పొందినట్లుగా దైవగ్రంథంలో చూస్తున్నాం. భక్తుడైన దావీదు చెప్తున్నాడు కష్టకాలములో ఉన్నవారు శ్రమకాలములో ఉన్నవారు దేవునికి మొర్రపెట్టారట, దేవునికి ప్రార్థన చేసారట కనుక వారి కష్టాలన్నిటిలో నుండి విడిపించాడు, వారి శ్రమలన్నిటిలో నుండి విడిపించాడు కనుక ఆయన కృపను బట్టి నరులకు ఆయన చేయు ఆశ్చర్యకార్యములను బట్టి వారు యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించారని దైవగ్రంథంలో చూస్తున్నాము. నీ కొచ్చిన కష్టమును బట్టి ప్రభువు సన్నిధిలో ఆనందించగలుగుతున్నావా, దైవగ్రంథంలో ఒక చక్కని మాట ఉన్నది నా నిమిత్తము జనులు మిమ్ములను నిందించి హింసించి అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలికినప్పుడు మీరుధన్యులు. సంతోషించి గంతులు వేయమన్నాడు. దిగులు పడమనలేదు వేదన చెందమనలేదు, బాధపడమనలేదు, ఆయాసపడమనలేదుగాని దేవుడు నీపట్ల దాచివుంచిన మేలు అనుభవించే ముందు నీవు శ్రమపడవలసివుంది. కష్టేఫలే అని చెప్పినరీతిగా ఎంత శ్రమపడతావో ఎన్ని నిందలు అనుభవిస్తావో అన్ని నిందలకు తగిన ప్రతి ఫలాన్ని దేవుడు నీ కనుగ్రహిస్తాడు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో పెట్టి చాకిరి చేసారు. నాలుగువందల ఏండ్లు వారు నలిగిపోయారు. కానీ వట్టి చేతులతో వారు తిరిగిరాలేదు. దేవుడు వారిని ఆశీర్వదించాడు. వారి కష్టానికి తగిన ప్రతిఫలమిచ్చినట్లుగా దైవగ్రంథంలో మనము చూస్తున్నాం. కనుక యోబును బట్టి మనము నేర్చుకోవలసినది ఎంతో వుందలి యోబుకు ఎటువంటి మరణాపాయములు వచ్చిన, వ్యాధి బాధలు వచ్చిన, కుమారులు దూరమైపోయిన తన భక్తిని విడిచిపెట్టలేదు. భక్తిలో నిలబడ్డాడు, దేవుణ్ని స్తుతించాడు యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక అని చెప్పినట్లుగా దైవగ్రంథంలో మనము చూస్తున్నాం. దేవుడు చేసిన మేళ్లను బట్టి కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసిన వారమై యున్నాం. మొదటిగా యోబును చూసాము మరి యోబు తన కష్టములో దేవునిని స్తుతిస్తున్నాడు. అలాగే దానియేలు కూడా తన కష్ట పరిస్థితులలో దేవునిని స్తుతిస్తూ వస్తున్నాడు. కానీ నేటి విశ్వాసులెలావున్నారు. దేవుడు చేసిన మేళ్లను మరచిపోయి, దేవుడు చేసిన అద్భుతాలు మరిచిపోయి, దేవుడిచ్చిన రక్షణను మరచిపోయి దేవునికి దూరమైపోయి దేవునియొద్ద ఏ మేలు పొందని వారిగా ఈ లోకంలో జీవిస్తున్నారు. మనందరికి తెలుసు యాకోబు పారిపోతున్న సమయంలో దేవుడు అతనికి దర్శనమిచ్చాడు, అతనితో మాట్లాడాడు, అతనికి తోడైవుంటానన్నాడు. నీవు వెళ్లు స్థలములో నీకు తోడైయుండి మరలా క్షేమముగా తీసుకు వస్తానన్నాడు. కానీ మేలు పొందినటువంటి యాకోబు, ఆశీర్వదించబడినటువంటి యాకోబు 20 సం॥లు దేవుణ్ని మరచిపోయాడు తన యొక్క భార్య నిమిత్తము 14 సం॥లు, తనయొక్క సంపాదన నిమిత్తము 6 సం॥లు దేవునికి దూరమైపోయాడు. ప్రియమైనటువంటి దేవుని బిడ్డ నీవు ప్రార్థనకు దూరమైపోయినా, విశ్వాసమునకు



దూరమైపోయినా, మొదటి భక్తి నువ్వు పోగొట్టుకున్నా నిన్ను, నన్ను ప్రేమించి దేవుడు మనలను విడిచిపెట్టేవాడు కాడని మనవి చేస్తున్నాను. దేవునిని స్తుతించక పోయినా, దేవునికి బలిపీఠం కట్టకపోయినా, దేవుని నామమున ప్రార్థన చేయకపోయినా దేవుడు యాకోబును తిరిగి బేతేలుకు రమ్మని పిలుస్తున్నరీతిగా ఇదిగో వేలు పొంది దూరమైపోయిన నీవు, మేలులేదని దూరమై పోతున్న నీతో దేవుడు మాట్లాడు తున్నాడు తిరిగి ప్రార్థనలో బలపడు, విశ్వాసంలో బలపడు నమ్మకమైన జీవితం జీవించటానికి నువ్వు ఇష్టపడవలసిందిగా ప్రభువు పేరట మనవి చేస్తున్నాను. ఈ దినాలలో నమ్మకస్తులు లేరు, యథార్థవంతులు లేరు. అటువంటి వారి కొరకు దేవుడు ఎదురుచూస్తున్నాడు. కాబట్టి నీ కష్టాలు కలకాల ముండేవికావు. లోకంలో వున్న ప్రతి శోధనలు ప్రతి విశ్వాసి అనుభవిస్తూనే వున్నాడు. కష్టాలవెనుక ఆశీర్వాదం వుంది, దీవెనవుంది. మిక్కుటమైన ఆయాసము నెమ్మది కలుగుటకు కారణమాయెనవి నువ్వు చెప్పే దినాలు వున్నాయి. కనుక విశ్వాసంలో బలహీనురాలవు కావద్దు. ప్రార్థనలో బలహీనురాలవు, బలహీనుడవు కావద్దు. తిరిగి నీ సడలిన మోకాళ్లను బలపరచుకో, ప్రభువులో ఎదుగు ప్రభువును స్తుతించు. అనేక దెబ్బలను సహించిన పౌలు సీలలు వారు బాధపడలేదు, దుఃఖపడలేదు. అర్థరాత్రివేళ పాటలు పాడుతూ దేవుణ్ని స్తుతిస్తు న్నారు. అద్భుతాలు జరిగాయి. నీ కష్టాలలో, నీ వ్యాధుల్లో, నీ బాధల్లో, నీ దుఃఖములో, అందరు విడిచి పెట్టిన పరిస్థితిల్లో నీతో ప్రభువు వున్నాడు గనుక స్తుతించు ప్రభువు నీకు తప్పక సహాయం చేస్తాడు. ఒకదినాన దేవుడు చేసిన ఉపకారములను బట్టి ఎలుగెత్తి సాక్ష్యమివ్వగలవు. పాఠకులకు దేవుడు దీవించు గాక! ●

# సామాన్యుడి గోడు -1

స్వాప్నిక రాజ్ఞి

**అ**దేంటో, ఈ మధ్యకాలంలో చర్చీలు కడుతున్నాం చందాలివ్వండో అంటూ వచ్చే బాపతు బాగా ఎక్కువైపోయారు.

వీళ్ళకు ఎవరి దగ్గరకు వెళ్ళాలి. ఎవర్ని అడగాలి అనే విషయంలో ఓ నియమం అంటూ ఏదీ ఉండదు గాక ఉండదు. ప్రహరీ గోడ మీద యింటి వాకిలి ప్రక్కనో ఓ క్రిస్టియన్ నేమ్ బోర్డు కనబడితే చాలు, లేదూ ఆ యింట్లో వాళ్ళు క్రైస్తవులని చూఛాయగా అనుమానం పొడచూపినా చాలు, ఇంకేం? ఎంచక్కా దూరిపోతారు.

ఇలాంటి వారికి ఒక టైమూ పాడూ ఏది ఉండదు. కొందరైతే తెల్లారిందే ఆలస్యం దిగబడి పోతారు. అవతలి వాళ్ళు దినచర్యల్లో ఉంటారని ఉద్యోగాలకు వెళ్ళేవాళ్ళు హడావిడిగా ఉంటారని వంటగదిలో ఆడవాళ్ళు పనిలో హైరానా పడిపోతుంటారని వీళ్ళకు పట్టదు. ఏం చేద్దాం? పైగా దేవుడి పని కదా! అనే దబాయింపొకటి.

పాపం! వాళ్ళ తొందర వాళ్ళది లెండి. వాళ్ళను మాత్రం ఏమనగలం?! తెల్లారి తెల్లారక ముందే వెళ్తేగాని కొన్ని శాల్తీలు దొరకరు, లేదంటే ఏ రాత్రివేళో రావాల్సి ఉంటుంది. ఎవరి త్రొక్కులాట వాళ్ళది. మరి!

ఈ రకం వచ్చే పెద్ద మనుషులు సాధారణంగా రశీదు పుస్తకంతో పాటు సదరు నిర్మాణం తాలూకూ ఫోటోలు తేవడం కూడా పరిపాటి. ఆ చర్చి మందిరం ఎక్కడ కడుతున్నారో? ఆ ఫోటో వాస్తవికత ఎంతో? ఏ ఊర్లో కడుతున్నారో? విచారించే వ్యవధి మనకుండదు అలా మన మిచ్చే కొద్దిపాటి దానికి ఆ ఎంక్వయిరీ, గూఢచర్యం ఎక్కడ చేసి ఛస్తాం?! అనుకోవడం కూడా కద్దు.

ఇక వీరి చర్చికి ఎవడైనా కొత్త విశ్వాసి వెళితే ఆరోజు ప్రసంగం అంతా విరాళాలు, రశీదు పుస్తకాలు, చర్చి నిర్మాణం. ఇది ప్రసంగం. అరిచి అరిచి గగ్గోలు పెట్టడమే. తీరా చూస్తే ముందు ఇల్లు, ఆ తరువాతే చర్చి సంగతి. ఇదీ అసలు సంగతి. ఈ పరిస్థితిని విశ్వాసులు చెవులు కొర్కుని పెదవి విరిచి కోవడం తప్ప ప్రశ్నించలేని దుస్థితి. ఇక్కడ విశ్వాసుల భక్తి విశ్వాసం గొప్పది.

గోపురము కట్టేవాడు ఆ మేరకు పైకం, సామగ్రి తన వద్ద ఉన్నదో లేదో కూర్చుని చేరీజు వేసుకుని పని ప్రారంభిస్తాడు. లేకుంటే పని మధ్యలో నిలిచి పోతుంది అదెంత అవమానం! అంటూ యేసుప్రభువుల వారు ఓ పర్యాయం ఒక సందర్భంలో నిస్పష్టంగా హెచ్చరిస్తారు.

చోద్యం ఏమంటే ప్రభువు వారు స్వయంగా చేసిన హెచ్చరిక వీరికి ఎందుకో వినబడదు. వినబడ్డా విశ్వాసం మీద ఆధారపడి ముందుకు సాగాలనే కొటేషన్స్ బైబిల్‌లో నుండే చూపించే ప్రమాదం ఉంది. అవన్నీ వీరికి కరతాళ మలకం.

అంతే కాదండి. తెలియని వాళ్ళ దగ్గర కూడా వెళ్ళి మీ వద్దకు వెళ్ళమంటూ దేవుడే ప్రేరేపించాడని అంటారే గాని, ఆ రికార్డు అన్ని చోట్లా వేసేదే!

నిజంగా మందిరం కట్టుకోవడానికి అవస్థ పడుతున్నప్పుడు అలాంటి వాళ్ళకు సాయపడటంలో తప్పులేదు. ఎటొచ్చీ సమస్య అంతా సందట్లో సడేమియాలతోనే సుమా! అంచేత వచ్చారు కదాని జేబులు ఖాళీ చేసుకోకుండా రవ్వంత విచారించి ఇవ్వడం మంచిది. ఇటు ఇచ్చే వాళ్ళకూ, వేళాపాళా లేకుండా ముక్కు ముఖం తెలియకుండా దూరిపోయి ఇబ్బంది పెట్ట డాన్ని మానుకోవడం అటు పుచ్చుకునే వాళ్ళకూ శ్రేయస్కరం. అపుడే సడేమియాలకు అడ్డుకట్ట వేయొచ్చు ఏమంటారు?!



# ఏలియా

బి.పి. కరుణాకర్

**మ**ధ్యాహ్నం భోజనాలయ్యాక లెక్కల క్లాసు మొదలు కావలసి ఉంది. మాస్టారింకా రాలేదు.

మా స్కూలు ఫయినలు 'ఎ' సెక్షను హెడ్మా స్టరు గారి గది పక్కనే ఉండటాన క్లాసులో మాస్టార్లు లేకపోయినా క్లాసు నిశ్శబ్దంగానే ఉంటుంది. అవతలి క్లాసులంత గొడవగా ఉండదు. బెంచి లో నా పక్కనే కూర్చునే ఏలియా టిఫిను బాక్సు కదుక్కున్న తర్వాత నా కూడా రాలేదు. ఏ మాస్టారయినా ఏ పనయినా చెప్పారేమో?

ఏలియా నేను ఒక వయసు వాళ్లం. గత నాలుగు సంవత్సరాల నుండి స్నేహితులం. ఒకే పేటలో ఉంటుంటాం. మేము ఉండే వీధికి రెండు వీధుల అవతల ఏలియా వాళ్లు ఉంటు న్నారు. స్కూలుకు ఇద్దరం కలిసే వెళ్తాం. కలిసే తిరిగి వస్తుంటాం. స్కూల్లో కూడా కలిసే తిరు గుతుంటాం. నేను నల్లగా, సన్నగా ఉంటాను. ఏలియా ఎర్రగా నాకన్నా పొడుగ్గా లావుగా ఉంటాడు. నేను సన్నగా ఉంటానని ఏ ఆటలో తీసుకునేవారు కాదు. అరవడానికి, చప్పట్లు కొట్టడానికి, ఈలలు వేయడానికి, ఎవరితోన యినా పోట్లాడడానికి మటుకు నన్ను ఉపయో గించుకునే వాళ్లు. ఏలియాకు ఆటలు వచ్చు కాని ఆటల మీద ఎటువంటి శ్రద్ధ చూపించే వాడు కాదు-డ్రిల్లు మాస్టారు పట్టుకుని ఆడిస్తే తప్ప, చివరి గంట కొట్టగానే పుస్తకాలు సంచి లో సర్దుకుంటూ, "పద, వెళ్లిపోదాం" అని తొందరపెడుతోంటే కదల బుద్ది అయ్యేది కాదు, వాడికి ఇంటికి ఎప్పుడు వెళ్లిపోదామా అనుకోడానికి కారణం ఉంది. వాడి తల్లి మూడు సంవత్సరాల కిందట చనిపోయింది. వాళ్ల నాన్న మళ్లీ పెళ్లి చేసుకోలేదు. వాడికో తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. వాళ్లను చూసు కోవడం, స్కూలు నుండి ఇంటికి రాగానే వాళ్ల చేత హోం వర్కు చేయించడం, వంటా వార్పూ చూసుకోవడం అన్ని బాధ్యతలు తనే ఓపికగా చేస్తుండేవాడు. వాళ్ల నాన్న పేరున్న పుగాకు కంపెనీలోని ఆఫీసరు కారుకు డ్రయివరు.

ముక్కోపి. ఆయన ఉండగా వాళ్లింటికి వెళ్లడం నాకు భయంగా ఉండేది. పిల్లలు ఏ చిన్న తప్పు చేసినా బెల్టు తీసికొడ్తాడు. ఏమాత్రం కనికరం చూపడు. నాకు చాలా బాధవేసేది. తమ్ముడినీ, చెల్లెల్ని కొడుతోంటే ఏలియా అడ్డం వెళ్ళి ఆ బెల్టు వాళ్లకు తగలనీయకుండా తను తినే వాడు. "నాన్నా నన్నుకొట్టు, వాళ్లను కొట్టకు నాన్నా. ఆ తప్పంతా నాది" అంటూ వాళ్ల తప్పులు తన మీద వెసుకునేవాడు.

మొదట్లో చుట్టుపక్కల ఇళ్లవాళ్లు ఆయన ఏలియాను కొడుతోంటే అడ్డం వెళ్లి ఆపబోతే, "ఇది మీ ఇంటి విషయం కాదు. నా ఇంటి విషయం. మీ ఇంట్లో ఏదయినా జరుగుతున్న ప్పుడు నేను జోక్యం చేసుకున్నానా?" అంటుండేసరికి ఆ కుటుంబం గురించి పట్టించుకోవడం మానేశారు. ఏలియా రెండు మూడు రోజులకు ఒకసారయినా దెబ్బలు తింటున్నా మాటవరసకయినా నాతో ఎప్పుడూ చెప్పలేదు. వాడి ఆత్మన్యూనతా భావం ముట్టుకోవడం నాకు ఇష్టం లేక నేనెప్పుడూ ఆ మాట ఎత్తేవాడిని కాదు. అమితమయిన జాలి వేసేది. ఇద్దరు ముగ్గురు నన్ను అడిగారు. కాదన్నాను. నలుగురిలో వాడు చులకన కావడం నాకు ఇష్టం లేదు.

ఏలియా తెలివిగలవాడు. ప్రతి సబ్జక్ట్‌లోనూ నూటికి తొంబయి మార్కులు



పయిగా తెచ్చు కొనేవాడు. లెక్కల్లో అయితే వందకు వంద తప్పనిసరిగా వచ్చేవి. మా మాస్టార్లకు మరీ ముఖ్యంగా మా హెడ్‌మాస్టరు గారికి ఏలియా అంటే చాలా ఇష్టం. గౌరవంగా చూసేవాళ్లు. మొదట్లో నాకు లెక్కలు వచ్చేవి కావు. నూటికి నలభయి మార్కులు వచ్చాయంటే మా ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయేవారు. లెక్కలంటే నాకు భయం పోగొట్టి నా చేయి పట్టుకుని ముందుకు తీసుకు వెళ్లింది ఏలియానే. వాడు నాతో తప్ప ఎవరితోనూ ఎక్కువ మాట్లాడే వాడుకాదు. నా కది గర్వంగా ఉండేది.

లెక్కల క్లాసు అయిపోగానే ఏలియా నా దగ్గరగా వచ్చి నా కుడిచేతిని నా చేతుల్లోకి తీసుకున్నాడు. ఏ విషయం గురించో భయపడు తున్నట్టు అనిపించింది. "నీతో ఒక సంగతి చెప్పాలి. బయటకు వస్తావా?" అన్నాడు. వాడి ముఖంలో బాధ కనబడుతోంది. సామాన్యంగా వాడు ఉద్వేగానికి లోనుకాడు. "పద" అని లేచి వాడి కూడా క్లాసు గది బయటకు వచ్చి నడుస్తూ, "ఏమయింది?" అడిగాను.

వరండా చివరికంటా వచ్చి పిట్టగోడకు అనుకుని నుంచున్న తర్వాత చిన్నగా అన్నాడు, "నా పెన్ను పోయింది."

"మూడు రోజుల కింద మీ నాన్నగారు కొనిచ్చిందేనా?" తలూపాడు. "ఎక్కడ పోయింది?" "చెట్టుకింద కూర్చుని మనం భోజనాలు చేస్తున్నప్పుడు పోయి ఉండాలి." "జేబుల్లో ఉందేమో చూసుకున్నావా?"

"చూశాను. లేదు" అని నాముందే నిక్కరు, చొక్కా జేబుల్లో చేతులు పెట్టి జేబుల్లో ఉన్నాయన్నీ బయటకు తీసి నాకు చూపిస్తూ, "లేదురా" అన్నాడు. "పద. మనం భోజనం చేసిన చోటుకు వెళ్లి వెదుకుదాం." "అక్కడంతా వెదికాను. చాలా సేపు చూశాను. అందుకే క్లాసుకు తిరిగి రావడం ఆలస్యం అయింది" అని తల అడ్డంగా ఆడించి, "ప్చ్. దొరకలేదు" అన్నాడు. "ఒక పని చేద్దాం". ఏమిటన్నట్టు చూశాడు. "హెడ్మాస్టరుగారి దగ్గరకు వెళ్లి చెబుదాం". "ఆయనే చేయగలడు?" నీ కొత్త పెన్ను పోయిందని సర్క్యులర్ తీసుకుందాం". "ఇస్తారా?"

"నువ్వు నాతోరా. నేనిప్పిస్తాను. నా ముఖం చూసి కాదు. నిన్ను చూసి ఇస్తాడు. రా" అని రెండడుగులు ముందుకు వేశాను. ఏలియా కదలలేదు. పిట్టగోడకు అనుకునే ఉన్నాడు. వెనక్కి వచ్చి, వాడి చేయి పట్టుకుని, "నువ్వు నాకూడా వచ్చి నా పక్కనే ఉండు, మిగతా పనులు నేను చేసుకుంటాను." అన్నాను. చదువులో వెనకయినా మిగిలిన విషయాల్లో ముందుంటాను.

హెడ్మాస్టరు గారి గదిలోకి నడిచాను. 'నేను లోపలికి రావచ్చా సార్?' అని అడిగి అనుమతి తీసుకుని ఆయన గదిలోకి రాకపోతే చిరాకు పడి అరుస్తాడు. అడగకుండా ఆయన గదిలోకి మేం వచ్చినందుకు నా వంక కోపంగా చూస్తూ ఏదో అనబోయాడు. కాని, నా పక్కన ఉన్న ఏలియాను చూశాక ఏమీ అనలేదు. ఒక్క గుక్క

లో జరిగింది చెప్పేసరికి ఆయనకూ జాలి వేసింది. "అయ్యయ్యో" అని బల్లసొరుగులోంచి తెల్లకాయితం తీసి, దానిమీద నాలుగు వాక్యా లు చకచక రాసి, "ఇలా రాశాను. వినండి. స్కూలు ఫయినల్ 'ఎ' సెక్షన్ విద్యార్థి బి.కె. ఏలియా తన కొత్త గోధుమ రంగు రేనార్ పెన్ను భోజన విరామ సమయంలో పోగొట్టు కున్నాడు. దొరికిన వాళ్లు దాన్ని అతనికి వెంటనే తిరిగి ఇచ్చేయమని విజ్ఞప్తి చేస్తున్నాను. చాలుకదూ, ఇంకేమయినా రాయమంటావా?" ఏలియాను చూస్తూ అడిగాడు. "చాలండి" అన్నాడు ఏలియా.

హెడ్మాస్టరుగారు చివర సంతకం పెట్టి, రబ్బరుస్టాంపు వేసి, "ప్రతి క్లాసుకు వెళ్లండి.

ఏ క్లాసూ వదలొద్దు. ఒకవేళ క్లాసులో మాస్టారు లేకపోతే క్లాసు మానిటర్ కిచ్చి నేను చదివి పిల్లలకు వినిపించమన్నానని చెప్పండి. ఏలియాతోపాటు నువ్వు కూడా వెళ్లరా... బంట్రోతు లేడు. పోస్టాఫీసుకు పంపించాను. ఉండుంటే వాడినే పంపించే వాడిని. అన్ని క్లాసుల్లో చదివించండి. తప్పకుండా దొరుకు తుంది. దొరకగానే వచ్చి నాతో చెప్పడం మర్చి పోకు" అన్నాడు.

తలూపి బయటకు వచ్చి ఏ క్లాసూ వదల కుండా సర్క్యులర్ చదివించాం. లాభం లేక పోయింది. కొత్త పెన్ను దొరికితే ఎవరు తిరిగి స్తారు? నిరాశపడ్డాం. దొరకలేదన్న సంగతి హెడ్మాస్టరుగారికి చెబుదామని ఆయన గదికి వెళ్ళాం. లేడు. బయటకు వెళ్లాడని బంట్రోతు చెప్పాక నీరసం వచ్చింది.

బడి వదలి పెట్టాక ఆశ చావక మేం ఎక్కడ యితే కూర్చుని భోజనం చేశామో అక్కడ ఆ చుట్టుపక్కల, మంచి నీళ్ల టేంకు దగ్గర ముప్పా వు గంటపాటు వెదికాం. పెన్ను దొరకలేదు. ఏలియాకు విసుగు పుట్టిందేమో, "చాల్లేరా, ఎవరి చేతిలోకో వెళ్లిపోయింది... వెళ్దాం పద ..." అన్నాడు.

పుస్తకాల సంచులు భుజాలకు తగిలించు కుని ఇంటి ముఖం పట్టాం. పెన్నుపోయినం దుకు ఏలియాలో అంతకు ముందున్న ఉదాసీ నత తగ్గింది కాని సంతోషంగా మటుకు లేడు. నడుస్తున్నాం. మేమిద్దరం ఉన్నప్పుడు వాడే ఎక్కువగా మాట్లాడుతూ ఉంటాడు. నేను వింటుంటాను. వాడికి చాలా విషయాలు తెలుసు. వాళ్లనాన్న ఊళ్లో లేనప్పుడు స్టేట్ లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు చదువుతూ ఉంటాడు. నన్నూ రమ్మనేవాడుకాని వాడిలా గంటల సేపు కూర్చుని పుస్తకాలు చదివే ఓపిక నాకు లేదు.

రెండు మూడు సార్లు మటుకు వెళ్లాను. ఆ తర్వాత నా వలన కాలేదు.

నడుస్తూ వాళ్ల అమ్మ గురించి ఆలోచిస్తున్నా డనుకుంటాను, "మా అమ్మ చాలా మంచిదిరా" అన్నాడు. వాళ్ల అమ్మ బతికి ఉండగా చాలా సార్లు వాళ్లింటికి వెళ్లాను. వెళ్లినప్పుడల్లా నన్ను అప్యాయంగా పలకరించి తినడానికి ఏవయినా ఇచ్చేది. ఆమె ఇల్లు కదిలి బయటకు రావడం నేనెప్పుడూ చూడలేదు. ఏలియాలా చాలా తక్కువ మందితో మాట్లాడేది.

"నీ పెన్ను పోయిన సంగతి మీ నాన్నగారికి తెలియనీయకుండా ఉంచలేవా?" అడిగాను. తక్కువ ఖరీదు పెన్ను అయి ఉంటే మా అమ్మ దగ్గరో నాన్న దగ్గరో ఏదో మిష మీద డబ్బులు తీసుకుని వాటితో ఏలియాకు పెన్ను కొనిచ్చే వాడిని. అంత డబ్బు నాకు ఇవ్వరు.

ఏలియా తల అడ్డంగా ఆడించి "ఉంచ లేను. కష్టం. పోగొట్టుకున్నందుకు నాన్న నన్ను చంపేస్తాడురా..." నవ్వుతూనే అన్నాడు. ఆ నవ్వులో నాకు ఎటువంటి బాధ కనిపిం చలేదు.

స్టేషను చేరుకున్నాం. స్టేషను దాటితే మా పేట వెల్లేదారి వస్తుంది. స్టేషను మీంచి మాకు అడ్డదారి లేకుంటే చుట్టూ తిరిగి వెళ్లాలి. దూరం అవుతుంది. మేం చేరుకున్న సమయా నికి తెనాలి వెళ్లే బండి మొదటి ప్లాట్‌ఫాం మీద బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. సిగ్నలిచ్చి ఉంది. సామాన్యంగా ఆ బండి వెళ్లిపోయాక గాని మేం పట్టాల దాటి మొదటి ప్లాట్‌ఫాంకు వెళ్లం. ఇంటికి వెళ్లడానికి ఏలియా

తొందర పడు తున్నాడనుకుంటాను, "ఈ బండి ఎప్పుడు బయల్దేరుతుందో, ఏమో? చివరి కంపార్టు మెంటు వెనక నుండి వెళ్దాం" అన్నాడు.

అటూ ఇటూ చూశాను. రెండో లయిన్లోకి ఏ బండీ వస్తున్నట్టు లేదు. "సరే" అని పట్టాల మీదకు వచ్చాను. నా వెనకే ఏలియా దిగాడు. రెండు లయిన్ల మధ్య ఉన్న సన్నదారి మీదకు వచ్చి నడవడం మొదలెట్టాను. వాడునా వెనకే నడుస్తున్నాడు. నేను దేని గురించో అడుగుతు న్నాను. వాడు జవాబు చెపుతున్నాడు. మరో రెండు కంపార్టుమెంట్లు దాటితే బండి చివరికి వచ్చేస్తాం.

ఇంజను కూతవేసి కదిలింది. ఆగాను. అప్పటి వరకు నాతో మాట్లాడుతున్న ఏలియా ఏం మాట్లాడక పోవడంతో వెనక్కి తిరిగి చూశాను. పుస్తకాల సంచి దారిలో పడి ఉంది. బండి కిందకు వెళ్లిపోయాడు. నా గుండె ఝల్లు మంది. వాడింత ఘోరానికి ఒడికడతాడని నేను ఊహించలేదు. ఏమాత్రం అనుమానం వచ్చినా వాడి పక్కనే ఉండి చేయిపట్టుకుని వదిలి ఉండే వాడిని కాదు. ఏడుస్తూ అరవడం మొదలె ట్టాను. బండిచక్రం ఏలియాను లాకుంటూ వెళ్తోంటే ఎవరూ ఏం చేయాలేకపోతున్నారు.

ఏలియా కొట్టుకు లాడుతున్నాడు. చివరి కంపా ర్టుమెంటు దాటుతుండగా ఏలియా శరీరం రెండుగా విడిపోయింది. పేగులు బయటకు వచ్చేశాయి. తట్టుకోవడం కష్టమయి పోతోంది. ఏడుస్తూ ఏలియా తల దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నం చేయబోతే ఎవరో నన్ను గట్టిగా పట్టుకుని పక్కకు తీసుకెళ్లారు. ప్లాటు ఫాం చివర బండి ఆగింది. ఏలియా చని పోయిన చోట జనం చేరుతున్నారు. నన్ను ఏవేవో ప్రశ్నలు వేస్తున్నారు. దేనికీ సమాధానం చెప్పలేకపోతున్నాను.

పోలీసులు వచ్చాక శవాన్ని రెండోనెంబరు ప్లాట్‌ఫాం మీద ఒక పక్కగా చేర్చి దుప్పటి



కప్పి పంచనామా మొదలుపెట్టారు. ఏలియా చనిపోయిన వార్త అందరికీ తెలిసిపోయి నట్టుంది. ఏలియా తండ్రి, మానాన్న, మా స్కూలు హెడ్మాస్టరు గారు, అయిదారుగురు టీచర్లు, మా పేట కుర్రాళ్లు వచ్చారు. ఏలియా తో చివరి వరకు నేనున్నాను కాబట్టి నన్నెటూ వెళ్లనీయలేదు. తెప్పరిల్లుతున్నాను కాని ఏలియా చనిపోతున్న దృశ్యం నా మనసులో కదులుతోంటే ఎంత ఆపుకుంటున్నా దుఃఖం ఆగడం లేదు.

ఏం జరిగిందో, ఎలా జరిగిందో పూస గుచ్చినట్టు నేను చెబితే ఒక పోలీసు రాసు కున్నాడు. ఇంకో పోలీసు శవం నిక్కరు జేబుల్లో ఉన్న ఒక్కక్కవస్తువును బయటకు తీస్తోంటే

మరో అతను వస్తువుల పేర్లు వరసగా రాసు కుంటున్నాడు. జేబుల్లోంచి బ్లేడు, రెండు రబ్బ ర్లు, షార్పనరు, నాలుగు రంగు పెన్సిళ్లు, రెండు మామూలు పెన్సిళ్లు, రుమాలు, చాక్లెట్‌లు ఏవేవో చిన్న చిన్న వస్తువులు ఉన్నాయి. ఎవరూ ఏం మాట్లాడడం లేదు. గాలి నిశ్శబ్దంగా బిగుసుకు పోయినట్టుగా ఉంది.

"అంతేనా?" రాసుకుంటున్న అతను అడిగాడు. "అంతే". "వెనక జేబులో ఏమ యినా ఉన్నాయేమో చూడు" దుప్పటి కొద్దిగా పయికెత్తి చేయి మరింత లోపలికి పోనిచ్చి అర నిమిషం తర్వాత చేయి బయటకు తీశాడు. అతని చేతిలో రేనాల్డ్స్ పెన్ను ఉంది. ●

# గాయం

గాయం ఎంత బాధామయమైనా
దానికి లేదు ప్రత్యామ్నాయం
గాయం విషాదానికి సంతోషానికి
మధ్యనిలిచే సమన్వయం
గాయం మనసుల్ని తొలిచేయొచ్చు
ఈ వ్యధాజ్వలిత జీవికకన్నా
చావే నయం అన్పించొచ్చు
గాయం నీ జీవితంలో
దుర్భర దుర్వాసనల్ని నింపొచ్చు
కానీ గాయం నీవనుకొన్నంత అపాయం కాదు
చిన్నప్పుడు అమ్మ నా గాయాల్ని పిండి
ఆమె గుండెనిండా నా గాయాల్ని నింపుకొని
కన్నీరు కారుస్తుంటే నా చిన్ని చేతుల్తో
అమ్మ అశ్రుధారల్ని తుడిచేవాణ్ణి
అప్పుడనిపించలేదు
గాయం యవనప్రాయంలో
ఉన్నతానుభవ శిఖరాలపై నిలుపుతుందని
గాయం రక్షణ వలయం
రక్తార్ణవం విమోచనా ప్రతీక
ప్రతి గాయం ఆత్మీయ జీవితంలో
ఓ మలుపు
గాయాన్ని భరించినవారిదే అంతిమ గెలుపు
గాయాలే లేకుంటే జీవన మాధుర్యమెలా
బాధామయగాథలే లేకుంటే గెలుకుతుంది
చిరునగవుల సుధ ఎలా చిలుకుతుంది
గాయాలే లేకుంటే సిలువ యాగ మెక్కడిది
రక్తార్పణ లోపిస్తే రక్షణానందం ఎక్కడిది
ప్రతిగాయం జీవనపుటలో
నూతనాధ్యాయం
పాడుకో పరవశించి గాయాల తంత్రుల్ని
మీటుకొంటూ క్రొత్త కీర్తన
గాయాన్ని దేవుడు ఏసే
గాయాన్ని పూర్తిగా మాన్పు దేవుడు క్రీస్తే !

**కవిరత్న డా॥ గంధం**

# గంగా స్నానానికి, బాప్తీస్మానికి తేడా తెలియాలి

**మేడిది రాజమణి లేక్లీన్**



బైబిలుతోపాటు ప్రతీ ఇతర సాహిత్యం చదివి తీరాలనేది నా వాదన:– "ఆది యందు వాక్యముండెను... వాక్యము దేవుడై యుండెను ... సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు." యెహాను 1:1–3 "దేవుడు లేడని బుద్ధిహీనులు తలస్తున్నారు. (కీర్తన53:1) ఐతే దేవుడు చేసిన సృష్టికి ప్రతిసృష్టిచేసి, సృష్టికర్తయైన దేవునికి విరోధ ముగా–భూమిని ఆకాశమును తల్లక్రిందు లుగా చేయగలనని, సభాపర్వతము పైకెక్కి కూర్చోవాలనే ఆకాంక్షతో, భూమిమీద దేవుడు తన మహిమ కొరకు, తన స్నేహితులుగా చిరకాలము ఒడుటకు చేసుకున్న నరులకు కల్లబొల్లి కబుర్లు చెప్పి, "ఇది నిజమా?" అన్న ఒక్క అనుమానపు తెరతో దేవున్ని మానవు లను వేరుచేసి, అనుమానపు జ్వాలరగిలించి, మోసగించి నరులందరిని వశ పర్చుకొని లోకాధికారిగా చలామణి అవుతున్న సాతా నుడి (బెలియాలు) చర్యలు, అతని వివిధ తంత్రాలు, మంత్రాలు, జ్యోతి శ్శాస్త్రా లు, విపరీతకల్పనా కథలు, పుక్కిటి పురా ణాలు, గద్యపద్య రూపకాలుగా వివిధ శత కాలు, నవలలు, నాటకాలు, నటనా చాతు ర్యంతో, వివిధ లోకాకార్షణల ప్రకటనలు పత్రికలలో వెలువడే వివిధరకాల వ్యాఖ్యానాలు, సాహిత్యాలు ఎలాగైనా దేవుడు లేడన్న వాదన, వున్నా ఆయన్ను మరపిం పచేయాలన్న సాతానుడి ఊహ, శూన్యం నుండే సృష్టిలయలు, పంచ భూతాలు పుట్టా యని నిరూపించడానికి సైంటిస్టులు పడే తపన, ఇవన్నీ మీడియాల ద్వారానే కాదు, పుస్తకాల ద్వారా ప్రపంచ నలుమూలల నుండి ప్రచురితమై అన్ని ప్రాంతాలకు, దేశా లకు, పట్టణాలకు చివరికి ప్రతి గడప గడపకు అందించబడి తలుపు తట్టి లేపుతుంటే అదేమిటి? బైబిలేమిటి? అన్న సత్యాన్వేషణ గల ప్రతీ విశ్వాసి, భక్తుడు, క్రైస్తవుడు, ఇతర సాహిత్యం చదవాల్సిందే, గంగస్నానానికి, బాప్తిస్మానికి, తేడా చెప్పాలి కదా?

"శ్రేష్టమైన ప్రతి ఈవియు, సంపూర్ణమైన ప్రతివరము – విద్య, కుటుం బము, పిల్లలు, ఉద్యోగము, ధనాభివృద్ధి పలుకుబడి మొదలగునవి. పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్దనుండి వచ్చును. యోహా 1:7 అని మన మెరుగుదుము. వట్టి పూసలదండలు వేల ఖరీ దుకు అమ్మి ఇవన్నీ మీకు దొరుకునని నమ్మించే జమ్మిక్కులున్నవి లోకంలో. అన్నీ చదివి, బైబిలు సత్యాలు సత్యాలని నిరూపించాలి. దైవజనుడవైతే తప్పు ఖండించాలి. మనం బలవంతుల మనుకుంటే చాలదు. ప్రత్యర్థి బలాబలాలు కూడ తెలిసికొని తల పడాలి. "నన్నుబల పర్చు వానినిబట్టిసమస్తము చేయుగల్గుచున్నానని పౌలు గారు సత్యం గ్రహించాకే ఈమాట చెప్పారు. దేవునికి స్తోత్రము. ●

## మీతో ఓ చిన్నమాట

*ఓ ఇండియాటుడే పత్రిక, ఓ వీక్లీ, ఓ సాంఘిక నవల, మరేదో కవితాసంపుటి లేక ఆన్యమత గ్రంథం. ఇవి ఏ క్రైస్తవ విశ్వాసి చేతిలో కనబడితే అతడా పుస్తకాల్ని చదువుతూ వుంటే ఏమనుకుంటారు? కొందరు బోధకుల దృష్టిలో క్రైస్తవుడు బైబిల్ తప్ప మరో లౌకికమైన పుస్తకమేదే ముట్టుకోరాదు. సూత్రప్రాయంగానైనా మరో పుస్తకం నుండి విషయసేకరణను కూడా వాళ్ళు అంగీకరించరు. అయితే వీళ్ళెవరూ చర్చకు ముందుకు రారు తమ అభిప్రాయం చెప్పరు.*

*అంతరాంతరాల్లో వాళ్ళ వైఖరి మాత్రం స్థిరం అందుకే "క్రైస్తవులు బైబిల్తప్ప మరే సాహిత్యం చదవరాదా?" అనే చర్చలో మాకు భిన్న స్వరాలు వినబడలేదు. క్రైస్తవుడు యితర సాహిత్యం చదవడంలో తప్పు బోదన్ వాళ్ళే? మాకు ఉత్తరాలు వ్రాశారు. దీనిని వ్యతిరేకించే వాళ్ళు లేరా? ఉన్నారు! వాళ్ళు వాళ్ళ వాదన వ్రాసి పంపించి వుంటే ఈ చర్చ రక్తికట్టేది - నిర్వాహకుల మైన మాకు అన్ని వైఖరులు ఆహ్వానించ దగినవి. అప్పుడే ఒక నిర్ధారణకు రాగలం అంచేత ఇక్కడితో ఈ చర్చను ముగించి మరో అంశాన్ని మా పాఠకుల ముందుకు తెస్తున్నాం.*

*ఇకనైనా మా పాఠకులు వారి మనోభావాలను స్వేచ్ఛగా వెల్లడించడానికి వెనకంజ వేయనక్కర్లేదు. మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం రండి! చర్చా వేదికలో పాల్గొనండి ఈ వేదిక మీదగా భావించండి. (సం)*

## చర్చకు ఆహ్వానం

ఆయా క్రైస్తవ సామాజిక అంశాలు సమస్యలపై స్వర్ణదీపిక పత్రికాముఖంగా నెలనెలా చర్చను నిర్వహించాలని భావిస్తున్నది. ఈచర్చలో పాల్గొనే పాఠకులు విధిగా స్వర్ణదీపిక చందా దారులై వుండాలి. ఇచ్చిన అంశంపై మీరు మీ అభిప్రాయాన్ని లేదా వాదనను నిర్మొహమాటంగా వ్రాయవచ్చు. తెల్లపేపరుపై ఒకేవైపు ఒక్క పేజీ మించ కుండా వ్రాసి పంపండి. మీ ఫోటో, చిరునామా మరియు స్వర్ణదీపిక చందా నెంబరు వ్రాసి మాకు వెంటనే ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు.

**ఈమాసపు అంశం :**

**క్రైస్తవులు తమ పిల్లలకు బైబిల్ పేర్లే పెట్టుకోవాలా? రక్షణ పొందిన తరువాత పేరు మార్చుకోవాలా?**

గమనిక : మీ వాదన / అభిప్రాయము ఆగష్టు 20, 2010లోగా మాకు పంపండి. ఎంపికైన వాదన / అభిప్రాయం సమర్థించేదైనా, వ్యతిరేకించేదైనా కావచ్చు. అట్టిరచనకు ఒక మంచి పుస్తకం బహుమతిగా పంపబడును.

**SWARNA DEEPIKA,** D.No. 28-16-18/1, Chintavari St., Arundalpet. Vijayawada - 520 002, Ph:0866 2434277, 9392135100

# హీరో గొప్పదనం తెలియాలంటే విలన్ కూడా వుండాలి కదా

వై. సోము రతన్ అరోరా



సర్వమానవాళి ఆత్మలను రక్షించే శక్తి దేవుడు తన వాక్యమైన బైబిలుకు మాత్రమే ఇచ్చాడు. మీ ఆత్మలను రక్షింప శక్తిగల వాక్యమును సాత్వీకముతో అంగీకరించుడి (యాకోబు 1:21).

అయితే బైబిలు వ్రాయబడే విధానాన్ని చూస్తే మనకెంతో ఆశ్చర్యమేస్తుంది. ఎందుకంటే బైబిలులో దేవుని ఆజ్ఞలతో పాటు సైన్సుకు సంబంధించిన విషయాలు, చరిత్ర, మానసిక శాస్త్రం, సామాజిక పరమైన అంశాలు, విశ్వాన్ని గూర్చిన వివరణ, భూగర్భ శాస్త్రము ఇలా అనేకమైన విషయాలు పొందుపరచబడ్డాయి.

భవిష్యత్‌లో మానవుడు దైవజ్ఞానాన్ని ప్రక్కకు బెట్టి, లోకజ్ఞానంపై మక్కువ పెంచుకుంటు, విర్రవీగుతాడని దేవునికి ముందే తెలుసు, అందుకే శాస్త్రం పుట్టకముందే శాస్త్రా నికి సంబంధించిన విషయాలు, చరిత్ర జరగక ముందే చరిత్రకు సంబంధించిన విషయాలు బైబిలులో దేవుడు వ్రాయించాడు. భూమి గుండ్రంగా వుందని, శూన్యంలో వ్రేలాడు తుందని, భూమి లోపలిభాగం వేడిగా వుంటుందని, భూమిలో నూనె నిల్వలు వున్నాయని, నక్షత్రాలు కదులుతున్నాయని, చంద్రుని వలన రుతువులు వస్తాయని ఇలా ఎన్నో విషయాలు వ్రాయబడ్డాయి. ప్రపంచాన్ని బబులోను సామ్రాజ్యము, మాదీయ పారశీకులు, గ్రీకులు, రోమీయులు, పరిపాలిస్తారని ఏనాడో వ్రాయబడ్డాయి.

ఈనాడు బాంబులతో దద్దరిల్లు తున్న బాగ్దాద్ చరిత్ర ఏనాడో బైబిలులో లభించబడ్డది. మనస్తత్వ శాస్త్రం గూర్చి సామెతలు, ప్రసంగి గ్రంథాలలో వ్రాయ బడ్డాయి. అలాగే మానవులు భూమి మీద తప్ప ఎక్కడా బ్రతకలేదని, జట్టు రంగును మార్చు కోలేదని, తన ఎత్తు పెంచుకోలేదని ఇలా పలు అంశాలు కూడా బైబిల్ గ్రంథంలో వ్రాయబడ్డాయి. ఇన్ని విషయాలు బైబిలులో పొందు పర్చడానికి గల కారణం ఈలోకజ్ఞానం కన్నా దైవజ్ఞానమే గొప్పదని ప్రపంచానికి తెలియచేయడానికి.

కాబట్టి దైవజ్ఞానం యొక్క గొప్పదనం తెలియాలంటే లోకజ్ఞానం పై కొంత అవగాహన అవసరం. సైన్సుకన్నా బైబిలు గొప్పది అని చెప్పాలంటే సైన్సుగురించి కొంత జ్ఞానం అవసరం. ఒకసారి పౌలుగారు మాటలు చూడండి. ప్రతి మనష్యుని క్రీస్తు నందు సంపూర్ణుని చేసి ఆయనయెదుట నిలువ బెట్టవలెనని, సమస్త విధములైన జ్ఞానముతో మేము ప్రతిమనుష్యునికి బుద్ధి చెప్పుచూ, ప్రతి మనుష్యునికి బోధించుచూ ఆయనను ప్రకటించుచున్నాము. (కొలస్సీ 1:28).

సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనీయుడి (కొలస్సీ 3:16) పై వాక్యాలను బట్టి బైబిల్‌తో పాటు ఇతర సాహిత్యాలపట్ల జ్ఞానము అవసరమని, అప్పుడే మనుష్యులందరికి ఖచ్చితంగా మనం వాక్యం బోధించగలమని మనకు అర్థమగుచున్నది. హీరో గొప్పదనం తెలియాలంటే విలన్ కూడా వుండాలి కదా.

కాబట్టి బైబిలు యొక్క గొప్ప తనాన్ని తెలియచేయడానికి ఇతర సాహిత్యాలను కూడా చదవాలి. ఇక సువార్తికులకు దేవుడిచ్చే మరో ఆజ్ఞ ఏమిటంటే, హేతు వడుగు ప్రతివానికిని సాత్వీకంతోను, భయ ముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడూ సిద్ధం గా వుండాలి. (1 పేతురు 3:16) బైబిలుపై ఎవరు ఏ కోణంలో ప్రశ్నించినా సమాధానం చెప్పే స్థాయిలో క్రైస్తవుడుండాలి. బైబిలు శాస్త్రీయంగా తప్పు అని ఎవరైనా అంటే శాస్త్రపరంగా బైబిలు నిజమని నిరూపించాలి. అంటే బోధకునికి సైన్సుపై అవగాహన వుండాలి. మరో వాక్యం చూడండి. ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు (1 కొరింథీ 2:14)

దేవుడు లేడు అనే వాడి దగ్గరకు వెళ్లి దేవుడు ప్రేమామయుడు అని చెబితే నమ్మడు, దేవుడు లేడు అని చెప్పడానికి వాని వెనుక ఎన్నో సిద్దాంతాలుంటాయి. వాటన్నిటికి సమాధానం చెప్పే స్థాయిలో క్రైస్తవుడుండాలి. మరో వాక్యాన్ని చూడండి. సత్యవాక్యమును సరిగా విభజించి ఉపదేశించువారిగా వుండు టకు జాగ్రత్తపడుము (2 తిమోతి 2:15) ఇక్కడ వాక్యాన్ని విభజించి ఉపదేశించమంటు న్నాడు. అంటే శాస్త్రీయంగా కానివ్వండి, చరిత్రపరంగా కానివ్వండి, ఇలా ఎన్ని రకాలుగా విభజించ గలిగితే అంత బాగా బైబిలు యొక్క గొప్పతనం అందరికీ మనం ప్రకటించగలం.

అంటే దైవజ్ఞానంతో ఇతర సాహిత్యాలపై అవగాహన వుంటేనే బైబిలు యొక్క గొప్ప దనాన్ని ఈ ప్రపంచానికి చాటించగలం. కనుక ఇతర సాహిత్యాలు కూడా మనం ఖచ్చితంగా చదవాలి. ●

**GRACE INSTITUTE OF BIBLICAL STUDIES**
Kerala Hotel Center, Ibrahimpatnam,Krishna Dt. 521 456, A.P

B.TH Degree @ Full Scholarship
Medium Of Instruction - ENGLISH

Duration : 4 Years for S.S.C.,Matric.,classXPass.
3 Years for Inter., Class XII Pass.

**Doctrine, Disciplilne & English Speaking, Field Ministry given utmost emphasis.**

**Director : 9246418755, 80197 84751**

# సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుడి



కె.లూథర్

నాకు తెలిసిన ఒక పాష్టరుఉన్నారు. ఆయన తన సంఘస్తులకు జబ్బువస్తే, ఆసు పత్రికి వెళ్ళవద్దు, మందులు వాడవద్దు, ఔషధ సేవనం అంటే ప్రభువుపట్ల, ప్రార్ధనపట్ల విశ్వాసం లేకపోవుటవే అంటూ యాకోబు పత్రిక 5:14-15 చదువుతాడు. ఒకసారి ఆయనకే జ్వరం వచ్చింది. సంఘమంతావచ్చి ప్రార్ధనలు చేసారు. నాలుగు రోజులు గడిచాయి. జ్వరముకాస్త చలిజర్వంగా మారింది. ఆసుపత్రికి వెళ్ళాడు. వారం, పది రోజులు బెడ్ మీద ఉన్నాడు. హాస్పటల్ బిల్లు ఏడువేల రూపాయలు అయింది. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నాడు. 70 రూపాయలతో పోయేదానికి ఏడువేలు అయింది. ఇపుడు మత్తయి సువార్త 9:12 చెపుతున్నాడు. రోగులుకే గాని ఆరోగ్యము గలవారికి వైద్యు డక్కర లేదుగదా! ప్రభువు చెప్పినమాట ఆ రోజుల్లోనే ఆసుపత్రులు ఉన్నాయ్. వైద్యులు ఉన్నారు. పుట్టు గ్రుడ్డివాని కళ్ళకు ప్రభువు మందు వేసాడు (యోహా ను సువార్త 9:6) హిజ్కియా పుండుకు యెషయా అంజూరపు పండ్ల ముద్దను వేసికట్టు కట్టారు. (2వ రాజులు 20:7) అని చెప్పి తన మొదటి అభిప్రాయాన్ని మార్చుకున్నారు.

2 కొరింథి 5:9-11లో పాల్‌గారు అన్యు లలో విజ్ఞుడుగా వుండకుడి అంటారు. అంటే ఇరుగు పొరుగున ఉన్న ఇతర మతస్థులతో స్నేహం చేయవద్దని, సహాయం చేయవద్దని కాదు. మానవుడు సంఘజీవి. ఈ వాక్యాన్ని తప్పుగా అర్ధం చేసుకుంటారని ఆయన 1 కొరింథి 6:14లో వివరణ యిస్తాడు (చదవండి)

నీవు క్రైస్తవ తల్లిదండ్రులకు పుట్టావు వారిని బట్టి నీకు క్రైస్తవుడనే ముద్రవేసారు. ఆ విధ ముగా నీవు క్రీస్తుపై విశ్వాసము కలిగి యున్నావు. అది పక్వతలేని విశ్వాసము. ఆ నీ విశ్వాసానికి ఎపుడైనా ఎదురురాయి తగి లిందో అపుడు నీవు క్రీస్తు ప్రభువు కాదంటావు. అసలు దేవుడే లేడంటావు. అందుకనే యేసును నీ స్వంత రక్షకునిగా అంగీకరించు అంటారు. ఏదో స్వస్థత కూటాలకి వెళితే రోగం నయమయిందని ఏదో పాష్టరుకి లెటర్ వ్రాస్తే అమ్మాయికి పెండ్లి కుదిరిందని, అబ్బాయికి ఉద్యోగము వచ్చిందని, వ్యాపారంలో లాభాలు వచ్చాయని యేసును నమ్ముకుంటే అది సంపూర్ణమైన విశ్వాసము కాదు. అపవాదికి కూడా బలము ఉన్నదని తెలుసుకో. సాతాను కూడా వరాలు యివ్వగలడు. కోరికలు తీర్చగలడు. నీ విశ్వాసగృహము స్థిరమైన రాతి పునాది పై వేసుకోవాలంటే నీవు తప్పక దేవుళ్ళను గురించి, దేవతలను గురించి చదవాలి, తెలుసు కోవాలి. వారు చరిత్ర పురుషులేకాని, దేవుళ్ళు కారు. దేవుడు జ్ఞానాధిపతి. మరణపాశములు ఆయన చేతిలోనే ఉన్నాయి. వారు మరణ మయ్యారు. కాని తిరిగి లేవ లేదు. మరణము జయించి తిరిగి లేచినవాడు క్రీస్తు ఒక్కడే. పాల్ గారు వ్రాసిన 1 థెస్సలోనీయులకు 5:21 లో యిలాఅంటారు. "సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుడి" నీ వస్తువును అమ్ముకోవాలంటే ఇతర వస్తువులలోని లోపాలు ఎత్తి చూపాలి. నిరూపించాలి అపుడే నీ వస్తువుకు గిరాకీ పెరుగుతుంది. లేని యెడల నీ వస్తువు యొక్క సామర్ధ్యము గురించి ఎంత చెపుకున్నా అది పొగడ్తే అవుతుంది. డబ్బా కొట్టుకోవటమే అవుతుంది. (కాని మన రాజ్యాంగము ఈ విధానమును ఒప్పుకోదు.)

"క్రైస్తవులు బైబిలు తప్ప ఇతర వేరే సాహిత్యము చదవరాదా! మీ అభిప్రాయాలు వ్రాసి పంపండి'' ఇది ప్రకటన. ఈ ప్రకటన చదవడానికి చదవటం రావాలి. నా అభిప్రాయం వ్రాయటానికి వ్రాయటం రావాలి. ఇవి పుట్టుకతో వచ్చేవి కావు. బడికి వెళ్ళాలి. పంతులుగారు చెప్పాలి. ఆయన చేతిలో నున్న పాఠ్యపుస్తకము బైబిలు కాదు. ఆ పుస్తకములో క్రీస్తును గురించి వుంటుంది. కృష్ణుని గురించి వుంటుంది. రాముని గురించి వుంటుంది. అల్లాని గురించి వుంటుంది. ఇంకా చరిత్ర, భూగోళము, సామాన్య శాస్త్రము, గణితము అన్ని సబ్జెక్టులు ఉంటాయి. అవన్నీ చదువు కుంటే, నేర్చుకుంటే జ్ఞానము వస్తుంది. డిగ్రీలు వస్తాయి. ఉద్యోగాలు వస్తాయి. రచయితలు, కవులు, బైబిలు పండితులు, పాస్టరులు అవుతారు. అంతేగాని కొలస్సీ2:3 చదివి "బుద్ధి జ్ఞాన స్వరసంపదలు ఆయనయందే గుప్తమై యున్నవి" అని చేతులు కట్టుకొని ఉండవద్దు పిలిచిన వారు తిండి పెట్టుకపోతారా? అని పొలు చేతులు ముడుచుకు కూర్చోలేదు. ●

డా|| యమ్. నిర్మలానంద

# వివేచనతో చదవాలి.

"క్రైస్తవులు బైబిలుతప్ప మరే ఇతర సాహిత్యం చదువరాదా?"

చదువ వచ్చును, చదవాలి కూడ, అయితే ఏమి చదవాలి ఎలా చదవాలి అనేది, వివేక వంతులైన పాఠకుల మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు క్రైస్తవ సాహిత్యము వ్రాసేవారు చదవడం, రాయటం అనే అంశాలు (Reading skills and writing skills) మీద ఉన్న విషయ పరిజ్ఞానాన్ని గ్రహించాలి. ఎక్కడ పేరా పెట్టాలి. ఎక్కడ కామా, ఎక్కడ సెమికోలన్ పెట్టాలి మొదలగునవి చదవాలి. అపుడు మనం ఇతరు లతో చెప్పాలని అనుకున్న అంశము చదివేవారికి అర్ధము అవుతుంది. తేలిగ్గా చదవడానికి వీలవుతుంది. వ్రాసేటపుడు చిన్న చిన్న వాక్యాలు రాస్తే ఇంకా బాగుంటుంది. పాఠకులకు మీరు వ్రాసిన దానిమీద గ్రిప్ ఉంటుంది. ఈ కొదువ క్రైస్తవ వ్యాసాలు, వాక్య వివరణ ఇచ్చే వారిలో నేనుచూస్తున్నాను. (We have to read to upgrade our skills to use in His services). ఇకపోతే క్రైస్తవ సాహిత్యంలో బైబిల్ తర్వాత



చెప్పుకోదగ్గది యాత్రికుని ప్రయాణము అని మనకందరికి తెలుసు. దాన్ని చదివి రక్షణ పొందిన వారున్నారని నేను చదివాను. బిల్లీ గ్రహం గారి రచనలు నేను చిన్నప్పటి నుంచి చదివాను. పాల్ యాంగిచో, వాచ్‌మెన్‌నీ, మొదల గువారు వ్రాసిన అంశాలు ఎంతో మందికి ప్రయోజనం చేకూర్చాయి. యేసుక్రీస్తు ప్రభువు అందరిని ఒకే లాగ సృష్టించలేదు. రక రకములైన తలాంతులు మనకిచ్చాడు. అలాంటి తలాంతు ల్లో వ్రాయడం ద్వారా ఒకరు హెచ్చరింపబడటం, మేలు పొందటంలో తప్పు లేదు. భక్తులైన వారి జీవిత చరిత్రలు, మంచి సాక్ష్యాలు, ఇలా ఎన్నో వారి బైబిల్ సిద్ధాంతాలకు వ్యతి రేకమైనవి, చాలా తెలివిగా లోకజ్ఞానంతో వ్రాసే మోసకరమైనవి చదువకూడదు. మన బుర్రపాడు చేసు కోకూడదు. అందుకనే వివేచనతో కూడిన ఎంపిక ఆత్మీయ జీవితానికి ఉపయోగపడగలదు. ●

# మానవుడు నిరంతర విద్యార్థి

రెవ. బి.దయానందము



**చ**ర్చ క్రైస్తవులు బైబిల్ తప్పమరేయితర సాహిత్యం చదువరాదా?

ఈ ప్రశ్నలో చాలా సంకుచితత్వం, కురు చతనం గోచరిస్తుంది. నిరభ్యంతరంగా క్రైస్తవు లందరూ బైబిల్‌తో పాటు యితర సాహిత్యం తప్పక చదవాలి. అనాదినుండి మానవుడు నిరంతర అన్వేషి. విద్యార్థి కాకుంటే అదాము వలె ఏదేను తోటలో దిగంబరిగానే చిరంజీవి గా మనుగడ సాగించేవాడు మరణ మెరుగక నేటి వరకు వృద్ధాప్యంకూడా లేకుండా జీవించే వాడు. ఈ అన్వేషణ ఫలితంగా మొదట సంపా దించుకున్న మధురమైన ఫలం మరణం. దాని క్రమంలో ప్రతి క్రొత్తదనం (Innovation) లో మరణం దాగివుంది. అందుకని అన్వేషణ మాన లేదు. మానకూడదు. తర్కంతో వితర్కం ఉంటేనే తర్కంలో సత్యం బయలు పడుతుంది. మంచి చెడుల తెలివినిచ్చు పండు తినిన వెంటనే ఈ అన్వేషణ హక్కు మానవునికి సంక్రమించింది.

ఆదికాండము 2:17లో దేవుడు – నీవు వాటి ని అనగా మంచి చెడ్డలనిచ్చు వృక్షఫలములు తినుదినమున నిశ్చయముగా చచ్చెదవని నరునికా జ్ఞాపించెను. తిన్నా ఆత్మీయంగా చచ్చిన శారీరకంగా 3:7లో వారిద్దరి కన్నులు తెరువ బడెను. గనుక మనమిప్పుడు కళ్ళు తెరచిన చచ్చిన క్రైస్తవులం. తెరచి ఉన్న కళ్ళు మూసికొని వెనుకకు పోయి బ్రతికే అవకాశం లేదు. గనుక యిలాగే తెరచిన కళ్ళతో యేసువైపు చూస్తూ ఈ విశ్వాసయాత్రను ముగించుటయే. (హెబ్రీ 12:2)

పగటి విలువ తెలిసేది చీకటి ఉన్నపుడే చేప రుచి, బలం మనంపొందాలంటే దానిపై ఉన్న పొలుసు వగైరా తీసి శుద్ధిచేయబడినపుడే దేనినైనా సరిపోల్చుటకు దానితో బాటు అలాంటి. మరొకటిగాని అంతకుమించినది కాని ఉండాలి. నేను 1963లో క్రొత్తగా రైల్వే ఉద్యోగం చేస్తున్నపుడు నిజదైవాన్వేషణ ప్రారం భించాను. ఆఫీసులో విహారయాత్రలు చేస్తుండే వారు. దానిలో భాగంగా భద్రాచలం, శ్రీశైలం, శ్రీమల్లిఖార్జున భ్రమరాంబ దేవా లయం, చివరిగా బెజవాడ శ్రీకనకదుర్గా మల్లీశ్వరుల దేవాలయాలను దర్శించాను. ఛ! క్రైస్తవుడనైయుండి ఇదేమి అన్వేషణయని సిగ్గుపడి రాయల్‌హోటల్ ఎదురుగాఉన్న తెలుగు బాప్టిస్టు చర్చిలో ఒకాదివారం, రెండవ వారం గాంధికొండ అడుగున ఉన్న లూథరన్ చర్చికి, ఆ తర్వాత ప్రక్కనే ఉన్న బైబిలు మిషను చర్చిల ఆరాధనలలో పాల్గొన్నాను. పల్లెటూరి వాడ్నేమో అంత తృప్తికలుగలేదు. నాల్గవ వారం పరి. పౌలు దేవాలయానికి వెళ్ళాను. అందులో అంగీల పాష్టర్లు, చర్చినిర్మాణం ఆరాధన క్రమాలు నన్ను ఆకర్షించాయి.

అంతే చర్చి సామాన్య సభ్యునిగా చేరి అంచె లంచె లుగా ఎదిగి 2003లో అధ్యక్షఖండ కౌన్సి లింగ్ సభ్యునిగా దీవించబడే స్థితినుండి అభి షిక్త గురువు (రెవరెండు)గా దీవించే స్థితిలో బయటకు వచ్చి సింగినగర్‌లో పరి. యోహాను సంఘంలో ప్రెస్బైటర్‌గా పరిచర్యచేసి విశ్రాంతి లో నున్నాను. ఇది నా సత్యాన్వేషణ ఫలితం. దేవునికి స్తోత్రం నిజదేవుడ్ని తెలిసికొనటానికిది అవసరమైంది నాకు.

నేను హెడ్‌క్లర్క్ (Head clerk) గా పనిచేస్తున్న పుడు నా క్రింద పనిచేస్తున్న యిద్దరు గుమ స్తాలు ఒక వారం రోజులు ఒక వింత వాద నతో కాలం పాడుజేసి నావద్దకు తీర్పుకై వచ్చారు. వాదనాంశం మాంసాహారం మంచి దా? శాఖాహారం మంచిదా లేక గొప్పదా? వారిలో ఒకరు శాఖాహారి అరవబ్రాహ్మణుడు రెండవతను ఆంధ్ర మాంసాహారి. నేను ఆశాఖాహారిని తమరెప్పుడైనా మాంసాన్ని రుచి చూచారా ని ప్రశ్నించాను. లేదన్నాడు. అయితే రెండు ఆహారాల రుచులు చూచినవాని వాదన ప్రకారం మాంసాహారమే మంచిది/ గొప్పది అని నా అనుభవం కూడా జోడించి తీర్పు చెప్పాను. గనుక ఒక దానికంటె ఎక్కువ విషయాలలో పరి జ్ఞానం కలిగి యుండుట తప్పు కాదు. పైగా నిర్ణయం చేయటం తేలికౌ తుంది.

(Let knowledge come from all sides/ sources) అనే భావమిచ్చే ఒక నినాదం (Slogan) భాగానే అంద శకంలో ఆంధ్ర దిన పత్రిక పై బాగానే ఉండేది North, East, West, South అది వార్తయ్యింది. వార్తలు రోజూ క్రొత్తగానే ఉంటవి గదా!

అ.కార్య 17:21లో ఏదేన్సు వారంద రనూ, అక్కడ నివశించు పరదేశులును ఏదోయొక క్రొత్త సంగతి చెప్పుటయందును. వినుట యిందును మాత్రమే తమ కాలమును గడుపు చుండు వారు అదే అధ్యాయం 11వ.లో వారు థెస్సలోనికలో ఉన్న వారికంటె ఘనులై యుండిరి. గనుక ఆసక్తితో వాక్య మును అంగీకరించి పౌలును శీలయును చెప్పిన సంగతులు అలాగున్నవో లేవో అని ప్రతిదినము లేఖనములను పరిశోధించుచు వచ్చిరి. యేసులో నన్ను వారంతా నూతన సృష్టే యేసే చెప్పిన ఈ మాట – తనను నమ్మిన యూదులతో మీరు నా వాక్యము నందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యము గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులుగా జేయును. (యోహా 8:32)

గనుక కూపస్తమండూకం లాగా సంకుచిత స్వభావంతో ఒక్క బైబిలు తప్ప యితర సాహిత్యం చదువకుంటే – బైబిలును గూర్చిన వ్యాఖ్యానాలు, విశ్లేషణలు, పాటలు, ప్రసంగ పత్రికలు, ప్రార్థనలు, పోలికలకై యితర విశ్వాసాల రచనలు వగైరా ప్రపంచ మంతటిలో వెలువడి అత్యంత విలువైన సాహిత్యమంతా చదవాలి. ●

# మన పూర్వపు భక్తులు అన్ని గ్రంథాలు చదివినవారే

రెవ.కె.యస్.భూషణం



పైన పేర్కొన బడిన చర్చనీయాంశంలో ప్రధాన మైన పదములు నాల్గున్నవి. 1. క్రైస్తవులు 2. బైబిలు 3. సాహిత్యం 4. చదువు. "క్రైస్తవులు" అనగా క్రీస్తుని దేవుని కుమారుడని, మానవుల రక్షకుడని విశ్వసించి మారు మనస్సునొంది బాప్తిస్మము తీసి కొన్నవారు. "క్రైస్తవులు" అనే పదం బైబిలులో మొట్టమొదట అ.కా. 11.26లో చూస్తాము. 1పేతురు 4:16

ప్రపంచంలో మహోన్నతమైన గ్రంథం "బైబిలు " ఇది క్రైస్తవులకు పవిత్ర గ్రంథం. క్రీ.పూ 1500 నుండి క్రీ.శ 100 వరకు, సుమారు 40మంది ప్రముఖ రచయితలచే లిఖింపబడిన 66 పుస్తకము లు గల అత్యద్భు తమైన పరిశుద్ధ గ్రంథం బైబిలు. అందువలనే ॥యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రములు దానిని ధ్యానిం చువాడు ధన్యుడు॥ అని కీర్త 1:2లో వ్రాయబడి నది. పరిశుద్ధ గ్రంథము యొక్క స్వరూప స్వభావ ములు 2వ తిమో 3:16,17 వచనములలో ప.పౌలు విశదీకరించి యున్నాడు. అందువలన క్రైస్తవులు ఎల్లప్పుడూ దైవ గ్రంథమును మరల, మరల చదువవలసి యున్నది. ధ్యానించవలసి యున్నది.

3వ పదమైన ''సాహిత్యం'' అను పదమునకు చాలా విస్తృతార్థమున్నది. మానవుడు తన చుట్టూ వున్న ప్రకృతి, అతని హృదయంలో యేర్పరచుకున్న భావములు ప్రతి ధ్వనించు సంగీతము మొ॥లగు నవన్నియు సాహిత్య మనబడును. కవులు రచిం చిన గద్యపద్య కార్య సముదాయము సాహిత్య మనబడును. ''పుస్తకములు అధికముగా రచింప బడును, దానికి అంతములేదు'' ప్రసంగి 12:12 లో, జ్ఞానియైన సొలోమోను చెప్పు చున్నాడు.

ప్రపంచంలోఅనేక సద్గ్రంథములు కలవు. మాన వులు వారి వారి అభిరుచులను బట్టి శాస్త్రములు, సాహిత్యము చదివి జ్ఞానము, మానసిక ఆనందము పొందుచున్నారు. 4వ పదం ''చదువు'' అనగానే పుస్తకం గుర్తుకొస్తుంది. అంటే గ్రంథ పఠనం, లేక, సాహిత్య పఠనం (A book is like a garden carried in the poedet?) అని చైనీయుల సామెత చెబు తుంది. తెలుగులో "పుస్తకం హస్తభూషణం" అనే సామెతకలదు. అంటే క్రైస్తవులైనా యితరులైనా అనేకపుస్తకములు, సాహిత్యం చదువవలెనని ధ్వనిస్తుంది. "Reading maketh a full man" Fra ncis Ba-con" సాహిత్య పఠనం మానవుని సంపూర్ణ విజ్ఞాన వంతునిగా పరిపూర్ణునిగా తీర్చిదిద్దు తుందని బేకన్ భావము.

"క్రైస్తవులు బైబిలు తప్ప మరే ఇతర సాహిత్యం చదువరాదా?'' అనే ప్రశ్నకు "చదువవలెను" అనేదే నా సమాధానం. క్రైస్తవుడు బైబిలు గ్రంథంతోపాటే అనేక పుస్తకములు (సాహిత్యం) చదివి జ్ఞాన మార్జించుట తప్పని సరియైన నాదృఢమైన అభిప్రాయం. ఎందు వలననగా ధర్మశాస్త్ర రచ యిత "మోషే ఐగుప్తీయుల సకల విద్యలనభ్యసించి మాటయందును ప్రవీణుడై యుండెను'' అని బైబిలులో వ్రాయబడియున్నది. జ్ఞాని సొలో మోను కూడ అనేక గ్రంథములు చదివి సామెతలను సేకరించెను.

పౌలు అనేక గ్రంథములను చేసిన మహా పండితులు 16వ శతాబ్దంలో మధురైలో జెష్యూట్ మిషన్ స్థాపించిన రాబర్టుడి నొబిలీ అనేక హిందూ మత గ్రంథములు చదివినట్లు 18వ శతా బ్దంలో సిరంపూర్‌లో బాప్టిస్టుమిషన్ స్థాపిం చిన డా॥ విలియంకేరీ అనేక భాషలు నేర్చుకొని, అనేక హిందూ గ్రంథము లు చదివి బైబిలును అనేక భాషల లోనికి అను వదించినట్లు సంఘచరిత్ర చెబుతున్నది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సువార్తికుడు డా. బిల్లీగ్రహం అనేక గ్రంథములు (సాహిత్యం) చదివిన మేధావి. ఈతరంలో కూడా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన క్రైస్తవ బోధకులందరూ బైబిలు మాత్రమే గాక ఇతర సాహిత్యం చదివి ఆ జ్ఞానమును దేవుని సేవలో వినియోగిస్తున్నవారే.

కాబట్టి క్రైస్తవులు బైబిలుతో పాటు మంచి సాహిత్య విలువలుగల ఇతర మత గ్రంథములు - వేదములు, భగవద్గీత, ఉపనిషత్తులు ఖురాను, మొదలగు గ్రంథము చదువలెను. క్రైస్తవ నాయకులైన డి.యల్. మూడీ, మార్టిన్ లూథర్, సాధుసుందరసింగ్, భక్తసింగ్ డా.విలి యంకేరి మొ.లగు వారి జీవితచరిత్రలను చదువవలసి యున్నది.

జాన్ మిల్టన్ వ్రాసిన. "Paradise Lost" జాన్ బనియన్ వ్రాసిన "Piligrims Progress" తప్పక చదువవలయును, క్రైస్తవులకు లౌకిక విద్య లేక యితర సాహిత్య పఠనం ఆటంకము కాదు. సాహి త్యజ్ఞానము క్రైస్తవునికి కూడా విజయ సోపానమే. క్రైస్తవులు బైబిలు తప్ప ఇతర సాహిత్యం చదువ రాదనే సూత్రం ఎక్కడాలేదు. ఒకవేళ వున్నట్లయితే ప్రస్తుత ప్రపంచంలో అది తప్పని నా ఉద్దేశ్యము. ●



# సంఘము ప్రగతి పథం

రెవ॥ కంచర్ల ప్రభుదాస్



క్రైస్తవ సంఘము క్రీస్తు రక్తంతో సంపాదించబడి క్రీస్తు ఆరోహణములో ప్రపంచమునకు ప్రత్యక్ష పరచబడింది. క్రైస్తవ సంఘము లోకములో ఉన్న ఏకైక అలౌకిక సంఘం. లౌకిక సంఘముగా మార్పు దిద్దుకొనకూడదు. సర్వలోకంలో యేసుక్రీస్తు సంఘము ఎక్కడ ఆవిర్భవించినా పరిశుద్ధాత్మ శక్తి పొంది సువార్త ప్రేషితోద్యమముగా రూపుదిద్దుకొని ఒక్క నూతన చైతన్య ఉద్యమముగా మానవ జీవితాలను ప్రభావితం చేసే సాధనం. నేటి సామాజిక వ్యవస్థలో మన సంఘములో రకరకాల కార్యక్రమముల ద్వారా మన యేసుని ఆరాధించు కొంటున్నాము.

సంఘము ః- సంఘము అను పదము పరిశుద్ధ లేఖనములలో మొట్ట మొదటిసారిగా మత్తయి సువార్త 16వ అధ్యాయము లోను; రెండవసారి 16:18లో కనబడుచున్నది. మత్తయి సువార్త దేవుని రాజ్యం గూర్చి ప్రకటించుచున్నది. ఈ బండమీద నా సంఘమును కట్టుదును. అని చెప్పిన వెంటనే పరలోకపు తాళపు చెవులు నీకిచ్చెదనని పేతురుకొక వాగ్దానం దొరికింది. పరిశుద్ధ గ్రంథం మొదట దేవుని రాజ్యమును తరువాత సంఘము కు ప్రవేశపెట్టుచున్నది. ఇక్కడ సంఘము పరలోక రాజ్యము ఏకమైఉన్నవి. సంఘము ఈ లోకం లో ఒక ప్రాణి. లోకంలో జీవించుచున్నది. సంఘములో జీవముంది. చలిస్తుంది. నడుస్తుంది. సంఘము ఆంగ్లములో "చర్చి" గ్రీకులో "కురియా కాస్" అనే పదం



నుండి తీయబడింది. "కురియా" అంటే ప్రభువు అనగా "కాస్" అంటే చెందినది. అనగా సంఘము ప్రభువు నకు చెందినది. గ్రీకులో సంఘమునకు ఎక్లెషియా (కాల్డ్ అవుడ్) అనగా లోకంలో నుండి బయటకు పిలువబడిన వారని అర్థం పరమ గీతంలో 7:1లో రాజకుమార పుత్రిక నీ పాదరక్షలతో నీవు ఎంత అందంగా నడుచు చున్నావు? పాద రక్షలు ఎఫెసీ 6:15లో పాదములకు సిద్ధమనస్సు అనే జోడు తొడుగు కొని... ఎంతో చక్కగా సంపాదించిన సంఘ మును అపొస్తుల కార్యములు 20:28లో లూకా సువార్తికుడు క్రైస్తవ సంఘము ప్రత్యేకిం చబడి ప్రతిష్టించబడి పరిశుద్ధ పరచబడిందనే విషయాన్ని విశదీకరించాడు.

ఈ సంఘమునకు ఆధారం క్రీస్తే, ఆయన పునాది మనం కట్టడం. ఈ సంఘమునకు అధికారం. క్రీస్తే ఆయన శిరస్సు. మనము శరీరం. ఈ సంఘమునకు అనురాగం క్రీస్తే ఆయన వరడు మనము వధువు.

1. సంఘ నాయకత్వం ః- సంఘ నాయకత్వం అనేది దేవుని మహిమ పరచి సంఘ శ్రేయస్సు ఆకాంక్షించి సంఘమును ప్రగతి బాటలో నడిపించుట, సంఘ నాయకులు కొంతమంది సంఘ కాపరియే నాయకుడు సంఘ నాయకులే పెద్దలు, సంఘ కాపరియే నాయకుడు సంఘ నాయకులే పెద్దలు, మేము ఒక్క సాధారణ నాయకులమని (Laymen) నిరుత్సాహ పడుతుంటారు. ఈ (Lay men) అనేమాట "లైటి" అనే గ్రీకుపదం నుండి వచ్చినది. "లైటి" అన్న మాటకు దేవుని ప్రజలు అని అర్థం (1 పేతురు) పేతురు వ్రాసిన మొదటి పత్రిక 2:9లో రాజులైన యాజక సమూహామును పరిశుద్ధ జనమును దేవుని సొతైన ప్రజలై యున్నారు. కాన నేను మామూలు సంఘ సభ్యుడనంటూ బాధ్యత నుండి తప్పించుకోవడం వివేకం కాదు. ప్రతి సంఘ సభ్యుడు దైవరాజ్య వ్యాప్తిలో నాయకుడు. ఈ రీతిగా పారమర్థిక పరిచర్య కొనసాగించటానికి సంఘ కార్యకలా పాలను నడిపించడానికి కొందరు ఆయన బాధ్యతలలో ప్రత్యేకించబడి ఉన్నారు. ఈనాటి క్రైస్తవ సంఘంలో విభేదాలు తలెత్తి సంఘం సిగ్గుతో తలదించుకోవలసిన పరిస్థితి ఏర్ప డింది. ఆనాడు, ఈనాడు ఏనాడు గాని సంఘ నాయకత్వం నుండి సంఘస్తులు కోరేది. పరి పాలన కాదు. పరిచర్య అధికారం కాదు. అణకువ గల నాయకత్వం, క్రొత్త నిబంధనలో నాయకత్వానికి నిర్వచనాలు కొన్నిటిని చూద్దాం.

ఎ) అధ్యక్షుడు ః- నాయకుడు, అద్యక్షుడు, కూడాను. ఈ అధ్యక్షత ఈనాడు మనం చూస్తున్న ఎన్నికల వలన సంక్రమించిన అధ్యక్షత కాదు. ఇది క్రీస్తు నుండి సంక్రమించిన ఆధిక్యతగా భావించాలి. ఇది పరిశుద్ధాత్మ ద్వారా ప్రసాధి తమైన అధిక్యత. అ.పొ.కా. 20:28 లో దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా వుంచెనో అని... పరిశుద్ధ లేఖనములలో అధ్యక్ష పదవి పరిశుద్ధాత్మ సారధ్యమున ఇవ్వబడినది. అని నిరూపించబడినది. అధ్యక్షుడు దేవుని గృహ నిర్వాహకునివలె నిందారహితుడై యుండ వలెను. (తీతు 1 అధ్యా 7 వచనము) ఈ లక్షణాలను క్రీస్తులో మూర్తిభవించినవి. నాయకుడన్నవాడు ఈ అర్హతలను క్రీస్తు నుండి పొందాలి అందుకే 1వ పేతురు 2:25లో మీరు గొర్రెల వలె దారితప్పి పోతిరి కాని ఇప్పుడు మీ ఆత్మల కాపరియు అధ్యక్షుడునైన ఆయన వైపుకు మళ్ళి యున్నారు. సంఘములో తాను పరిచార కుడిగా వుండి సంఘములో పరిచర్య జరుగు క్రమాన్ని పర్యవేక్షించాలి

బి) సంఘపెద్ద :- నాయకుడు సంఘ పెద్దగా వ్యవహరించాలి అయితే ఈ పెద్దరికం అధికారం చెలాఇంచడం కాదు. దైవసంకల్పం మానవుల మధ్య నెరవేర్చడం. పెద్ద అనే ఈ

సంప్రదాయం మోషే కాలం నుండి వచ్చింది. తన పని భారభారితమైనప్పుడు. తన మామ గారి సలహాలను గురించి మోషే 70 మంది పెద్దలను నియమించాడు. అపోస్తులు డైన పేతురు తోటి పెద్దలు అని చెప్పుకోవడం ఈ పెద్దరికం. పరిచర్యలో ప్రతిబింబిస్తుంది. క్రీస్తు జత పనివారుగా నిలుపుతుంది.

సి) పరిచారకుడు:– క్రీస్తు ప్రభువు మీలో గొప్పవాడు చిన్నవాని వలెను అధిపతి పరిచారకుడు వలె ఉండవలెను. అని లూకా 22:24లో వ్యక్తపరచెను. పరిచర్య చేయుటకు సిద్ధముగా ఉన్నవాడే నాయవత్వం వహిం చాలి. మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు. గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమిచ్చు టకు వచ్చెను. క్రీస్తులోని నాయకత్వ లక్షణం మనకు మాదిరికరం.

డి) కాపరి:– సంఘమును క్రమబద్ధ ముగా నడుపు కాపరత్వము మందకు మాదిరిగాను, మందను అధికారముతో గాక దీనత్వముతోను నడుపవలసిన బాధ్యత ఒక నాయకత్వము. వివిధ రంగములలో పని చేయు నాయకత్వమునకు పిలువబడ్డవారు సకల విధములైన పరిస్థితులలో కార్యకలా పాలలో దేవుని పట్ల పూచికత్వం కలిగి యుండుటయే నిజమైన నాయకత్వం.

2) సేవకత్వం :– నాయకత్వంలో పరిచర్య దాచబడి ప్రదర్శింపబడిన రీతిగా ప్రతి సభ్యు నిలో వుండ వలసిన ఇంకొక తలంపు. నేను సేవకుడని యేసుప్రభు సేవలో (సర్వెంటు) నీకాడి యెత్తుకొని స్వేచ్ఛగా ఇష్టపూర్వకంగా ఆయనతో ఏకీభవించాలి. కాడిలేకుండా ఆలయములలో ఊరికే నిలబడితే సంఘస్థులు ప్రదర్శకులే గాని క్రీస్తు వారసులు కాదు. సువార్త కాడితో భూమిదున్నని సేవకుడు శ్రమసేవకుడుకాదు.

సేవకునికి కీర్తి ప్రతిష్టలు లక్ష్యం కాకూ డదు. ఎప్పుడూ యజమానునికి లోబడి ఆయన చిత్తమును నెరవేర్చే వారిగా ఉండాలి. పాత నిబంధనలో సౌలు తనదృష్టిలో అల్పుడై ఉన్నప్పుడు. దేవుడు వానిని అధికముగా దీవించి ఇశ్రాయేలీయులకు మొదటి రాజుగా నియమించెను. సౌలుకు శక్తి సామర్థ్యాలున్నాయి నాయకునిగా నడిపించగల తెలివి తేటలు న్నాయి. మంచి సలహాల నిచ్చుటకు దైవానికి అంకితమైన సమూయేలు ప్రవక్త వున్నాడు. అతనికి చేదోడు వాదోడుగా నిలిచే రాజ భక్తిగల పరివారముంది. సద్గుణ శీలుడైన యోనాతాను అను తనయుడు వున్నాడు. కాని దేవుని చిత్తమును నిర్లక్ష్యము చేయడము అహంకరించి తన ప్రజలకు సేవక వృత్తి యొక్క భావాన్ని తనలో సమాధిచేసి స్వంత చిత్తమును నెరవేర్చు కొనే అసమర్థుడుగా అగుటవలన కత్తిపై తానే ప్రాణం విడువవలసిన పరిస్థితి ఏర్పడింది. నూతన నిభంధనలో సౌలు, పౌలు గా మారి సేవక త్వాన్ని తనలో మూర్తీభవింప జేసుకొని దీన త్వములో దీవింపబడ్డాడు. ఈనాడు క్రైస్తవ సంఘానికి ఈ సేవకత్వపు దర్శనం అవసరం అదే సంఘానికి ఎదుగు దల.

గొప్ప తనమనేది సంఘ అభివృద్ధికి కీడు చేస్తుంది. అంతేకాదు గొప్పతన్నాన్ని బట్టి పరిశుద్ధాత్మ శక్తిని ఎవ్వరూ పొందలేరు. గారడి సీమోను దేవుని మహాశక్తి అనబడువాడు వీడు అని అందరిచేత గొప్పగా పిలువబడవలెనని నేనెవరిమీద చేతులుంచెదను వాడు పరిశుద్ధాత్మను పొందునట్లుగా అధికారమి య్యుడి అని పేతురు, యోహానులు ఎదుట ద్రవ్యముంచాడు. ప్రభువైన యేసు జెబెదయ కుమారులలో ఇలా అన్నాడు. మీరేమి అడగబోవుచున్నారో మాకు తెలియదు నేను త్రాగబోవు గిన్నెలోనిది. మీరు త్రాగగలరా? గిన్నెలో అంటే ఏమిటి? అది అవమానం. అపహాస్యం. అవహేళన. అది శ్రమ. సేవకునిగా బలియాగం. సిలువ లేని యెడల మహిమ లేదు. ముండ్లకిరీటము లేని ఎడల జీవ కిరీటము లేదు. క్రీస్తుకొరకు శ్రమపడి సేవకధర్మం కలిగిన నాడే సంఘము నాలుగు గోడలుదాటి అభివృద్ధి చెందగలదు. ఎదగగలదు.

3) దాతృత్వము:– సంఘము క్రీస్తుయొక్క విమోచన మరియు సమాధానము పరిచర్య కొనసాగించుట కొరకై లోకమునకు దేవునిచే ఇవ్వబడిన ఒక కృపా కార్యం. తన సేవను కొనసాగించడానికి దేవుడు మానవునిపై ఆధారపడడు. క్రైస్తవ గృహనిర్వాహకుడు దేవునికి చెందినవాడు. క్రీస్తు అప్పగించిన గృహ నిర్వాహకత్వం నమ్మకముగా జరిగించని యెడల క్రైస్తవ సంఘానికి ఉనికి లేదు. సంఘము సువార్త ప్రేషితోద్యమము నిర్వహిం చాలి. ఆయన దినకార్యములు కొనసాగించ వలెను. తమ జీవితాలలో దేవుడిచ్చిన ప్రతిదానికి ప్రజలు కృతజ్ఞతాస్తుతులు చెల్లిం చాలి. ఆ కృతజ్ఞతాస్తుతిగా సాక్ష్యముగా, అర్పణగా దశమభాగము దేవుని సొత్తు. దశమ భాగము ఇచ్చుట ఔధార్యం దేవుని కృపా ప్రత్యక్షత. దశమ భాగము మానవత్వపు మూర్తి మత్వం. దశమభాగము ఇచ్చుట పరలోక పద్ధతి. ఇచ్చుటను గూర్చి పౌలు వర్థిల్లేకొలది యివ్వండని ఉత్సాహముగా ఇచ్చువానిని దేవుడు ప్రేమిస్తాడని వ్యక్తపరచాడు. ఇతరులమేలు నిమిత్తం చేసేప్రతి స్వీయ త్యాగ ప్రక్రియ ప్రయత్నములో శీలాన్ని బలపర్చుచూ లోక విమోచకునితో మిక్కిలి సన్నిహితాన్ని కలిగిస్తుంది. మన స్వభావమును ప్రదర్శించు నిమిత్తము ఆలోచనా శక్తులు,సామర్థ్యాలను తలాంతులను ఆస్తిని అనుగ్రహించెను. అమూల్యమైన ఆధిక్యాలను తరుణాలను మన చేరువలోనే వుంచాడు. మనము అలక్ష్యము చేయక వాటిని సంఘ శ్రేయస్సు కొరకు పంచినప్పుడు సంఘము అభివృద్ధి చెంది వర్ధిల్లుతుంది. లోకరీత్యా మాసిదోనియా విశ్వాసులంతా బీదలేగాని వారి హృదయములో మాత్రము దేవుని ప్రేమ నిత్యము పొంగి వచ్చేది. సువార్త పోషణకు వారానందముతో ఇచ్చేవారు 2కొరింథీ 8:14 11కొరింథీ 8:5 ఆమీదట వారికి కలిగినవారు సమృద్ధిగా ఇచ్చారు ఈలాంటి సంఘము ఇలా దాతృత్వంలోనే వర్థిల్లితేనే సంఘం పురోభివృద్ధి చెందును.

ప్రేమాహృదయంలో నుండి వచ్చే అర్పణను ఘనపరచడానికి దేవుడానందించి ఆయన సేవ నిమిత్తము వాటి కత్యంతమైన సామర్థ్యం కలిగిస్తాడు. మనలను ప్రేమించి మనకోసం తన సమస్తము సమర్పించిన ఆయనకు స్వేచ్ఛగా అర్పణలను అర్పించుదాం ఆధునిక సంఘము ఆధ్యాత్మిక అభివృద్ధిలో పయనించాలంటే నాయకత్వముతో కూడిన పరిచర్య సేవకత్వముతో కూడిన శ్రామిక దర్శనం, దాతృత్వముతో కూడిన ధారాళమైన మనసు ఎంతో అవసరం. వీటిని మనం స్వతంత్రించు కొందము గాక. ●

# మరో బాలశిక్ష

డా॥ కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్

"వినదగు నెవ్వరు చెప్పిన" అంటాడు సుమతి శతకకారుడు. అందునా అవి "నీతులు" అయినపుడు వినదగినవే కాదు. ఆచరింప దగినవి కూడా. నీతుల్ని, సూక్తుల్నీ మన సమాజం ఎప్పటికీ ఆహ్వానిస్తూనే ఉంటుంది. అందునా క్రైస్తవ సమాజం వాటిని అనుసరించడం ఎంతో అవసరం.

క్రీస్తు సంస్తుతితో ప్రారంభించి ప్రభువు మహిమను ఆయన సృష్టి వైచిత్రిని కొనియా డుతూ 'నీతి సుధల శతకం' ప్రారంభమౌ తుంది. ఇందులో కవికున్న భక్తి తత్పరత, ఔచిత్యం వెలుగు చూస్తాయి. ఆపైన కవి రావెల కొండమీద ప్రసంగాన్ని చక్కటి పద్యాల్లో వివ రించారు. ఈ శతకంలోని సూక్తి సుధలన్నీ చక్కటి ఆటవెలది చందస్సులో వ్రాయబడ్డాయి. కొండమీద ప్రసంగంలోని వివిధ విషయాల్ని ప్రస్తావించిన తదుపరి కవిరావెల అనేక సామాజికమైన నీతుల్ని, క్రైస్తవుడు పాటించవలసిన నియమాల్ని, జీవిత విధానాన్ని బాగా నిర్దే శించారు. అనర్గళంగా సాగిన సూక్తి సుధా ప్రవంతిలో ఎన్నో విషయాల్ని ప్రస్తావించి వారు ప్రజల్ని మేల్కొలిపిన తీరు అమోఘం. అనిర్వచ నీయం.

ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ (తెలుగు వేదాంత సాహితీ సమితి) ప్రచురిం చిన తెలుగు క్రైస్తవ దైవ జ్ఞాన గ్రంథమాల వరుసలో ఈ గ్రంథం 58వది. 65 పేజిల ఈ పుస్తకం ప్రతి క్రైస్తవుడి యింటా ఉండ దగిన ఓ చక్కటి బాలశిక్ష అని చెప్పవచ్చు. కవి, రచయితగా పేరెన్నిక గన్న రావెల జోసఫ్. ఈ గ్రంథకర్త 1937లో గుంటూరు జిల్లాలోని రావెలలో జన్మించారు.

1967లో బి.డి.డిగ్రీ, 1980లో యమ్.టెక్. చేశారు. 1987లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి యమ్.ఎ. పట్టా పుచ్చుకున్నారు. రామాయ పట్నంలోను, హైదరాబాద్ లోని, ఆంధ్ర క్రైస్తవ దైవజ్ఞాన కళాశాలలోను వీరు ప్రొఫెసర్‌గా పని చేశారు. బాప్టిస్టు సంఘముల సమావేశములో వీరు అనేక పదవులు నిర్వహించారు. క్రైస్తవ సాహితీ విహారం అనేక పదవులు నిర్వహించారు. క్రైస్తవ కళా ప్రపూర్ణ బిరుదునిచ్చి సత్కరించింది. వీరి వ్యాసాలు, కవితలు, పాటలు అనేక పత్రికలో ప్రచురింపబడ్డాయి. ఆకాశ వాణి, దూరదర్శన్ వంటి ఎలక్ట్రానిక్ మీడియా లో ప్రసారమయ్యాయి.



చురుకైన వీరి కలం నీతి సుధల్ని చిలికిన రీతి చూడండి. మనిషి తన తప్పులు ఒప్పుకున్న తర్వాతే దైవంతో స్నేహం కుదిరేది. దాన్ని కవి రావెల ఇలా చెప్తారు.

*తండ్రి వద్ద తనదు తప్పు*
*లొప్పుకొనక దాచు కొనెడు*
*వాడు ధాత్రి యందు పొంద*
*లేడు ఎట్టి పొందు ప్రభుని తోడ*
*విభుడు యేసు నందు విన్నవింతు.*

కళ్ళున్నా, లేకున్నా మనిషి ఆత్మనేత్రాన్ని (ఆధ్యాత్మిక దృష్టి) కల్గి ఉండాలి. భౌతికమైన దాని కన్నా ఆధ్యాత్మికమైనదే శాశ్వితం అంటూ హెచ్చరిస్తారు.

*"కన్ను బోయిన యెడ కలుగు కొంత*
*బాధ కన్ను కంటె ఆత్మ కన్ను మిన్న*
*ఆత్మ కన్నుబోవ అంతయు బోవురా"*

పెద్దలు చెప్పిన మాట జ్ఞానవంతుడు లక్ష్య పెడతాడు గర్విష్టియైన వాడు తన సొంత బలాన్ని బట్టి అతిశయిస్తూ ఎవరి మాటా ఆలకించడు. మనిషికి అసలైన బలం బుద్ధి బలమే అని చెబుతూ రావెల

"బుధులుచెప్పు మాట బుద్ధిమంతుడు
విను దాని తోసివేయు దానవుండు
బుద్ధి బలముచేత పొందలేనిది లేదు
విభుడు"

మానవుడి నుండి దేవుడు కోరుకునేది ఒక్కటే అది హృదయం ఎందుకంటే అది దేవుడు నివసింపగోరె ఆలయమని పేర్కొంటూ "విరిగి నలిగియున్న విమల హృదయమును అభిలసించు దైవ మమితముగను ఆత్మ దేవుని కది యాల యంబుగ నుండు విభుడు యేసు నందు విన్నవింతు".

ఇట్లా ఉటంకిస్తూ పోతే ఈ వ్యాఖ్యానం మరో పుస్తకమయ్యే ప్రమాదం వుంది.

232 పద్యాలతో వున్న ఈ గ్రంధాన్ని అసలు ద్విశతి అంటే ఉచితంగా ఉంటుందే మో! నిత్యజీవితానికి ఉపయోగపడే మంచి సూక్తుల్ని బైబిల్‌లోని ఆయా పుస్తకాల్లోంచి ఎంచుకుని పాఠకులకు వాటిని సుబోధకం చేయ డంలో రావెల వారి కృషి ప్రశంస నీయం ప్రత్యేకించి సొలొమోను వ్రాసిన సామెతల్ని వారు పద్యీకరించిన తీరు బావుంది. చివరిగా ఈ ఒక్క ఉదాహరణ చూడండి.

*"జార నారి యొద్ద జనువుగ మెలగిన*
*పశువు వధకు బోవు పగిడి నుండు*
*పరువు నష్టమగును ప్రాణహాని*
*జరుగు విభుడు యేసు నందు*
*విన్నవింతు"*

"విభుడు యేసు నందు విన్నవింతు" అనే ముక్తాయింపుతో అంతమయ్యే ఈ నీతిసుధల శతకము ప్రతియింటా ఉండదగ్గ ఓ మంచి పుస్తకం. ●

**పుస్తకము దొరుకుచోటు**

**ఆంధ్ర క్రిస్టియన్ థియోలాజికల్ కాలేజి**
లోయర్ ట్యాంక్ బండ్ రోడ్,
గాంధి నగర్, సికిందరాబాద్. ఆం॥ప్ర॥

**వెల :** అమూల్యం, **ప్రచురణ :** 2010

# దేవుడు మనకు తోడైయున్నాడు

బి. రేమా



"సైన్యముల కధిపతిగా యగు యెహోవా మనకు తోడైయున్నాడు.

యాకోబుయొక్క దేవుడు మనకు ఆశ్రయమైయున్నాడు." (కీర్త 46:11)

ఒక వ్యక్తి కుటుంబము తన గోత్రములో ఎన్నిక లేని దైనను, కులము తక్కువైననూ, జాతి తక్కువైనను, ఆర్ధికముగా వెనుకబడి ఉన్ననూ, సామాజిక గౌరవము లేకున్ననూ, విద్యావిహీనత కలిగి ఉన్ననూ, పలుకుబడి లేకున్ననూ తన్ను ఆత్మతోను, సత్యముతోను వెంబడించు వారందరికీ సహాయుడైయున్నాడు ప్రభువు.

అటువంటివాడు 1వ కీర్తన 3వ వచనములో చెప్పినట్లు "అతడు నీటికాలువల యోరను నాటబడినదై ఆకువాడక తన కాలయందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. అతడు చేయునదంతయు సఫలమగును" అన్నట్లు జరుగును ఇటువంటి వారిని మనము బైబిలు గ్రంధములో ఎంతోమందిని చూస్తాము.

ఉదాహరణకు గిద్యోను తీసికొంటే.....

మిద్యానీయుల నుండి రక్షణ: మిద్యానీయుల బాధపడలేక ఇశ్రీయేలీయులు దేవునికి మొఱ్ఱపెట్టారు. యోవాహు కుమారుడైన గిద్యోను మిద్యానీయులకు భయపడి గానుగ చాటునుండి గోధుమలను దుళ్లగొట్టుచున్నప్పుడు యెహోవా దూత అతనికి ప్రత్యక్షమై నీవు వెళ్లి ఇశ్రాయేలీయులను రక్షించు. నేను నిన్ను పంపుచున్నాను. యెహోవా నీకు తోడైయున్నాడని అభయమిచ్చాడు.

ఆరాత్రే నీవు లేచి దండు మీదికి పొమ్మునీ చేతికి దాని నప్పగించెదను. అని కూడా ధైర్యము చెప్పాడు. దేవుడు ఆ మాటలను విశ్వసించి గిద్యోను మూడు వందల మందితో దండెత్తి పోయాడు. ఆవిధముగా నడిఝాము మొదటి కావలివారు ఉంచబడ గానే గిద్యోను అతని దండువారు నూరు మంది దండు పాళెము కొట్టకొనకుపోయి బూర లను ఊది తమ చేతులతో నున్న కుండ లను పగుల గొట్టారు. అప్పుడు దేవుడు ప్రతివాని ఖడ్గము వాని పొరుగు వాని మీదికి తిప్పగా ఇశ్రాయేలీయులు కూడుకొని మిద్యానీయులను తరిమారు ఈ విధముగా ఇశ్రాయేలీయులు దేవుని సహాయముతో మిద్యానీయులను చంపారు. "మిమ్మును ముట్టినవాడు తన కనుగుడ్డును ముట్టిన వాడని యెంచి తనకు ఘనత తెచ్చుకొన దలచి, మిమ్మును దాచుకొనిన అన్యజనుల యొద్దకు ఆయన నన్ను పంపియున్నాడు.'" (జకర్యా 2:8)

ప్రభువు నిన్న నేడు రేపు ఏకరీతిగా ఉన్నాడు. ప్రభువు ప్రేమ అమూల్యమైనది. తన్ను ప్రేమించువారిని తన్ను నిజముగా ప్రేమించువారిని ఎవరైనా వేదనల పాలు చేయాలని ప్రయత్నిస్తే వెంటనే ఆయన వారి పీచమణచడానికి ఏమాత్రము వెనుదీయడు సరికదా... వారు మరి పైకిరాకుండా అణి చేయగలడు. ప్రభువు ప్రేమించు వారిలో నీవున్నావా? లేకుంటే ఈ రోజే సిద్ధపడు.

హిజ్కియా ప్రార్థనను అంగీకరించిన దేవుడు: ఆహాజు కుమారుడు, మనష్షే తండ్రి హిజ్కియా, హిజ్కియా వింత భక్తిపరుడో అంతగా భక్తిహీనులు ఆహాజు, మనష్షే అయితే వారిద్దరి అవిధేయత వారిమీదే శాపముగా నున్నదిగాని హిజ్కియా మీదకు రాలేదు. అష్షూరు రాజైన నవాబు హిజ్కియా మీదకి దండెత్తి వచ్చి పెద్దశబ్దముతో యెహోవాను నిందించాడు. హిజ్కియా అది విని దేవునికి మొరపెట్టుకున్నాడు.

''అష్షూరు రాజు పనివారు నన్ను దూషింపగా నీవు, వినిన మాటలకు భయపడవద్దు. అతనితో ఒకే ఆత్మను నేను పుట్టింతును. వదంతి విని అతడు తన దేశమునకు వెళ్లిపోవును. తన దేశమందు కత్తిచేత అతని కూల జేయుదును. అని దేవుడు సెలవిచ్చాడు.

నా నిమిత్తమును, నా సేవకుడైన దావీదు నిమిత్తమును నేను ఈ పట్టణమును కాపాడి రక్షించుదును. అని యెరూష లేమును గూర్చి దేవుడు మాట ఇచ్చాడు.

ఆరాత్రే యెహోవా దూత అష్షూరువారి దండు పేటలో జొచ్చి లక్ష యెనుబడి యయిదు వేలమందిని హతము చేశాడు. అష్షురు రాజైన సన్హెరీబు తిరిగి పోయి నీనెలే పట్టణమునకు వచ్చి నివసించిన తరువాత అతడు నిసోకు దేవతకు మొక్కుచుండగా అతని కుమారులైన అదెమ్మె లెకును షరెజెరును ఖడ్గమతో అతని చంపి అరాతు దేశములోనికి తప్పించుకొనిపోయారు.

కొసమెరుపు : నిన్ను ఆశ్రయించు వారందరు సంతోషించు దురు. నీవే వారిని కాపాడుదువు గనుక వారు నిత్యము ఆనంద ధ్వని చేయుదురు (కీర్తన 5:11)

దేవుని ఆశ్రయదుర్గముగా సేవించు వారికి కొదువ అనేది ఉండదు. వారి ముఖములు ఎల్లవేళలా సంతోష తరంగము లతో కళకళలాడుతూ శోభాతిశయముగా వెలిగిపోతూ ఉంటాయి.

అందుకే ప్రవక్తయైన హబక్కూకు అంటాడు...

"అంజూరపు చెట్లు పూయకుండినను
ద్రాక్షచెట్లు ఫలింపకపోయినను
ఒలీవచెట్లు కాపులేకయుండినను
చేనిలోని పైరు పంటకు రాకపోయినను
గొఱ్ఱెలు దొడ్డిలో లేకపోయినను
సాలలో పశువులు లేకపోయినను
నేను యెహోవాయందు ఆనందించెదను
నా రక్షణకర్తయైన నా దేవునియందు
నేను సంతోషించెదను."

(హబక్కూకు 3:17-18) ●

# బైబిల్ మాత్రమే చదివితే విషయ పరిజ్ఞానం లోపిస్తుంది.



**బి. మంజులా ప్రభాకర్, నిర్మల్**

"క్రైస్తవులు నమ్మేది బైబిల్. భక్తి, శ్రద్ధలతో పరిశుద్ధ పుస్తకంగా కొలిచేది బైబిల్. ప్రపంచం లోని మొదటి పుస్తకం బైబిల్ అని క్రైస్తవులంతా నమ్ము తారు. బైబిల్ ఒక ఆధ్యాత్మిక పుస్తకం అయినప్ప టికిని సృష్టి అంతా బైబిల్‌లో దాగి ఉంది. ఎన్నో మర్మాలు దాగి ఉన్నాయి. ఎంతో విషయ పరి జ్ఞానం బైబిల్‌లో వుంది. కొన్ని వేల సంవత్సరాల క్రితమే ప్రతి ఒక్క విషయం బైబిల్‌లో లభించ బడింది. భూత, భవిష్యత్తో, వర్తమాన కాలాల్తో సహా. ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయం, మానసిక రంగా లేకాకుండా భూగోళం, ఖగోళం, జంతు, జీవ, న్యాయ, వాస్తు, వృక్ష శాస్త్రాల గురించి ఎన్నో విషయాలు వివరింప బడ్డాయి. అదే విధంగా ఆచార వ్యవహారాలు, సాంప్రదాయం, మూఢన మ్మకాలు, సాంఘీక దూరాచారాల గూర్చి కూడా బైబిల్‌లో పేర్కొ నబడింది. ప్రేమ, వ్యామోహాల గూర్చి కూడా చెప్ప బడింది. బైబిల్‌లో లేనిది ఏది? ప్రస్తుత సాహిత్య మంతా మన బైబిల్ నుండి పుట్టు కొచ్చిందే. ఈ రోజు ప్రపంచమంతా సైన్స్ అండ్ టెక్నాలజీపై ఆధారపడింది. బైబిల్ నుండి పైన పేర్కొనబడిన శాస్త్రాలు, పరిశోధనలు, అన్నీ బైబిల్ నుండి వచ్చినవే. అందువలన ఇతర సాహిత్యం చదవడం తప్పుకాదు. కానీ, ఆ సాహిత్యం బూతు సాహిత్యం, వ్యామోహం, నవలలు లాంటి వాటిని చదవడం మాత్రం తప్పు. ప్రస్తుత ఆధునిక సమాజంలోని వివిధ అంశాలపై పరిజ్ఞానం పెంపొందించు కోవాలంటే తప్పనిసరిగా ఇతర సాహిత్యం చదవాలి. ఒక అంశంపై మనకు పట్టు రావాలంటే తప్పని సరిగా ఇతర సాహిత్యాలు చదవాలి. ఇలా చదివి నందు వలన బైబిల్‌లోని అంశాల్ని, ఇతర విషయాలో పోల్చి చెప్పగల్గుతాము. విశ్లేషించ గల్గుతాము. ప్రతి విషయంలో స్పష్ట మైన అవగాహన ఏర్పడుతుంది. ఇతర సాహిత్యాలు చదవ కుండా బైబిల్ మాత్ర మే చదివి నందు వలన విషయ పరిజ్ఞానం లోపిస్తుంది. అన్నింటిని అన్వయించుకుని మాట్లాడలేము. ఇతర మత స్తులతో వాదిస్తున్నపుడు వాదించలేము. బైబిల్ మాత్రమే చదివిన వారికి, బైబిల్‌తో పాటు ఇతర సాహిత్యం (మంచి) చదివిన వారికి చాలా వ్యత్యాసం స్పష్టంగా కన్పిస్తుంది. గనుక నా దృష్టిలో బైబిల్‌తో పాటు ఇతర సాహిత్యం తప్పకుండా చదవాలి. కానీ, బూతు నవలలు, ప్రేమ, కూడిన సాహిత్యం, డిటెక్టివ్ నవలలు చదవడం మాత్రం తప్పు. ●

---

**సమీక్ష**

# సత్యాన్వేషకుల కోసం...



**దేవుని ఆత్మనడిపింపుతో శ్రీమతి లిల్లీ భాస్కరరావు గారి కలం నుండి జాలువారిన మరో ఆణిముత్యం, అమూల్యగ్రంథం "ప్రవచనముల నెరవేర్పు". గతంలో వధింపబడిన దేవుని గొర్రెపిల్ల, రెండవది సంఘములో స్త్రీలు మాట్లాడ వచ్చునా? ఇది వీరి మూడవ రచన. ఈ పుస్తకంలో పాత నిబంధన ప్రవ క్తల నుండి క్రొత్త నిబంధన ప్రవక్తల వరకు ప్రవచించిన ప్రవచనాలు - వాటి నెరవేర్పు యింకా నెర వేరవలసిన ప్రవచనాలు, అంత మాత్రమే కాకుండా కలలు - వాటి భావాలు, దర్శనములు - వాటి నెరవేర్పు ఎంతో వివరంగా రచించారు. ఈ గ్రంథం చదువుతున్నప్పుడు స్వరజ్ఞుడైన దేవుని అంతర్యాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకొని, విశ్వాస జీవితాన్ని మలచు కోడానికి ఎంతో ఉపయోగ పడుతుంది. ఈ గ్రంథంపఠన ద్వారా దేవుని రాకడకు మనల్ని మనం ఏ విధంగా సిద్ధపర్చు కోవాలో విశదమౌతుంది. విశ్వాసులకు, దైవ సేవకులకు, సత్యాన్వేషకులకు ఎంతో ఆశీర్వాదకరమైన గ్రంథం. వెంటనే మీ కాపీని రిజర్వు చేసుకోండి. కాపీలు పరిమితం. బుక్‌స్టాల్స్ వారికి ప్రత్యేక తగ్గింపు కలదు.**




**పేజీలు : 222**
**వెల : 40/-**
**(పోస్టేజి రూ. 5/- అదనం)**

వివరాలకు మరియు ఎం.ఒ.పంపాల్సిన చిరునామా

**శ్రీమతి. ఎన్. లిల్లీ భాస్కర రావు**

10-53-296, గ్రేస్ ల్యాండ్, ఎల్.ఐ.జి. 23, నెహ్రూనగర్ కాలనీ, విశాఖపట్నం - 02



# ఆరాధన టి.వి.తో చేతులు కలపండి.
# ఒక గ్రామాన్ని దత్తత తీసుకోండి.

*ఒక గ్రామానికి సువార్త ప్రకటించాలని మీరెప్పుడైనా ఆశించారా? అక్కడి ప్రజలకు దీవెనగా ఉండాలని కోరుకున్నారా?*
*మీరెప్పుడూ కలవని ప్రజలు మీ వలన ఆశీర్వాదం పొందాలని అనుకుంటున్నారా?*
*మీ ద్వారా వేవేల ప్రజల ముఖాల్లో చిరునవ్వు కలగాలని ఆశిస్తున్నారా?*
*ఆ సువర్ణ అవకాశం ఆరాధన టి.వి. మీకు కల్పిస్తోంది.*
*ఆరాధన టి.వి.తో చేతులు కలపండి. ఆంధ్రప్రదేశ్‌లోని ఏదైనా ఒక గ్రామం అంతటికీ క్రీస్తు రక్షణ సందేశాన్ని అందించండి.*
*ఇది సాధ్యపడుతుందా?*
*సాధ్యపడుతుంది! ఎందుకంటే ఇప్పుడు ఆరాధన శాటిలైట్ ఛానెల్ రాష్ట్రంలో ఏ మారుమూలకైనా చేరుతోంది. చేయవలసిందల్లా లోకల్ కేబుల్ ఆపరేటర్ వద్ద ఒక 'డికోడర్' ఏర్పాటు చేయడమే. ఒక్కసారి డికోడర్‌ను ఏర్పాటు చేయగలిగితే ఇక ఆ గ్రామంలోని ప్రతి ఇంట్లోను ఆరాధన ప్రసారాలు ఇరవైనాలుగు గంటలు చూడవచ్చును. ఇందుకు మీరు సుమారు రూ. 10000/- ఖర్చు అవుతుంది. మీకు బాగా భారమున్న ఒక గ్రామం కోసం ఒక్కసారి మీరు రూ. 10000/- వెచ్చించగలిగితే ఇక నిరంతరం ఆ గ్రామంలో సువార్త వినబడుతూనే ఉంటుంది.*

*ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 28000 గ్రామాలున్నాయి. ఆరాధన టి.వి. ఇప్పటికే 16000 గ్రామాలు చేరుకుంది. ఇంకా 12000 గ్రామలు చేరుకోవాల్సి ఉంది. ఈ మహా సావార్తిక పరిచర్యలో మీరునూ భారం పంచుకోండి. ఒక గ్రామాన్ని దత్తత తీసుకోండి. ఆ గ్రామంలో వేవేల జీవితాలలో వెలుగు నింపండి.*

మరిన్ని వివరాలకు సంప్రదించండి :
**ఆరాధన టెలివిజన్**
బ్రదర్ వి.కె. హెన్రీ, 9000774893



# ఉద్దేశం అమోఘం...

స్వర్ణదీపిక - ఎడిటర్ గార్కి, జూలై మాసం 'స్వర్ణదీపిక' లో జాతశ్రీ గారు వ్రాసిన "పైరుగాలి" కథ చాలా బాగుంది. నేడు క్రైస్తవులు సూటు, బూటు వేసి, పెద్ద పెద్ద చదువులు చదివి, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, విశ్వ విద్యాలయాలలో ప్రొఫెసర్లుగా, విద్యా వేత్తలుగా సమాజంల్లో గౌరవ ప్రధామైన భారత్ పౌరులుగా మన గల్గుతున్నారంటే కేవలం మిషనరిల్ పెట్టిన విద్యాసంస్థలు, కారణం జాతశ్రీ గారు వ్రాసిన కథలోవారు వ్యక్తపరచిన వారి ఉద్దేశం అమోఘం. వారు వ్రాసి రెండు వాక్యాలు - దళితుడైన సదానందం గారు తాతల నుంచి క్రైస్తవులైనందున మిషనెరీ పాఠశాలలో చదవగలిగాడు ... మిషనెరీ కట్టు బాట్లలో పెరగడం వల్ల చిన్నప్పటి నుండి క్రమ శిక్షణ అలవడింది ... ఔను మిషనరీ పాఠశాలల్లో చదివిన వారు కచ్చితంగా క్రమ శిక్షణ కలిగి, ప్రత్యేక వ్యక్తులుగా ఉంటారు. ఒక వ్యక్తి ఎంతకాలం బ్రతికాడు? ఎన్ని డిగ్రీలు సంపాదించాడు? ఎన్నిసార్లు బైబిలు చదివాడు? ఎన్ని చర్చీలు కట్టించాడు? ఎన్నిసార్లు విదేశాల కెళ్లాడు? అనేది ముఖ్యంకాదు కాని తన జీవిత కాలం ఎలాసాగింది? సమాజానికి, సంఘానికి, తన వృత్తికి, తన పనిచేసిన సంస్థకు తన ఊరికి ఏమి చేసాడు? అనే విషయం ముఖ్యం. రచియిత వృత్తి ధర్మాన్ని వ్యక్తపరచి, తద్వారా వ్యక్తికి కలిగే తృప్తిని చక్కగా కథరూపంలో చెప్పినందున వారికి ధన్యవాదాలు.

- కె.జె.డబ్ల్యు.జయకుమార్, నెల్లూరు.

# సార్వత్రిక జనవాణి

స్వర్ణదీపిక కేవలం సార్వత్రిక క్రైస్తవ సంఘానికి సంబంధించిన పత్రిక మాత్రమే. ఇందులో ప్రొటెస్టెంట్, కేథలిక్ మరియు బలహీన వర్గాల స్వేచ్ఛాభిప్రాయాలను యధాతథంగా ప్రచురించడమే పత్రిక లక్ష్యం. ఇందులోని వ్యాసాలు, రచనలు ఆయా రచయితల అభిప్రాయాలే గాని, ప్రచురణకర్తవి కావు. తెలుగులో తొలి క్రైస్తవ వార్తాపత్రిక పేరొందిన ఈ స్వర్ణదీపికను చదవండి, చదివించండి, పదిమందికి పరిచయం చేయండి.

**సంవత్సర చందా : రూ. 200/-**

**జీవిత సభ్యత్వం : రూ. 2000/-**

**Central Bank of India A/C. No.1216888517 Swarna Deepika, Benzcircle Branch, Vijayawada -10**

**State Bank of India A/c. No.30365628812**
**B.Chitanya Varma, S.N.Puram Brach Vijayawada**

Swarna Deepika, 28-16-18/1, Chintavari St., Arundalpet.
Vijayawada - 520 002. Ph:0866 2434277, 9392135100
srisri032003@yahoo.com svjbellamkonda@g.mail.com
www.swarnadeepika.org

To make ready a people prepared for the Lord...
ప్రభువు కొరకు ఆయుత్తపడియున్న ప్రజలను సిద్ధపరచుటకై...

ఆత్మల పట్ల దాహం గలవారికి అద్భుత అవకాశం!

IPM INDIAN PRAYER HOUSE MISSION Evangelism - Training - Church Planting

భోజనం, వసతి, టీచింగ్, ఉచితం, సీట్లు పరిమితం!

IPM Invites you for its glorious Bible Training Classes 2010

IPM బైబిలు స్కూల్

డిప్లమో ఇన్ థియోలజీ (D.Th) 1 సంవత్సరము, విజయవాడ

ఆత్మల పట్ల, దేవుని పరిచర్య పట్ల ఆసక్తి కలిగి అనేకులను క్రీస్తు ప్రేమలోనికి నడిపించాలనే తపన కలిగి, ఎలా బోధించాలో, ఎలా నడిపించాలో నేర్చు కోవాలని ఆశకలిగి నూతన జన్మానుభవం కలిగిన, యువతి, యువకులకు ప్రభువు అనుగ్రహిస్తున్న ఓ మహోన్నత అవకాశం ఈ IPM బైబిలు స్కూల్.

జాతీయ, అంతర్జాతీయ అనుభవము గల దైవజనులచే ఏర్పాటు చేయబడుచున్న ఈ బైబిలు క్లాసులు మీ ఆత్మీయ జీవితాన్ని మరింత ప్రభావితం చేసి అనేకుల మధ్య మీరు బలంగా వాడబడునట్లు ఎన్నో ప్రత్యేకతలతో మిమ్మును తీర్చిదిద్దుతుంది.

★ ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్‌తో పాటు, సహవాసంలో సేవ చేసే అవకాశం కల్పించబడును

అప్లికేషన్స్ మాకు చేరవలసిన తేది : ఆగస్టు 28, క్లాసులు ప్రారంభం : సెప్టెంబరు 6

ఆసక్తి కలిగినవారు వెంటనే అప్లికేషన్ కొరకు ఈ దినమే రూ. 20/- క్రింది అడ్రస్సుకు M.O చేయండి.



రెవ. డా॥ జి. ఇమ్మానుయేలు, B.Th.,M.Th.,D.D (USA)
ప్రిన్సిపాల్, IPM బైబిల్ స్కూల్
పోస్టుబాక్సు 1019, మొగల్‌రాజపురం, విజయవాడ -10.
సెల్ : 9441056720

చదవండి! అగాపేస్వరం చదివించండి!!

మీ ఆత్మీయ క్షేమాభివృద్ధి కొరకై IPM అందిస్తున్న అద్భుత ఆధ్యాత్మిక మాసపత్రిక

వివరములకు: ఎడిటర్, అగాపేస్వరం, పోస్టుబాక్సు 1019, మొగల్‌రాజపురం, విజయవాడ -10

సెల్ : 9441056720 e-mail: pastoremmanuelg@yahoo.co.in. web: www.indianprayerhousemission.org

